www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



నిద్రలోనే అగ్నికి ఆహుతి

పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

టిప్పర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

చిన్నారి సహా ఆరుగురు సజీవ దహనం

మరో 29 మందికి గాయాలు 2

ఓటేయడానికి వచ్చి హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం

సంఘటనా స్థలంలో భీతావహ దృశ్యాలు

గురువారం | 16-5-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 30 |
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 6.23 తదుపరి నవమి; నక్షత్రం: మఖ సా. 6.14 తదుపరి పుబ్బ; వర్జ్యం: శేషం ఉ. 6.36, తె. 3.15-5.03; దుర్ముహూర్తం: ఉ. 10.03-10.54, మ. 3.11-4.02; అమృతఘడియలు: మ. 3.33-5.20; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.36
| విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



దుమ్మురేపిన ఓటర్!

ఓటింగ్ 81.86%.. గతంలోకంటే 1.98% అధికం

అసెంబ్లీ సెగ్మెంట్లలో 90.91 శాతంతో దర్శి టాప్

అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం

పార్లమెంటు స్థానాల్లో 87.06%తో ఒంగోలు ఫస్ట్

విశాఖలో అత్యల్పంగా 71.11% పోలింగ్

పట్టణాల్లో గతం కంటే 2.09% అధికం

142 స్థానాల్లో అతివలదే 'నిర్ణయం'

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. సరికొత్త రికార్డు సృష్టించారు. దేశంలో ఇప్పటి వరకు జరిగిన నాలుగు దశల పోలింగ్ ప్రక్రియలో ఏపీ టాప్‌లో నిలిచింది. సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తంగా 81.86 శాతం ఓట్లు పోలైనట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీనిలో ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1.2 శాతం పోలింగ్ నమోదైనట్టు తెలిపింది. 2019 ఎన్నికలతో పోల్చితే ఈసారి 1.98 శాతం పోలింగ్ పెరగడం గమనార్హం. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా బుధవారం ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 4,13,33,702 మంది ఓటర్లు ఉండగా వారిలో 3,33,40,560 మంది

మిగతా 12వ పేజీలో...




రాష్ట్రంలో ఏం జరుగుతోంది?

సీఎస్, డీజీపీకి ఈసీ సమన్లు

పోలింగ్ ముగిసినా ఈ హింస ఏమిటి?

కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్

ఎన్నికల రోజునా నిర్లక్ష్యం..

ఆ తర్వాత కూడా ఇంత నిర్లిప్తత?

ఈ హింసాకాండకు బాధ్యులెవరు?

నేడు ఢిల్లీ వచ్చి వివరణివ్వండి.. ఈసీ శ్రీముఖం

డీజీపీ, నిఘా చీఫ్‌తో జవహర్‌రెడ్డి అత్యవసర భేటీ

కమిషన్‌కు ఏం చెప్పాలనే దానిపై చర్చలు

ఇదంతా సీఎస్ వైఫల్యమేనని ఈసీ గుర్రు?



అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజు, ఆ తర్వాత కూడా రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాకాండపై కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) మండిపడింది. దీనిపై గురువారం ఢిల్లీ వచ్చి స్వయంగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను బుధవారం ఆదేశించింది. 'పోలింగ్ ముగిసిన తర్వాత కూడా హింసాత్మక ఘటనలు జరగడమేంటి? రాష్ట్రంలో ఈ రెండ్రోజుల్లో జరిగిన పరిణామాలకు బాధ్యులెవరు..? పోలింగ్ రోజు నిర్లక్ష్యం వహించారు.. ఆ తర్వాత కూడా నిర్లిప్తత కనిపిస్తోంది.. ఇంతకూ ఏపీలో ఏం జరుగుతోంది..? మీరిద్దరూ ఢిల్లీకి వచ్చి సమాధానం ఇవ్వండి' అని నిర్దేశించింది. పోలింగ్ ముందు రోజు అర్ధరాత్రి నుంచి మాచర్ల, నరసరావుపేట, చంద్రగిరి, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో వరుసగా కొనసాగుతున్న హింసాత్మక ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందా.. నిఘా వర్గాల సమాచారం లేదా.. పోలీసు బందోబస్తు చర్యల్లో లోపముందా తదితర అంశాలపై తమకు వివరణ ఇవ్వాలని స్పష్టంచేసింది. హింసాకాండ జరుగుతుందని

మిగతా 11వ పేజీలో...

కేసులతో 'కట్టిపడేసి'!

అల్లర్ల వెనుక వైసీపీ అసలు వ్యూహం

అనుచరులు చేజారకుండా చర్యలు

కేసులు నమోదైతే తమ చుట్టూ తిరగాల్సిందే

అందుకే.. ప్రత్యర్థులపై వరుస దాడులు

విద్వేషం చల్లారకుండా వ్యూహం

టీడీపీ వైపు వెళ్లకుండా ఆపేందుకే! 11

భార్యాబిడ్డలను హింసిస్తూ..

ఏజెంట్‌కు వీడియోకాల్

బూత్ వదిలి వెళ్లాలని బెదిరింపు.. పిన్నెల్లి గ్రామంలో పోలింగ్ రోజు రెచ్చిపోయిన వైసీపీ గూండాలు.. ఆలస్యంగా వెలుగులోకి

తాడిపత్రిలో ఉద్రిక్తత.. జేసీ అనుచరుడిపై ఖాకీల క్రౌర్యం

పిలిపించి చితగ్గొట్టిన పోలీసులు.. తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు

కారుతో ఢీకొట్టి... వేటకొడవలితో నరికి..

అఖిలప్రియ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుపై హత్యాయత్నం 11

నలుగురు ఎస్పీలపై ఈసీ కత్తి!

ఏ క్షణమైనా చర్య తీసుకునే అవకాశం

పల్నాడు హింస.. బిందు మాధవ్ మెడకు

పులివర్తి నానిపై దాడి.. తిరుపతి ఎస్పీపై వేటు

తాడిపత్రి బీభత్సం.. అమిత్ బర్దార్‌కు సంకటం

నంద్యాలలో 'పుష్ప' ర్యాలీ.. రఘువీర్‌రెడ్డి ఫైర్? 2

తవ్వకాలా.. అబ్బే అదేం లేదు

అంతా సవ్యంగానే ఉంది. భారీ యంత్రాలే లేవు.. అసలు రీచ్‌లే లేవు

ఇసుకపై ఎన్జీటీకి 22 మంది కలెక్టర్ల నివేదిక

అంతా ఒకే ఫార్మాట్..

పొల్లు పోకుండా..

పదం మారకుండా ఇచ్చారు

'ఆంధ్రజ్యోతి'కి చిక్కిన కలెక్టర్ల నివేదికలు


3

రైతన్నకు చల్లని కబురు!

ఒకరోజు ముందే నైరుతి రుతుపవనాలు.. 31న కేరళ తీరానికి: ఐఎండీ



ఈసారి సాధారణానికి మించి వర్షాలు

ఆగస్టు మొదటివారానికి లానినా పరిస్థితులు

భూ విజ్ఞాన శాఖ కార్యదర్శి ప్రకటన

ఎండలతో అల్లాడుతున్న రైతాంగానికి ఊరట

ప్రీ మాన్‌సూన్ సీజన్‌లో తుఫాన్ లేనట్టే

ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా 2

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

నేటి నుంచి ఈఏపీసెట్ పరీక్షలు.. 49 ప్రాంతాల్లో 142 కేంద్రాలు 3

ప్రపంచంలోనే సంపన్న పార్టీ బీజేపీ: ప్రియాంక

రాయ్‌బరేలీ, మే 15: కేవలం పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రపంచంలోనే అత్యంత సంపన్న పార్టీగా అవతరించిందని, అయినా అది కాంగ్రెస్‌ను అవినీతి పార్టీ అంటూ ఆరోపిస్తుందని ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు. బుధవారం రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె... ఎన్నికల బాండ్లలో భారీగా అవినీతి జరిగిందని మండిపడ్డారు. ప్రధాని సహా బీజేపీలో ప్రతి నేత మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ముందుంటారన్నారు.

లోకం తీరు



'ఇండియా'కు బయట నుంచి మద్దతు



కోల్‌కతా, మే 15 : ఇండియా కూటమి విషయంలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ స్వరం మారింది. సీట్ల పంపకం అంశంలో కాంగ్రెస్‌తో వచ్చిన విభేదాల వల్ల 'ఇండియా'కు దూరంగా ఉన్న ఆమె బుధవారం కూటమికి మద్దతుగా మాట్లాడారు. హుగ్లీ జిల్లాలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మమత మాట్లాడుతూ.. 400 స్థానాల్లో గెలిచి మళ్లీ అధికారం చేపడతామంటూ బీజేపీ చెబుతున్న మాటలను తోసిపుచ్చారు. అంతేకాక, ఇండియా కూటమి కేంద్రంలో అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతును తాము బయటి నుంచి ఇస్తామని ప్రకటించారు. అయితే, బీజేపీతో కలిసి పని చేస్తున్న బెంగాల్ కాంగ్రెస్, సీపీఐ పార్టీలు తమ దృష్టిలో ఇండియా కూటమిలో భాగం కాదన్నారు. తమ మద్దతు జాతీయ రాజకీయాలకే పరిమితమని మమత స్పష్టం చేశారు.

రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ యత్నం: రాహుల్

బోలంగిర్, మే 15: రాజ్యాంగాన్ని నాశనం చేయాలని, దళితులు, గిరిజనులు, బీసీలకు కల్పించిన రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. బుధవారం ఒడిశాలోని బోలంగిర్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈసారి బీజేపీ గెలిస్తే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తారని, దేశాన్ని 22మంది బిలియనీర్లు నడిపిస్తారని పేర్కొన్నారు. ప్రజల నుంచి జీఎస్టీ రూపంలో వసూలు చేసిన డబ్బు కేవలం ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు మాత్రమే వెళ్తోందని ఆరోపించారు. విమానాశ్రయాలను పారిశ్రామికవేత్తలకు అప్పగించడం, రక్షణ కాంట్రాక్టులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడమే తాము చేసిన అభివృద్ధిగా బీజేపీ చూపిస్తోందని ఎద్దేవా చేశారు. వారు 22మంది బిలియనీర్ల కోసం పనిచేస్తే, తాము కోట్ల మంది లక్షాధికారులను సృష్టించబోతున్నామని ప్రకటించారు.

మెషిన్‌గన్‌తో విరుచుకుపడే 'హెక్సాకాప్టర్'

- సైన్యంలోకి సరికొత్త డ్రోన్



న్యూఢిల్లీ, మే 15: భారత రక్షణ రంగంలో కీలక ముందడుగు పడింది. మెషిన్‌గన్‌తో శత్రువులపై విరుచుకుపడే అత్యాధునిక హెక్సాకాప్టర్ డ్రోన్‌ను భారత సైన్యం పరిచయం చేసింది. 'మేకిన్ ఇండియా'లో భాగంగా ఇక్రాన్ ఏరోస్పేస్ అండ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దీన్ని రూపొందించింది. ఇదొక మానవ రహిత ఏరియల్ వాహనం (యూఏవీ). ఆర్మీ ఆపరేషన్లలో ఇది సైన్యానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. చిన్న తుపాకుల నుంచి.. గ్రెనేడ్లు, మోర్టార్లు వంటి ఆయుధాల శ్రేణిని కలిగి ఉంటుంది. వివిధ పరిస్థితుల్లో దీన్ని నిఘా కోసం ఉపయోగించవచ్చు. అలాగే సామగ్రిని, మిషన్ గన్లను, గ్రెనేడ్లను తరలించడానికి దీన్ని వాడుకోవచ్చు. ఇటీవల చిన్న ఆయుధాల టెస్ట్ ఫైరింగ్ సమయంలో ఆర్మీ అధికారులు దీని పనితీరుని పరిశీలించారు.

నలుగురు ఎస్పీలపై ఈసీ కత్తి..!

- పల్నాడు హింస బిందు మాధవ్ మెడకు
- పులివర్తి నానిపై దాడి.. తిరుపతి ఎస్పీపై వేటు..
- తాడిపత్రి బీభత్సం.. అమిత్ బర్దార్‌కు సంకటం..
- నంద్యాలలో 'పుష్ప'ర్యాలీ.. రఘువీర్‌రెడ్డి ఫైర్..?

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నలుగురు ఎస్పీలపై ఎన్నికల సంఘం కత్తి వేలాడుతోంది. ఎన్నికల విధుల్లో వైఫల్యం.. హింసను కట్టడి చేయలేక పోవడంపై చర్యలు తీసుకోబోతోంది. బుధవారం రాత్రి పోలీసు ఉన్నత స్థాయి అధికారులకు అందిన సమాచారం మేరకు గురువారం రాయలసీమలో ముగ్గురు, పల్నాడులో ఒకరిపై వేటుపడే అవకాశం ఉంది. పోలింగ్ సందర్భంగా జరిగిన హింసపై సీరియస్ అయిన కేంద్ర ఎన్నికల కమిషన్... ఆ తర్వాతా కొనసాగడాన్ని క్షమించలేక పోతోంది. ఎప్పుడూ గొడవలు జరిగే పల్నాడు జిల్లాలో విధ్వంసాన్ని ఉపేక్షించే ప్రసక్తేలేదని ఢిల్లీ ఈసీ వర్గాలు రాష్ట్ర పోలీసు పెద్దలకు హెచ్చరిక చేసినట్లు తెలుస్తోంది. మహిళా ఏజెంట్‌పై గొడ్డలితో దాడి, మరో ఏజెంట్ ఇంటికెళ్లి చిన్నపిల్లల్ని చంపుతామంటూ వీడియోలు తీసి పంపడం, అధికార వైసీపీ అభ్యర్థి కాన్వాయ్‌లోనే కత్తులు, రాడ్లు తీసి టీడీపీ ఆఫీసు ధ్వంసం చేయడం తదితర ఘటనలపై ఎన్నికల పరిశీలకుడు మిశ్రా ఇచ్చిన నివేదిక జిల్లా ఎస్పీపై చర్యకు ఆయుధంగా మారిందని సమాచారం. నరసరావుపేటలో ఎంతో సౌమ్యుడిగా పేరున్న వెనుకబడిన వర్గాలకు చెందిన చదలవాడ అరవింద్ బాబు వాహనాన్ని వెంబడించి దాడి చేయడం, అందుకు బాధ్యుడైన వైసీపీ అభ్యర్థి ఇంటిపైకి టీడీపీ శ్రేణులు వెళ్లడం, ఇతర హింసాత్మక ఘటనలు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మెడకు చుట్టుకోబోతున్నట్లు సమాచారం. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో టీడీపీ చంద్రగిరి అసెంబ్లీ అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన హత్యాయత్నం దృశ్యాలు సీఈసీకి ఆగ్రహం తెప్పించాయి. విద్యా సంస్థ ప్రాంగణంలోకి మద్యం సీసాలు, సమ్మెట, కర్రలు, రాడ్లు పట్టుకెళ్లి అభ్యర్థిపై హత్యాయత్నం చేస్తుంటే జిల్లా ఎస్పీ కనీస భద్రతా చర్యలు చేపట్టలేక పోయారని ఎన్నికల కమిషన్ భావిస్తోంది. అభ్యర్థి అంగరక్షకుడిపైనే దాడి చేసేందుకు అధికార పార్టీ మూకలు తెగబడ్డాయంటే ఎన్నికల ముందు అక్కడికి ఎస్పీగా వచ్చిన కృష్ణకాంత్ పటేల్‌పై అధికార పార్టీ ప్రభావం ఎంతుందో అర్థం చేసుకుంది. దీంతో గురువారం సాయంత్రంలోగా తిరుపతి ఎస్పీ బదిలీ తప్పక పోవచ్చని ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అనంతపురం జిల్లా ఎస్పీగా ఇటీవలే ఎన్నికల కమిషన్ ఎంపికతో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అమిత్ బర్దార్ హింసాత్మక ఘటనలు అరికట్టడంలో పూర్తిగా విఫలం అయ్యారని ఈసీ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ముందస్తుగానే అక్కడి అధికార పార్టీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ట్రాక్టర్లతో రాళ్లు తెప్పించి ప్రతిపక్షాలతోపాటు పోలీసులపైనా రాళ్లవర్షం కురిపిస్తుంటే ఏమీ చేయలేక చేతులెత్తేయడం చేతగానితనంగా భావిస్తోంది. రాళ్ల దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు ఇళ్లల్లోకి దూరి తలుపులేసుకుని దాక్కోవడం, జిల్లా ఎస్పీ వాహనంపైనే అధికార పార్టీ అల్లరి మూకలు దాడి చేయడం ఊహించడం కూడా కష్టంగా ఉందని ఎన్నికల అధికారి ఒకరు పోలీసు పెద్దలతో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తనను తాను కాపాడుకోలేని వ్యక్తి జిల్లా ఎస్పీగా శాంతి భద్రతలు ఏమేరకు పరిరక్షించగలరో అర్థం అవుతోందని అన్నట్లు సమాచారం. మరోవైపు నంద్యాలకు పోలింగ్‌కు 48 గంటల ముందు వచ్చిన సినీ నటుడు అల్లు అర్జున్, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి తరఫున వేలాది మందితో అనుమతిలేని ర్యాలీ తీయడంపై ఈసీ ఇప్పటికే జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిపై చర్యలకు ఆదేశించింది. ప్రతిపక్ష నేత సభ ఉన్న సమయంలో వేలాది మందితో ర్యాలీకి అధికార పక్షం ముందు రోజు రాత్రి నుంచి సిద్ధం చేసుకున్నా కనీసం అడ్డు చెప్పక పోవడం ఏకపక్ష పోలీసింగ్‌కు ప్రత్యక్ష ఉదాహరణగా భావిస్తోంది. ఇదే కారణంతో రఘువీరా రెడ్డిని సైతం బదిలీ చేసే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పోలింగ్ ముగిసిన తర్వాత ఈసీ చర్యలు ఉండకపోవచ్చని భావించిన అధికారులకు అంతకు మించి కౌంటింగ్ ముందుందని గుర్తు చేస్తోంది. ఇప్పుడు ఉపేక్షిస్తే కౌంటింగ్ సందర్భంగా హింస, ఆ తర్వాత రాజకీయ ప్రతీకార దాడులు జరిగే అవకాశం ఉందని అనుమానిస్తోంది. ఇవన్నీ గమనించి ఆ నాలుగు జిల్లాలకు సమర్థులైన అధికారులను ఎస్పీలుగా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కుట్రలకు కేరాఫ్.. తాడేపల్లి ప్యాలెస్: ధూళిపాళ్ల

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): దాడులు చేసేది మీరే.. చేయించేది మీరే.. ప్రేరేపించేది మీరే.. నిందలు మాత్రం ప్రతిపక్షాలపై మోపుతారా? అని సజ్జల రామకృష్ణారెడ్డిపై టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మండిపడ్డారు. కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్ తాడేపల్లి ప్యాలెస్ అయితే.. దానికి బ్రాండ్ అంబాసిడర్ సజ్జల రామకృష్ణారెడ్డి అని విమర్శించారు. 'ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక దాడులు మొదలు పెట్టింది వైసీపీ. ఈవీఎంలను పగల కొట్టింది వైసీపీ గూండాలు. హింసను ప్రేరేపించింది వైసీపీ. దీనికి కొమ్ముకాసింది బులుగు ఖాకీలే. ఇన్ని దౌర్జన్యాలు చేసి, ఆ నిందను ఈసీపై మోపడమా? ఏమైనా అర్థముందా సజ్జలా?' అని ప్రశ్నించారు. మీ భవిష్యత్‌ను మే13న ఓటర్లు రాసేశారు. జగన్‌రెడ్డి లండన్ పారిపోతున్నాడు. ఇక సజ్జల ఎక్కడికి పారిపోతాడో?. జూన్4 తర్వాత వైసీపీ గూండాలు మాయమవడం ఖాయం. బై బై వైసీపీ' అని బుధవారం ఒక ప్రకటనలో ధూళిపాళ్ల పేర్కొన్నారు.

పీవోకేని భారత్‌లో కలుపుతాం!

పాక్ దగ్గర అణు బాంబులున్నా వెనక్కి తగ్గేదేలేదు.. చేసి తీరుతాం

- ఆ ప్రాంతం ఈ దేశంలో భాగం
- కేంద్ర హోం మంత్రి షా ప్రకటన



న్యూఢిల్లీ, మే 15: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఒకవైపు అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 400 సీట్లతో కేంద్రంలో తిరిగి అధికారం చేపట్టిన తర్వాత పీవోకేని తిరిగి భారత్‌లో కలుపుతామని ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లోని సిరాంపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. 370 అధికరణం రద్దు తర్వాతే జమ్ము కశ్మీర్‌లో శాంతి పవనాలు వీస్తున్నాయని, స్వేచ్ఛా నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయని తెలిపారు. 2019లో తమ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందు ఈ రాష్ట్రంలో నిత్యం రాళ్ల దాడులు జరిగేవని చెప్పారు. ఇప్పుడు రాళ్ల దాడులు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ వరకే పరిమితమయ్యాయని తెలిపారు. "పీవోకే భారత్‌లో భాగం అవునా? కాదా?" అని సభకు వచ్చిన వారిని ప్రశ్నించారు. పీవోకే భారత్‌లో భాగమని, దీనిని తిరిగి వెనక్కి తీసుకుంటామని చెప్పారు. ఇదేసమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ దగ్గర అణుబాంబులు ఉన్నాయని.. కాబట్టి పాకిస్థాన్ జోలికి వెళ్లవద్దన్న మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. "పాక్ దగ్గర అణు బాంబులు ఉన్నాయని వారు(కాంగ్రెస్) భయపడుతున్నారు. అయినప్పటికీ పీవోకేను వెనక్కి తీసుకుంటాం. పీవోకే భారత్‌లో భాగం. దీనిని ఖచ్చితంగా తిరిగి తీసుకుంటాం" అని షా నొక్కి చెప్పారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు జీహాద్‌కు ఓటు వేస్తారో, అభివృద్ధికి ఓటు వేస్తారో నిర్ణయించుకోవాలన్నారు.


జ్ఞాన్‌వాపీలో ఆలయం

మరోవైపు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీ కూటమికి 400 సీట్లకు పైగా వస్తే పీవోకేను భారత్‌లో విలీనం చేస్తామని ప్రకటించారు. జార్ఖండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మభూమిలో ఆలయాన్ని నిర్మిస్తామని, జ్ఞానవాపీలోనూ ఆలయ నిర్మాణం తథ్యమని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతిని కూడా అమలు చేయనున్నట్టు తెలిపారు. "2019లో కేవలం 300 సీట్లు దాటినప్పుడే అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించాం. ఆర్టికల్ 370ని రద్దు చేశాం. సీఏఏని అమలు చేశాం. 400 సీట్ల మార్కు దాటితే మరిన్ని చేస్తాం" అని సీఎం బిశ్వశర్మ అన్నారు.

కేజ్రీకి సుప్రీం స్పెషల్ ట్రీట్‌మెంట్

బెయిల్ ఇవ్వడంపై అమిత్ షా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 15: కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు బెయిల్ ఇవ్వడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఇదేదో సాధారణ తీర్పు అని నేను అనుకోవట్లేదు. దేశంలో చాలా మంది.. కేజ్రీవాల్‌కు(కోర్టు) స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్టు నమ్ముతున్నారు" అని ఓ ఇంటర్వ్యూలో అన్నారు. బీజేపీలో ఉన్న ఆనవాయితీ ప్రకారం.. 75 ఏళ్ల వయసు రాగానే.. అంటే 2025లో మోదీ రిటైర్ అవుతారంటూ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపైనా అమిత్ షా స్పందించారు. "నరేంద్ర మోదీ 2029 దాకా (అధికారంలో) ఉంటారు. మీకొక దుర్వార్త ఏమిటంటే, 2029 తర్వాత కూడా మోదీ మాకు నాయకత్వం వహిస్తారు" అని కేజ్రీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై కేజ్రీ పీఏ బిభవ్ కుమార్ దాడి గురించి ప్రస్తావిస్తూ.. "ఆయన ప్రస్తుతానికి వేరే వివాదంలో చిక్కుకున్నారు. ముందు దాన్నుంచి బయటపడనివ్వండి" అని అన్నారు.



నాసా సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ మంగళవారం తీసిన సూర్యుడి చిత్రం ఇది. మంగళవారం ఈ దశాబ్దంలోనే అత్యంత తీవ్రమైన సౌర తుఫాను సంభవించింది. ఈ సమయంలో తీసిన ఫొటో ఇది.

సీఏఏ కింద తొలిసారి 14మందికి భారతీయ పౌరసత్వం

న్యూఢిల్లీ, మే 15: దేశంలో పౌరసత్వ సవరణ చట్టం- 2019 (సీఏఏ) అమలులోకి వచ్చిన తర్వాత తొలిసారి 14 మందికి భారతదేశ పౌరసత్వం లభించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో 14 మందికి తొలి విడతగా.. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా ఢిల్లీలో బుధవారం సీఏఏ కింద జారీ అయిన పౌరసత్వ సర్టిఫికెట్లను అందజేశారు. దేశంలో సీఏఏ అమలులోకి వచ్చిన దాదాపు నాలుగేళ్ల తర్వాత ఈ ఏడాది మార్చి 11న కేంద్ర ప్రభుత్వం ఈ చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, 2019 డిసెంబరులో ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనల నడుమ పార్లమెంటు ఉభయ సభల్లో ఈ చట్టం ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి సమ్మతితో అమల్లోకి వచ్చింది. సీఏఏ ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు భారతదేశ పౌరసత్వం లభిస్తుంది. 2014 డిసెంబరు 31 కంటే ముందు మన దేశానికి వచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవ శరణార్థులకు ఇది వర్తిస్తుంది.

హెచ్1బీ గడువు దాటినా అమెరికాలో ఉండొచ్చు!

న్యూఢిల్లీ, మే 15: లేఆఫ్‌లకు గురైన హెచ్-1బీ వీసాదారులకు భారీ ఊరట కలిగించేలా అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ నూతన మార్గదర్శకాలను ప్రకటించింది. వీటి ప్రకారం.. ఉద్యోగం కోల్పోయిన విదేశీయులు 60 రోజుల గ్రేస్ పీరియడ్ తర్వాత కూడా అమెరికాలో నివసించేందుకు అవకాశం కలుగుతుంది. గ్రేస్ పీరియడ్ పూర్తయ్యేలోపు నాన్‌ఇమిగ్రెంట్ స్టేటస్ మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగులు ఒక సంవత్సరం పాటు 'తప్పనిసరి పరిస్థితుల' ఉపాధి అధికార పత్రం కోసం దరఖాస్తును దాఖలు చేయవచ్చు.

అన్నదాతకు చల్లని కబురు!

విశాఖపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మే 31న కేరళ తీరాన్ని తాకుతాయని బుధవారం ప్రకటించింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1 కేరళకు వస్తాయి. అయితే ఈ ఏడాది ఒకరోజు ముందుగా రానున్నాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్రా తెలిపారు. గతనెలలో ఇచ్చిన నివేదిక ప్రకారం నైరుతి సీజన్‌లో సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. 4నెలల నైరుతి సీజన్‌లో జూన్, జూలై నెలలు అత్యంత కీలకం. ఈ నెలల్లోనే ఖరీఫ్ సాగు ఎక్కువగా సాగుతుంది. ఈ రెండు నెలల్లో వర్షాలు సంతృప్తికరంగా ఉంటాయని మహాపాత్రో వివరించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని కేంద్రం ప్రకటించింది. 50ఏళ్ల సగటును పరిగణనలోకి తీసుకుంటే రుతుపవనాల సీజన్‌లో సగటున 87 సెం.మీ. వర్షపాతం నమోదవుతుందని, దీనికి అనుగుణంగా ఈ ఏడాది సాధారణానికి మించి వర్షాలు పడతాయని పేర్కొన్నారు. కాగా, ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులు వివిధ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

'హిందూ-ముస్లిం' అని విడదీయను

అలా చేస్తే రాజకీయాలకు అర్హుడినే కాదు: మోదీ

న్యూఢిల్లీ, మే 15: 'హిందూ-ముస్లిం' రాజకీయాలు చేయకూడదని తాను సంకల్పం తీసుకున్నానని ప్రధాని మోదీ అన్నారు. అలా విడదీసి రాజకీయాలు చేసిన రోజున ప్రజాజీవితంలో కొనసాగేందుకు తాను అర్హుడినే కాదని స్పష్టం చేశారు. 2002లో గోద్రా ఘటన తర్వాత తన ప్రతిష్ఠను కావాలనే దెబ్బతీశారని విపక్షాలను విమర్శించారు. 'ఆంగ్ల వార్తాచానల్ సీఎన్ఎన్-న్యూస్18'కు ఆయన ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. తన ఎన్నికల ప్రసంగాల్లో తానెప్పుడూ ముస్లింలను చొరబాటుదారులని అనలేదన్నారు. ఎక్కువ మంది పిల్లలను కలిగిఉన్నది ముస్లింలేనని కూడా అనలేదని తెలిపారు. 'ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారంటే దానర్థం వారు ముస్లింలు అనేనా? వారి పట్ల అంత అన్యాయంగా ఎలా వ్యవహరిస్తారు? కుటుంబాల్లో ఎక్కువ మంది పిల్లలు ఉంటే వారి పోషణ, విద్య, వస్త్రాల కొనుగోలు మొదలైనవి కష్టమవుతాయి. మతంతో సంబంధం లేకుండా పేదలందరి పరిస్థితి ఇలాగే ఉంటుంది' అని తెలిపారు. చిన్నతనంలో తమ ఇరుగుపొరుగున ముస్లిం కుటుంబాలు ఉండేవని.. వారి ఆచార వ్యవహారాలను దగ్గరగా చూసి అర్థం చేసుకున్నానని చెప్పారు. 'ఇతర పండుగల్లాగే మా ఇంట్లో ఈద్ కూడా జరిపేవాళ్లం. ఆ రోజున ఇంట్లో వంటచేసేవాళ్లు కాదు. పొరుగున ఉన్న ముస్లింల ఇళ్ల నుంచి భోజనం వచ్చేది. మొహర్రం ఊరేగింపులకు వెళ్లేవాళ్లం. తజియా (మహ్మద్ ప్రవక్త మనవడు ఇమాం హసన్ సమాధి ప్రతిరూపం)ను మోసేవాళ్లం. అలాంటి సమాజంలో నేను పెరిగాను. నాకు పలువురు ముస్లిం స్నేహితులు ఉన్నారు. కానీ ఈ కోణాన్ని ప్రచారం చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. వ్యక్తిగతంగా నాకు మద్దతిచ్చే ముస్లింలు చాలా మంది ఉన్నారు. అయితే మీరు ఇది చేయాలి.. ఇది చేయాలంటూ వారిని నిర్దేశించే శక్తి వేరే ఉంది. 2002లో గోద్రా ఘటన తర్వాత నా ప్రతిష్ఠను కావాలనే దెబ్బతీశారు' అని అన్నారు.



బుధవారం మహారాష్ట్రలో మోదీ ప్రచారం

నేను ప్రజాస్వామ్యవాదిని..

తాను ప్రజాస్వామ్యవాదినని.. 2014 నుంచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం లేకపోయినా.. అందులో అతిపెద్ద విపక్షానికి చెందిన నేతను వివిధ కమిటీల్లో నియమించేలా చట్టం తీసుకొచ్చానని మోదీ తెలిపారు. 400కి పైగా సీట్లను సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ప్రతిపక్షం బలంగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. 'అయితే బలమైన ప్రతిపక్షమని అంటే.. పార్లమెంటు జరక్కుండా రచ్చరచ్చచేయడం కాదు. అది అప్రజాస్వామికం. దురదృష్టవశాత్తూ.. గత పదేళ్లలో ఆయా పార్టీలు తమ విపక్ష పాత్రను సక్రమంగా పోషించడంలో విఫలమయ్యాయి' అని అన్నారు. భారత్‌కు దృఢమైన ప్రజాస్వామ్యం ఉండాలని.. ఇందుకోసం పటిష్ఠ ప్రతిపక్షం ఉండాలని అన్నారు.

నిద్రలోనే అగ్నికి ఆహుతి

- పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- టిప్పర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు
- చిన్నారి సహా ఆరుగురు సజీవ దహనం



ఖ్యాతి శ్రీసాయి, కాశీబ్రహ్మేశ్వరరావు, లక్ష్మి (ఫైల్)



శ్రీనివాసరావు (ఫైల్)



ప్రమాదంలో కాలి బూడిదైన టిప్పర్, ట్రావెల్స్ బస్సు

బాపట్ల (ఆంధ్రజ్యోతి), చిలకలూరిపేట, చినగంజాం, గుంటూరు, మే 15: రెండు గంటల ముందు వరకూ అమ్మమ్మ, తాతయ్యకు కబుర్లు చెబుతూ ఆడుకుంది ఆ పాప..! ఆ బుజ్జిబుజ్జి మాటలకు మురిసిపోతూ మెల్లిగా మనవరాలితో కలిసి నిద్రలోకి జారుకున్నారు ఆ పెద్దవాళ్లు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఓటేయడానికి వచ్చిన ఓ యువకుడు అప్పుడే అమ్మానాన్నతో మాట్లాడి రెప్పవాల్చారు.... పిల్లల చదువుల కోసం హైదరాబాద్‌లో ఉంటూ ఓటేయడానికి స్వగ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణమైన వ్యక్తి మరొకరు.... ఇలా ఆ బస్సులో దాదాపుగా అందరూ ఓటేయడానికి సొంతూరికొచ్చి హైదరాబాద్‌కు తిరుగుపయనమైన వారే. మంగళవారం రాత్రి 44 మందితో బాపట్ల జిల్లా చినగంజాం నుంచి చిలకలూరిపేట మీదుగా హైదరాబాద్ బయల్దేరిన ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు అర్ధరాత్రి దాటాక 1:30 సమయంలో ఘోర ప్రమాదానికి గురైంది. పల్నాడు జిల్లాలోని అన్నంబట్ల వారిపాలెం-పసుమర్రు గ్రామాల మధ్య ఈవూరివారిపాలెం రోడ్డు వద్దకు రాగానే కంకర లోడుతో వేగంగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ప్రమాద ధాటికి టిప్పర్ ఆయిల్ ట్యాంకర్ పగలడంతో రెప్పపాటులోనే మంటలు వ్యాపించాయి. గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో అర్థంకాక పెద్దఎత్తున హాహాకారాలు పెట్టారు. డోర్ దగ్గరే కూర్చున్న ఓ యువకుడు అందరినీ అప్రమత్తం చేయడంతో కొంతమంది ముందుద్వారం నుంచి దిగగా, కొంతమంది ఎమర్జెన్సీ ద్వారం నుంచి, మరికొందరు కిటికీ అద్దాలు పగలగొట్టి బయటకు దూకేశారు. బస్సు, టిప్పర్ డ్రైవర్లతోపాటు బస్సులోని మరో నలుగురు సజీవ దహనమయ్యారు. 29 మంది గాయాలతో బయటపడ్డారు. మృతిచెందిన వారిని బస్సు డ్రైవర్ అంజి (35), నీలాయపాలేనికి చెందిన ఉప్పుగుందూరు కాశీ బ్రహ్మేశ్వర రావు (64), ఆయన భార్య లక్ష్మీ (55), మనవరాలు ముప్పరాజు ఖ్యాతి శ్రీసాయి (8), గోనసపూడికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (52), మధ్యప్రదేశ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ హరి సింగ్ (39)గా గుర్తించారు. గాయపడిన వారిలో 20 మందిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. కొందరిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట నుంచి అగ్నిమాపకదళం వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా, సంఘటన ప్రదేశం పక్కనే చీరాల వాడరేవు - నకరికల్లు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణకు అవసరమైన గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అయితే అక్కడ రోడ్డు పనులకు సంబంధించి ఎలాంటి ఇండికేషన్లూ లేవు. కాగా, ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు..

ఈ ప్రమాదంలో మృతిచెందిన బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె దొప్పలపూడి భావన, ఆమె భర్త అనిల్ హైదరాబాదులో ఉంటున్నారు. వారికి సంతానం లేరు. రెండో కుమార్తె దుర్గ, భర్త ముప్పరాజు సుబ్బారావు ఒంగోలులో ఉంటున్నారు. వీరికి ఒకే ఒక కుమార్తె ఖ్యాతి శ్రీసాయి. బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి హైదరాబాద్ నుంచి ఓటు వేయడానికి వచ్చారు. వేసవి సెలవులు కావడంతో మనవరాలు సాయి కూడా వారివెంట హైదరాబాద్ బయల్దేరింది. కానీ, ప్రమాదంలో ఈ ముగ్గురూ అగ్నికి ఆహుతయ్యారు. ప్రమాదం జరిగినప్పుడు భావన చిన్నారి శ్రీసాయిని వెంటబెట్టుకుని కిందకు దిగేందుకు మెయిన్ డోర్ వద్దకు వెళ్లారు. అయితే మెయిన్ డోర్ విరిగి లోపలికి పడడంతో సాధ్యం కాలేదు. అదే సమయంలో వెనకవైపు కిటికీ అద్దాలు పగలగొట్టి కిందకు దిగుతున్నట్లు తెలుసుకున్న భావన చిన్నారి చేయి పట్టుకుని అటువైపు వెళ్లింది. అయితే చిన్నారి భయాందోళనతో తాతయ్య వద్దకు వెళ్లింది. అప్పటికే పరిస్థితి చేయి దాటి పోతుండడంతో బయటకు దిగిన ప్రయాణికులు భావనను బలవంతంగా కిటికీ నుంచి లాగేశారు. దీంతో ప్రాణాలతో బయటపడింది. బ్రహ్మేశ్వరావు, లక్ష్మీతో పాటు సాయి కూడా అగ్నికి ఆహుతైంది. భావన ప్రస్తుతం గుంటూరు రమేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తమ కుటుంబంలో ఉన్న ఏకైక సంతానం ఖ్యాతి మృతిని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు సజీవదహనం కావడంతో నీలాయపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనాస్థలంలోనే బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా భస్మం మాత్రమే మిగిలి ఉన్న దృశ్యాలు చూపరులను కంటతడిపెట్టించాయి. చిన్నారి అమ్మమ్మ, తాతయ్యలతో కలిసి మాంసం ముద్దగా పడి ఉండడం కలచివేసింది. ఘటనాస్థలానికి వచ్చిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆ దృశ్యాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. అర్ధరాత్రి అక్కడకు వెళ్లి దగ్గరుండి బాధితులను ఆస్పత్రికి తరలించడంతో పాటు మెరుగైన చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశారు. ప్రమాదం జరిగిన చోట రోడ్డు పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ కనీస జాగ్రత్తలు పాటించకపోవడమే ఈ దారుణానికి కారణమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డ్రైవర్‌ను రెండుసార్లు హెచ్చరించా

- సింగోతు సాయికుమార్, భాగ్యనగర్



చినగంజాంలో బస్సు బయల్దేరినప్పటి నుంచి నేను డ్రైవర్ ప్రక్కనే కూర్చుని ఉన్నా. పర్చూరు, చిలకలూరిపేట రహదారి మధ్య రెండుసార్లు బస్సు రోడ్డు మార్జిన్ దిగడం గమనించి డ్రైవర్‌ని హెచ్చరించా. మరోసారి డ్రైవర్‌ని అప్రమత్తం చేసేలోపే ఘోరప్రమాదం జరిగింది. బస్సులో లైట్లు ఆరిపోవడం, మంటలు రావడం కనిపించింది. వెంటనే డ్రైవర్ క్యాబిన్‌కి, ప్రయాణికులకు మధ్య ఉన్న డోరు తీద్దామనుకుంటే లాక్ అయింది. లాక్‌ను తీసి ప్రయాణికులను దించివేయాలని చూసేలోగా మంటలు వ్యాపించాయి. కొంతమందిని ఈ డోరు ద్వారా బయటకు దించాను. కొంతమంది కిటికీ అద్దాలు పగలగొట్టుకొని వచ్చారు. అద్దాలలో ఇరుక్కున్న వారిని బయటకు లాగాను. వెంటనే 108, 101 లకు ఫోన్ చేశాను. బస్సులో చిక్కుకున్న ఆ నలుగురిని మాత్రం కాపాడలేకపోయాము.

షాక్‌కు గురయ్యా..

తాటి సాయిలక్ష్మి, సోపిరాల

మేము చినగంజాంలో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో బస్సెక్కాం. గంటసేపు ప్రయాణించగానే బస్సు ప్రమాదానికి గురికావడంతో షాక్‌కు గురయ్యాము. నిద్ర మత్తులో ఏం జరిగిందో తెలుసుకునేలోపే బస్సులో మంటలు వ్యాపించాయి. బుధవారం హైదరాబాదులో నేను ఇంటర్వ్యూకి హాజరు కావలసి ఉంది. భగవంతుని దయవలన ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో పడ్డాను.

ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి

టి.రాజ్యలక్ష్మి, మమత

బస్సులో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఏమి జరుగుతుందో అర్థం కాలేదు. నివ్వెరపోయి చూస్తూ ఉండిపోయాము. బస్సులో మంటలు, బయట చిమ్మచీకటి. ఏమైందో తెలియలేదు, ప్రాణాలు దక్కించుకునేందుకు కొంతమంది కాలుతున్న ద్వారం గుండా అద్దాలు పగలకొట్టుకొని బయటకు దూకారు. తప్పించుకొని బయటకు వచ్చేలోపే కళ్ల ముందే బస్సు కాలి బూడిదైంది.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- నేటి నుంచి ఈఏపీసెట్ పరీక్షలు.. 49 ప్రాంతాల్లో 142 కేంద్రాలు
- ఎంపీసీ, బైపీసీలో 3,61,640 దరఖాస్తులు
- ఎలక్ట్రానిక్ ఉపకరణాలు నిషేధం.. నంద్యాలలో పరీక్షా కేంద్రాల మార్పు
- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్-2024 పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి. నేడు, రేపు బైపీసీ స్ట్రీమ్‌కు, 18 నుంచి 23 వరకు ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు ఎప్పటిలాగే నిమిషం నిబంధనను అమలుచేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. సెట్ చైర్మన్ జీవీఆర్ ప్రసాదరాజుతో కలిసి బుధవారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ ఏడాది 3,61,640 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 2,73,008 మంది ఎంపీసీ స్ట్రీమ్‌కు, 87,421 మంది బైపీసీ స్ట్రీమ్‌కు, 1121 మంది రెండింటికీ దరఖాస్తు చేసుకున్నారన్నారు. 49 ప్రాంతాల్లో 142 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, హైదరాబాద్‌లో రెండు సెంటర్లు ఉన్నాయని చెప్పారు. నంద్యాలలో మొదట ఎంపిక చేసిన కాలేజీల్లో ఈవీఎంలు భద్రపరచడం వల్ల రామకృష్ణ, ఎస్వీఆర్ కాలేజీలకు సెంటర్లను మార్చామని, ఈ సమాచారం విద్యార్థులకు పంపామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకురాకూడదన్నారు. ఎవరి దగ్గరైనా ఎలక్ట్రానిక్ డివైస్ దొరికితే డీబార్ చేస్తామన్నారు. ఈ పరీక్షలు 160 ప్రశ్నలకు జరుగుతాయని, ఎలాంటి నెగిటివ్ మార్కులు ఉండవని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందని, అందువల్ల మెహిందీ పెట్టుకోకూడదన్నారు. చెవి దిద్దులు, ఇతరత్రా ఆభరణాలు పెట్టుకోకుండా రావాలని, అవి ఉంటే తనిఖీ చేయాల్సి వస్తుందన్నారు.

తవ్వకాలా..! అదేం లేదు

- అంతా సవ్యంగానే ఉంది
- అసలు రీచ్‌లే లేవు
- ఎన్జీటీకి 22 మంది కలెక్టర్ల నివేదిక
- అంతా ఒకే ఫార్మాట్..
- 'ఆంధ్రజ్యోతి'కి చిక్కిన కలెక్టర్ల రిపోర్ట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమ తవ్వకాలపై కేంద్ర బృందం ఇచ్చిన నివేదికకు భిన్నంగా 22 జిల్లాల కలెక్టర్లు జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ)కి నివేదికలు సమర్పించారు. ఫిబ్రవరి 11-14 తేదీల నడుమ తనిఖీలు నిర్వహించి కలెక్టర్లు పంపిన నివేదికలన్నీ ప్రభుత్వానికి పూర్తి అనుకూలంగా ఉన్నాయని, వాస్తవాలను కప్పిపుచ్చేలా ఉన్నాయంటూ ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. అయితే ఆయా కలెక్టర్లు ఎన్జీటీకి సమర్పించిన నివేదికలు తాజాగా ఆంధ్రజ్యోతికి చేతికి చిక్కాయి. ఆ నివేదికలన్నీ ఒకే ఫార్మాట్‌లో ఉన్నాయి. పొల్లు పోకుండా, పదం మారకుండా నిర్దేశిత రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలే జరగలేదంటూ కలెక్టర్లంతా మూకుమ్మడి నివేదికలు ఇచ్చారు. ఆ నివేదికలపై ఎన్జీటీ విస్మయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. నివేదికలన్నీ ఒకే ఫార్మాట్‌లో ఉన్నాయేమిటి? అంటూ ఏపీ సర్కారును, గనుల శాఖనూ ప్రశ్నించింది. ప్రభుత్వానికి ఏ మాత్రం మాట రాకుండా, సర్కారు పెద్దలు కోరుకున్నట్లే కలెక్టర్లు పోటీపడి మరీ ఇచ్చిన నివేదికల సారాంశం మీకోసం...

మా దగ్గర రీచ్‌లే లేవు...

అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎటపాక, కొయ్యగూడెంలోని రీచ్‌లను పరిశీలించారు. ఆ రెండింట్లో ఇసుక తవ్వకాలే జరగలేదని నిర్ధారించారు. అనకాపల్లి కలెక్టర్ తమ జిల్లాలో పెద్ద నదులు లేవని, ఇసుక రీచ్‌లే లేవన్నారు. అనంతపురంలో రాయదుర్గం మండలం వేపరాళ్ల రీచ్ పరిధిలో తనిఖీలు చేశారు. ఇసుక తవ్వకాలే జరగడం లేదన్నారు. అన్నమయ్య జిల్లాలో రాజంపేట మండలం టంగుటూరులోని చెయ్యేరు నదిని కలెక్టర్ తనిఖీ చేశారు. గతంలోనూ, తాజాగా ఇసుక తవ్వకాలు జరిగిన ఆనవాళ్లే లేవని తేల్చారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం జువ్వలపాలెం రీచ్‌లో కలెక్టర్ ఫిబ్రవరి 14న తనిఖీ చేశారు. ఆ రీచ్‌లో గతంలో భారీ యంత్రాలతో మైనింగ్ చేసిన ఆనవాళ్లే లేవన్నారు. కానీ, ఇదే బాపట్ల జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై 32 ఆధారాలు ఎన్జీటీ వద్ద ఉన్నాయి. కేంద్ర జాయింట్ కమిటీ కూడా ఇక్కడ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంది. చిత్తూరు కలెక్టర్ ఫిబ్రవరి 12న పూతలపట్టు మండలం, పావిల్‌తోట గ్రామంలోని బహుదా నదిని తనిఖీ చేశారు. భారీ యంత్రాల వినియోగం లేదని, అక్రమ తవ్వకాలు లేవని తేల్చారు. ఏలూరు జిల్లా పరిధిలో వేలేరుపాడు మండలం కుకునూరులోని గోదావరి నది పరిసరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఐదు రీచ్‌ల్లో మైనింగ్ జరగడం లేదని నివేదించారు. ఇంతకు ముందు, ఇప్పుడు భారీ యంత్రాలను ఉపయోగించలేదన్నారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం మున్నంగిలోని కృష్ణానది పరిసరాలు, రీచ్‌లను కలెక్టర్ పరిశీలించి ఎలాంటి తవ్వకాలు జరగడం లేదని నివేదించారు. నిజానికి గుంటూరు జిల్లాల్లోని రీచ్‌ల్లో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వేస్తున్నారని, రాత్రి, పగలు తేడాలేకుండా తరలిస్తున్నారని ఫిర్యాదులున్నాయి. ఈ ఫొటోలు ఇటు ఎన్జీటీకి, అటు హైకోర్టు, సుప్రీం కోర్టుకు సమర్పించారు. కాకినాడ జిల్లాలో ఇసుక అక్రమతవ్వకాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. కానీ, జిల్లాలో ఎక్కడా అక్రమ తవ్వకాలే లేవని కలెక్టర్ నివేదించారు.

కొనసీమలోనూ సేమ్ టూ సేమ్...

గోదావరి వశిష్ఠ ఎడమగట్టు, గోదావరి గౌతమి కుడిగట్టుపై రీచ్‌లు ఉన్నా అక్రమ తవ్వకాలు, భారీ యంత్రాల వినియోగం లేదని కలెక్టర్ నివేదించారు. ఇదే ఫార్మాట్‌లో కృష్ణా కలెక్టర్ నివేదిక ఉంది. తోట్లవల్లూరు మండలం నార్త్‌వల్లూరు రీచ్‌ను తనిఖీచేసి ఎలాంటి అక్రమ తవ్వకాలు లేవన్నారు. తమ వద్ద కొత్త ఇసుక రీచ్‌లు లేవంటూ ప్రకాశం, నంద్యాల కలెక్టర్లు నివేదించారు. అలాగే నెల్లూరు, ఎన్టీఆర్, పల్నాడు, పార్వతీపురం మన్యం, సత్యసాయి జిల్లాల నివేదికలున్నాయి. కాగా, మిగిలిన వారికి భిన్నంగా తూర్పుగోదావరి కలెక్టర్ ఫిబ్రవరి 2నే తనిఖీలు నిర్వహించారు. తమ వద్ద అంతా బాగా ఉందని నివేదించారు. అయితే, కలెక్టర్ జిల్లా పరిధిలో ఏ రీచ్‌లను తనిఖీ చేశారో చెప్పలేదు. శ్రీకాకుళం కలెక్టర్ గోపాలపెంటలోని వంశధార నదిలోని రీచ్‌ను తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు నిబంధనల ప్రకారమే జరిగాయని, రైతులు ఎడ్లబండ్లు తీసుకొచ్చారని, వాటి ఆనవాళ్లు ఉన్నాయని నివేదించారు. అయితే, ఫొటోలను పరిశీలిస్తే, అక్కడ భారీ వాహనాలు తిరిగిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. తిరుపతి జిల్లా పరిధిలోని అరుణా నదిలో ఇసుక అక్రమ తవ్వకాల సమస్య తీవ్రంగా ఉంది. నాగులాపురం మండలంలోని టీకేవీడు గ్రామంలోని రీచ్‌ను, పిచ్చాటూరు మండలంలోని ఎస్ఎస్‌బీ పేట రీచ్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు జరగడం లేదని నివేదించారు. కానీ, ఇదే నది పరిధిలో భారీ యంత్రాలతో నిబంధనలకు విరుద్ధంగా నదీగర్భాన్ని తోడేస్తున్నారని ఫిర్యాదులున్నాయి. విజయనగరం, పశ్చిమగోదావరి కలెక్టర్లు ఒకే ఫార్మాట్‌లో నివేదికలు ఇచ్చారు. కడపలోని ఎర్రగుంట్ల మండలం హనుమగుత్తిలో, వీఎన్‌పల్లి మండలం ఎర్రబెల్లిలో కలెక్టర్ తనిఖీలు చేసి తమ వద్ద అంతా బాగుందని నివేదిక ఇచ్చారు.



అమెరికాలో గౌరవ డాక్టరేట్ స్వీకరిస్తున్న డాక్టర్ విశ్వనాథన్

వీఐటీ చాన్సలర్‌కు.. అమెరికా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం

- విద్యా రంగంలో విశేష కృషికి దక్కిన గౌరవం

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ కె.విశ్వనాథన్‌కు అమెరికాలోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూ యార్క్ (బింగ్‌హంటన్ యూనివర్సిటీ) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ నెల 10న బింగ్‌హంటన్ యూనివర్సిటీలో జరిగిన వేడుకలో వర్సిటీ చాన్సలర్ హార్వే స్టింగర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్‌కు ప్రత్యేక అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కడి శాసన మండలి సభ్యులు డోనా ఎలుప్పాడో, సెనేట్ సభ్యులు లియావెట్, డీన్ ప్రొఫెసర్ శ్రీహరి కృష్ణస్వామి, స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ వైస్‌చాన్సలర్ డాక్టర్ డొనాల్డ్ హాల్, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం, కాదంబరి విశ్వనాథన్, వీఐటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వాషింగ్టన్‌లోనూ విశ్వనాథన్‌కు ప్రత్యేక అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సెనేట్ సభ్యుడు కన్నన్ శ్రీనివాసన్, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ విద్యా విభాగాధిపతి డాక్టర్ బి.కరుణాకరన్, వీఐటీ నార్త్ అమెరికన్ అలుమ్ని అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్‌లు, తదితరులు హాజరై విశ్వనాథన్‌ను అభినందించారు. చిన్న వయసులోనే రాజకీయ ప్రవేశం చేసి పలు పదవుల ద్వారా వివిధ బాధ్యతలు నిర్వర్తించిన విశ్వనాథన్.. విద్యారంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తించిన అమెరికా యూనివర్సిటీ ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ టెక్నికల్ మెంబరు నియామకానికి నోటిఫికేషన్

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ స్టేట్ బెంచ్‌లో టెక్నికల్ మెంబరు నియామకానికి బుధవారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. స్టేట్ బెంచ్‌లో సాంకేతిక సభ్యుడి పోస్టు నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

విశాఖలో అంతర్జాతీయ జీవ వైవిధ్య వేడుకలు

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 22, 23 తేదీల్లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సభ్య కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. జీవ వైవిధ్య 'ప్రణాళికలో భాగం అవ్వండి' అనే నినాదంతో ఈ వేడుకలు జరుగుతాయని బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. జీవవైవిధ్యం ఆవశ్యకత, పరిరక్షణ చర్యలపై ప్రముఖులు ప్రసంగిస్తారన్నారు. ఈ నెల 21న విశాఖలోని ఇందిరాగాంధీ జూ పార్కులో 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

లోకేశ్‌పై కేసుల విచారణ వచ్చే నెల 18కి వాయిదా

విజయవాడ, మే 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌పై సీఐడీ దాఖలు చేసిన పిటిషన్లను విజయవాడ ఏసీబీ కోర్టు వచ్చే నెల 18కి వాయిదా వేసింది. రెడ్‌బుక్ పేరుతో దర్యాప్తు అధికారులను బెదిరిస్తున్నారని సీఐడీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు అసైన్డ్ ల్యాండ్స్ కేసులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. ఈ రెండు పిటిషన్లపై విచారణ జూన్ 18కి వాయిదా వేశారు. అలాగే, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో అప్రూవర్‌గా మారిన నిందితుడు సుదీప్ చంద్రకాంత్‌షా వాంగ్మూలం నమోదును కూడా వచ్చే నెల 18కి వాయిదా వేశారు.

మారిన చంద్రబాబును చూస్తారు

- సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రవాసాంధ్రులతో భేటీకి ప్రత్యేక విధానం
- పార్టీకి ప్రచారం చేసిన వారికి కృతజ్ఞతలు
- ప్రవాసాంధ్రులతో బాబు వీడియో కాల్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి/అమరావతి)

తెలుగుదేశం కూటమి కోసం ప్రచారం చేయడానికి రాష్ట్రానికి వచ్చిన ప్రవాసాంధ్రులకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. 'మీ కృషి ఎనలేనిది' అని కొనియాడారు. ఇక ముందు తనలో పూర్తిగా మారిన చంద్రబాబును చూస్తారని వ్యాఖ్యానించారు. పార్టీపై అభిమానంతో ప్రచారం చేసిన ప్రవాసాంధ్రులు ఎన్నికల అనంతరం విదేశాలకు వెళ్లే ముందు మంగళవారం రాత్రి మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారి గౌరవార్థం ఎన్ఆర్ఐ గ్రాట్యుటీ డిన్నర్ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చంద్రబాబు వీడియో కాల్‌లో మాట్లాడారు. మాతృభూమిపై మమకారంతో సప్త సముద్రాలు దాటి వచ్చి పార్టీ కోసం పని చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత విదేశాల నుంచి వచ్చిన ప్రవాసాంధ్రులు తనను కలుసుకోవడానికి ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెడతానన్నారు. విదేశాలలోని ప్రవాసాంధ్రులు ప్రతి ఒక్కరు తమ వంతుగా సంవత్సరానికి ఐదుగురు యువకులకు ఉద్యోగాలు కల్పించి, వీసా ఇప్పించడానికి ముందుకు రావడం కీలక అధ్యాయమని ప్రశంసించారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల గురించి పట్టించుకోకపోవడంతో వారి ద్వారా రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు ఆగిపోయాయన్నారు. గల్ఫ్ దేశాల్లోని ఎన్ఆర్ఐలు ప్రమాదం బారిన పడితే రూ.ఒక లక్ష, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షలు, అక్కడ వారికి ఏదైనా న్యాయ సమస్యలు తలెత్తితే రూ.50 వేల వరకు అందేలా ఆనాడు టీడీపీ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. నాడు టీడీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఐల కోసం చేపట్టిన కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే వాటన్నింటినీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఏపీ భవిష్యత్తు కోసమే తాము కుటుంబసభ్యులతో సహా స్వచ్ఛందంగా తరలివచ్చి ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నామని పలువురు ఎన్ఆర్ఐలు తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, కూటమి గెలుపు ఏపీకి మలుపు కాబోతుందని వ్యాఖ్యానించారు. పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ప్రచారం చేసిన తీరును ఎన్నారై విభాగం అధ్యక్షుడు వేమూరి రవి వివరించారు. వాస్తవానికి వీరందరికీ విందు ఏర్పాటు చేసి చంద్రబాబు స్వయానా కలవాల్సి ఉంది. వారాణసీలో ప్రధాని నరేంద్ర మోదీ నామినేషన్ కార్యక్రమానికి వెళ్లిన ఆయన తిరిగి రావడంలో ఆలస్యం కావడంతో ఈ సమావేశానికి రాలేకపోయినట్టు రాధాకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు పార్టీ ప్రవాసీ ప్రముఖులు కోమటి జయరాం, వెంకట్ కోడూరి, సురేశ్ మాలపాటి, మల్లిక్ మేడరమట్ల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై బాబు దిగ్భ్రాంతి

పల్నాడు జిల్లా పసుమర్రు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కాగా, సర్ ఆర్థర్ కాటన్ కాటన్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి చంద్రబాబు నివాళులర్పించారు.

రైతుల ఖాతాల్లో నిధులు వెంటనే జమ చేయాలి

- సీఎస్‌కు రాష్ట్ర రైతు సంఘం లేఖ

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్ సీజన్‌లో కరవు, తుపాను, భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ కింద చెల్లించాల్సిన రూ.1,294 కోట్ల నిధులను తక్షణమే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. ఈ నిధుల విడుదలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత మార్చి 6వ తేదీనే బటన్ నొక్కారని, కానీ ఇంతవరకు చెల్లింపులు జరగలేదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ లోక్‌సభ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో 38శాతం పోలింగ్ నమోదుకావడం సంతోషించాల్సిన అంశం. 1996 తరువాత అత్యధిక పోలింగ్ జరిగిన రికార్డు ఇదే. ఓటర్లు ఉత్సాహంగా ఓట్లువేయడంతో పాటు, ఎటువంటి దాడులు, ఘర్షణలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా పూర్తికావడం మరో విశేషమైన పరిణామం. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), పీడీపీతో పాటు 24మంది ఇక్కడ పోటీలో ఉన్నారు. బుద్గాం జిల్లాలోని కొన్ని భాగాలను తొలగించి, పుల్వామా జిల్లాను, షోపియాన్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలను చేర్చి పునర్వ్యవస్థీకరించిన శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గం కశ్మీరీ పండిట్ల ఉత్సాహపూరితమైన భాగస్వామ్యంతో, ఘనమైన పోలింగ్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది. పోస్టల్ బ్యాలెట్‌తోపాటు, ఢిల్లీ, జమ్మూ, ఉదంపూర్‌లలోని శరణార్థ శిబిరాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను కూడా ఓటర్లు చక్కగా వినియోగించుకున్నారు. దశాబ్దాలుగా ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని 2019 ఆగస్టులో రద్దుచేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలు మార్చిన తరువాత అక్కడ జరుగుతున్న తొలి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు విస్తృతంగా పాల్గొనడం మంచి పరిణామం. 370వ అధికరణ రద్దు నిర్ణయం సరైనదీ సముచితమైనదీ అని ప్రజలు ఈ విధంగా తీర్పుచెప్పారంటూ ప్రధాని నరేంద్రమోదీ వెంటనే ట్వీట్ చేశారు. మంగళవారం ఒక ఆంగ్లదినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

సంస్థాగతంగా తమ పార్టీని బలోపేతం చేసుకొనేవరకూ అక్కడ పోటీచేయకూడదని నిర్ణయించుకున్నామని హోంమంత్రి అంటున్నారు. అయితే, బీజేపీ బరిలో లేకపోలేదని, మారువేషంలో ఉన్నదని కశ్మీరీ పార్టీలైన పీడీపీ, ఎన్సీల వాదన. అల్తాఫ్ బుఖారీకి చెందిన అప్నీ పార్టీ (ఏపీ), సజ్జాద్‌లోన్ నాయకత్వంలోని పీపుల్స్ కాన్ఫరెన్స్ (పీసీ)లను బీజేపీ ఆశీస్సులున్న పార్టీలుగా ప్రజలు కూడా అనుమానిస్తున్నారు.

మంచి పరిణామం

ఈ రెండు పార్టీలు వేర్వేరు స్థానాల్లో బరిలో ఉంటూ ప్రధానంగా అబ్దుల్లాలకు, ముఫ్తీలకు సవాలు విసురుతున్నాయి. తమ ప్రత్యేకప్రతిపత్తిని హరించి, అన్ని రక్షణలనూ తొలగించి, బయటివారికి తలుపులు తెరిచిన కేంద్రపాలకుల మీద కశ్మీరీలు ఆగ్రహంగా ఉన్నారని, పోలింగ్ జరుగుతున్న స్థానాల్లో ఓటింగ్ గణనీయంగా పెరగడం బీజేపీమీద ఆగ్రహమే తప్ప అనుగ్రహం కాదని కొందరి వాదన. పోలింగ్ శాతం తక్కువగా ఉంటూ, కశ్మీరీ పార్టీల మధ్య ఓట్లు చీలిన పక్షంలో బీజేపీ ఆశీస్సులున్న కొత్తపార్టీలకు లబ్ధి చేకూరుతుందని, ఇప్పుడు అధికపోలింగ్‌తో పాతపార్టీలకే మేలు చేకూరుతుందని వారి విశ్లేషణ. ఎవరి అంచనాలు ఎలా ఉన్నప్పటికీ, మారిన వాతావరణం నేపథ్యంలో కశ్మీర్‌లో ఓటర్ల మనోగతాన్ని విశ్లేషించడం నిజానికి సాహసమే. కానీ, దశాబ్దాలుగా ఓటుచేయని వృద్ధులు సైతం లైన్లలో నిలబడి, ఈవీఎంల గురించి తెలుసుకొని మరీ ఓటుచేయడం సంతోషం కలిగించే పరిణామం. స్వేచ్ఛగా, ఏమాత్రం భయం లేకుండా ఓటువేయగలిగే అవకాశాలు గతంతో పోల్చితే ఇప్పుడు మరింత మెరుగ్గా ఉన్నాయి. ప్రజలు ఎంతో ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. వలసపోయిన కశ్మీరీ పండిట్లలో నలభైశాతం మంది ఓటువేశారని హోంమంత్రి గుర్తుచేస్తున్నారు. హింస, పోలింగ్ బహిష్కరణ ఆదేశాలు పాటించనివారిపై దాడులు ఇత్యాది దృశ్యాలను దశాబ్దాలుగా అక్కడ చూశాం. నిరుద్యోగం, అధికధరలు, భవిష్యత్‌మీద అపనమ్మకం ఇత్యాదివి ఇప్పుడు ఓటర్లమీద పనిచేశాయి. ఓటుద్వారానే తమ బతుకులను మార్చుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారు.

ఈ ఎన్నికల్లో కశ్మీర్‌లోయను వదిలిపెట్టి, లద్దాఖ్, జమ్మూలకు పరిమితం కావాలని బీజేపీ ఎందుకు నిర్ణయించుకుందో తెలియదు. 370అధికరణ రద్దును కశ్మీరీలు స్వాగతిస్తున్నారని నమ్మినపక్షంలో బీజేపీ నిర్భయంగా ఈ ఎన్నికల ద్వారా ప్రజామోదాన్ని కోరివుండేది. తద్వారా, ప్రత్యేకప్రతిపత్తి రద్దు తరువాత తాను చేపట్టిన సంస్కరణలను, సాధించిన అభివృద్ధిని ప్రజలు మెచ్చుకున్నారని దేశానికి సగర్వంగా చెప్పుకోగలిగే అవకాశమూ దానికి దక్కేది. ఈ రాజకీయాన్నంతా పక్కనబెడితే, ఈ ఏడాది సెప్టెంబర్ 30లోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తిచేయాల్సిందేనంటూ ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. సాధ్యమైనంత త్వరలో రాష్ట్రహోదాను పునరుద్ధరించాలని కూడా కోర్టు పేర్కొంది. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయి, ఓటరు జాబితాలు సిద్ధంగా ఉన్నందున, ఇక ఆ దిశగా వేగంగా అడుగులు వేయడం ముఖ్యం.


వర్గ–కుల ఆయుధమిచ్చిన వీరన్న!

పీడీఎస్‌యూ వీరన్నగా అందరికీ సుపరిచితుడైన మారోజు వీరన్న తను జీవించిన కాలాన్నీ, తదనంతర కాలాన్నీ తీవ్రంగా ప్రభావితం చేసిన అతికొద్దిమంది కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. పీడీఎస్‌యూ నాయకుడిగా అనేక ఉద్యమాలు చేపట్టారు. డెంటల్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆనాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి పదవి నుంచి దిగిపోయే వరకు చారిత్రాత్మక ఉద్యమాన్ని నిర్మించిన చరిత్ర వీరన్నది. మండల్‌కు పోటీగా 'కమండల్' ఉద్యమాన్ని తీసుకొచ్చిన ఆరెస్సెస్, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా విశాల బహుజన ఉద్యమాన్ని నిర్మించిన ఘనత వీరన్నది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆరెస్సెస్, ఏబీవీపీ ఆందోళనలు చేస్తుంటే ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రిజర్వేషన్ల పరిరక్షణా ఉద్యమాన్ని నిర్మించాడు వీరన్న.

కామ్రేడ్ వీరన్న లేవనెత్తిన 'ప్రత్యేక తెలంగాణ' ఉద్యమం మహోగ్రరూపం తీసుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తర్వాత తెలంగాణ బహుజన ప్రజల యాదిలో వీరన్న చిరస్థాయిగా నిలిచే ఉంటాడు. ఐదు వందల జనాభా కలిగిన లంబాడ తండాలను ప్రత్యేక పంచాయితీలుగా సాధించుకొన్న లంబాడ గిరిజన ప్రజల గుండెలలోనూ వీరన్న స్థానం సుస్థిరంగా నిలిచే ఉంటుంది. 'జల్, జంగిల్, జమీన్'లపై సర్వాధికారాలు ఆదివాసీలకే అన్న డిమాండ్‌తో ఆదివాసీలు మొదలెట్టిన ఉద్యమం నేటికీ మండుతూనే ఉన్నది. ఈ ఉద్యమం ఎన్ని రూపాలలో జరిగినా వీరన్న ఈ ఉద్యమానికి స్ఫూర్తియై ప్రకాశిస్తూనే ఉంటాడు.

మాల, మాదిగ, ఎరుకల, గౌడ, చాకలి, యాదవ, బుడిగిజంగాల, మంగలి తదితర కులాలన్నీ తమ ఉద్యమ క్రమంలో, అభివృద్ధి క్రమంలో వీరన్నను గుర్తుచేసుకుంటూనే ఉంటాయి. తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు, తెగలకు కులాల ప్రాతిపదికపై అభివృద్ధి పథకాలను, సంక్షేమ పథకాలను ఆయా ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయంటే, ఆ పథకాలలో అంతర్లీనంగా వీరన్న ప్రస్ఫుటిస్తూనే ఉన్నాడు, ఉంటాడు.

బీజేపీ రాజకీయాలు ఉగ్రవాద, బ్రాహ్మణవాద రాజకీయాలనీ, కాంగ్రెస్ ఉదారవాద, బ్రాహ్మణవాద రాజకీయాలనీ వీరన్న 35 ఏళ్ళ క్రితమే చెప్పాడు. ఆరెస్సెస్, బీజేపీలు కులతత్వం, మతతత్వం, కుహనా జాతీయవాదతత్వం, కుహనా హిందూ దేశభక్తితత్వం అనే నాలుగు తత్వాలను నిరంతరం ఆచరిస్తూ ప్రజల మధ్య విద్వేషాలను రగిలిస్తూ, విధ్వంసాలను సృష్టిస్తూ తిరోగమన రాజకీయాలను చేస్తోంది. దీనికి ప్రతిగా కాంగ్రెస్ పార్టీ ఉదారవాద బ్రాహ్మణవాద రాజకీయాలను ఆచరిస్తుంది. బహుజనులలో పెరుగుతున్న చైతన్యాన్ని, అభివృద్ధిని చూసి భయపడుతున్న అగ్రవర్ణ, అగ్రకుల సంపన్న వర్గాలు బీజేపీకి మద్దతునిచ్చాయి. ఫలితంగా బీజేపీ గత పదేళ్ళుగా అధికారంలో కొనసాగి దేశంనిండా విద్వేషాన్ని నింపింది. దీంతో మత రాజకీయాలను ఎదుర్కోవాలంటే కులమే ప్రత్యామ్నాయం అని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ఎత్తుగడలలో భాగంగా కులజనగణనకు సిద్ధపడుతుంది. కుల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల కల్పనకు హామీనిస్తుంది. కామ్రేడ్ మారోజు వీరన్న మూడు దశాబ్దాల క్రితమే 'మేమెంత మందిమో – మాకంత వాటా, అణగారిన కులాలందరిదీ అదే బాట' అన్నాడు. అందుకు 'కుల జనగణన' తప్పనిసరి అని చెప్పిన రాజకీయ అంశాలు వర్తమాన రాజకీయాలలో ఎజెండా అయి కూర్చున్నాయి. భవిష్యత్తులో మరింత స్పష్టంగా అణగారిన కులాల డిమాండ్‌లు ఎజెండాలోకి వస్తాయి. అది అనివార్యం. అయితే అగ్రవర్ణ, అగ్రకుల పాలకవర్గ రాజకీయ ఎత్తుగడలలో భాగంగా ఈ అంశాలు ఎజెండా అయ్యాయి. కానీ, ప్రత్యామ్నాయ రాజకీయాల నిర్మాణ బాధ్యత కమ్యూనిస్టులదే, బహుజనిస్టులదేనని గుర్తించాలి.



కామ్రేడ్ వీరన్న కులసంఘాలను, గిరిజన సంఘాలను, దళిత బహుజన సంఘాలను స్థాపించినప్పుడు ఆ నిర్మాణాలను కులతత్వ నిర్మాణాలని, కులతత్వ ఉద్యమాలని తీవ్రంగా వ్యతిరేకించిన కమ్యూనిస్టు, విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఆ తరువాత కాలంలో వాటిని ప్రజాస్వామిక ఉద్యమాలుగా, నిర్మాణాలుగా తీర్మానించుకున్నాయి.

దేశంలో ప్రభావిత స్థాయిలో కమ్యూనిస్టు పార్టీలు, బహుజన పార్టీలు ఉన్నప్పటికీ కనీసం ఒక రాజకీయ ఫ్రంట్‌గా కూడా కలిసి పోటీచేయలేక పోతున్నాయి. ఇటువంటి రాజకీయ పరిస్థితులలో 1999లోనే కామ్రేడ్ వీరన్న నాయకత్వంలో ఎమ్.సి.పి.ఐ ఓంకార్ గారిని, బి.యస్. రెడ్డి గారిని, సి.పి.ఐ.ఎమ్.ఎల్ ప్రజాపోరు అంగడి చెన్నయ్య తదితర కమ్యూనిస్టు పార్టీలను, మంద కృష్ణమాదిగ ఎమ్.ఆర్.పి.యస్, కొరివి వినయ్ కుమార్ డి.బి.యఫ్, వై.కె.గారు, సామాజిక న్యాయకేంద్రం, ఎరుకల, లంబాడ, తుడుందెబ్బ, గౌడ, చాకలి, గొల్లకుర్మ, బోయ, మంగలి, యానాది, పూసలి, బుడిగిజంగాల, ముస్లిం రైట్స్ ఫోరం తదితర కులసంఘాలను కలిపి మహాజన ఫ్రంట్‌ను ఏర్పరచి నూతన రాజకీయ ఒరవడికి పునాదులు వేసాడు.

ఎర్రజెండా శిబిరంలో కులం సమస్యపై చర్చను లేవనెత్తి తను రచించిన 'ఇండియాలో ఏంచేయాలి' అనే గ్రంథం ద్వారా వర్గ–కుల సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, ఆ సిద్ధాంతం వెలుగులో అనేక వర్గ–కుల సంఘాలను నిర్మాణం చేసి తను జీవించిన కాలాన్ని, తదనంతర కాలాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన అతికొద్దిమంది కమ్యూనిస్టు నాయకులలో మారోజు వీరన్న ఒకరు. వీరన్న కంటే ముందు అనేక మంది పేరెన్నికగన్న నాయకులు వర్గ సమస్య కోణంలో మాత్రమే సమాజాన్ని ప్రభావితం చేయగా, కామ్రేడ్ వీరన్న మాత్రం వర్గ–కుల కోణంలో సమాజాన్ని ప్రభావితం చేయగలిగాడు.

ఆనాడు వీరన్న కులం సమస్యను సిద్ధాంతం చేసినప్పుడు ఆ సిద్ధాంతాన్ని కుల వాదమని, నాన్‌మార్క్సిజం అని రకరకాల విమర్శలు చేసినవారు ఆ తరువాత కాలంలో ఏదో ఒక స్థాయిలో కులం సమస్య గురించి చర్చిస్తున్నారు. కామ్రేడ్ వీరన్న కులసంఘాలను, గిరిజన సంఘాలను, దళిత బహుజన సంఘాలను స్థాపించినప్పుడు ఆ నిర్మాణాలను కులతత్వ నిర్మాణాలని, కులతత్వ ఉద్యమాలని తీవ్రంగా వ్యతిరేకించిన కమ్యూనిస్టు, విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఆ తరువాత కాలంలో వాటిని ప్రజాస్వామిక ఉద్యమాలుగా, నిర్మాణాలుగా తీర్మానించుకున్నాయి. నిర్మాణాత్మక పనివిధానికి కూడా కొన్ని పార్టీలు ముందుకు వస్తున్నాయి. ఇవి స్వాగతించదగిన పరిణామాలు. అలాగే కామ్రేడ్ వీరన్న పూలే, అంబేడ్కర్‌ల సైద్ధాంతిక ఆలోచనలను కమ్యూనిస్టులు స్వీకరించాలని వ్రాసినప్పుడు 'మార్క్సిజంతో సంస్కరణవాదాన్ని జోడిస్తారా' అని మాట్లాడటమే కాక, పూలే, అంబేడ్కర్లను సంస్కరణవాదులని ఎద్దేవా చేసిన వారు నేడు పూలే, అంబేడ్కర్లు సామాజిక విప్లవకారులని తీర్మానిస్తున్నారు. కొన్ని కమ్యూనిస్టు పార్టీలయితే ఏకంగా బహుజనసంఘాలను స్థాపిస్తున్నాయి. నేరుగా ఆ పార్టీలు అంగీకరించినా, అంగీకరించకపోయినా, సమాజంలో పెరుగుతున్న బహుజన చైతన్యం, పూలే, అంబేడ్కర్ సంఘాల ప్రాధాన్యం, ప్రభావం వారిపైన పెరగడమే కాక కామ్రేడ్ వీరన్న ప్రభావమూ ఏదో మేరకు ఉంది అనడం అతిశయోక్తి కాదు.

కామ్రేడ్ మారోజు వీరన్న సహచరులుగా ఆ సిద్ధాంత చర్చ కొనసాగడానికీ, ఆచరించడానికీ మేము దివిటీలమై వెలుగుతూనే ఉంటాం. కేవలం మార్క్సిజం కానీ కేవలం అంబేడ్కరిజం కానీ ప్రజలను విముక్తి చేయలేవు. కులం–వర్గం కలగలిసి కొనసాగుతున్న ఈ దేశంలో మార్క్సిజం, అంబేడ్కరిజంలను ఈ దేశప్రజలు సైద్ధాంతిక ఆయుధాలుగా స్వీకరించాల్సిందే. ఆ కర్తవ్య నిర్వహణ కోసం కృషిచేద్దాం.

• సాదు మాల్యాద్రి
రాష్ట్రనాయకులు, బహుజన పొలిటికల్ సెంటర్

(నేడు మారోజు వీరన్న 25వ వర్ధంతి)

వంద అదనమా? వంద పతనమా?


దిగ్భ్రాంతి చిన్నమాట. సర్వ జ్ఞానేంద్రియాలూ స్తంభించిపోయి, మనసుకు చీకట్లు కమ్మి, అవాక్కై ఉనికి ఉనికే కొయ్యబారిపోయిన అచేతనావస్థ. ఇన్ని రోజులు వింటున్నదేమిటి? వారణాసి నగరంలో పవిత్ర గంగానది మధ్యల్లో, ఆ పెద్దమనిషి ఇప్పుడు అంటున్నది ఏమిటి? 'మహాశ్చర్యంబు చింతింపగన్'.

"నేనెప్పుడన్నాను? చొరబాటుదారులని నేను వాళ్లను అనలేదే? అధికసంతానులంటే ముస్లిములని ఎవరు చెప్పారు? ఎందుకు వాళ్ల గురించి అన్యాయంగా ఆలోచిస్తారు? నేను పేదవాళ్లను దృష్టిలో పెట్టుకుని అన్నాను. హిందూ ముస్లిం అన్న తేడాలను నేను తీసుకువస్తే, నేనసలు ప్రజాజీవితానికి పనికిరాను' అన్నారు నరేంద్ర మోదీ. ముస్లిములతో ఇరుగుపొరుగు జీవితం గురించి, ఈద్ వేళల్లో తమ ఇంటికి కానుకగా వచ్చే భోజనాల గురించి, మొహర్రం ఊరేగింపులో తాను పాల్గొనడం గురించి మోదీ ఎంతో తన్మయంతో చెప్పారు. తాను కఠినుడిని కానని, తనలోపల ఒక తడిహృదయం ఉన్నదని, తనను ఇంతవాడిని చేసింది జనమేనని, తనలో ఏవైనా లోపాలుంటే సరిచేసుకుంటానని ఆయన మనసు విప్పిమాట్లాడారు. తనకూ ముస్లిములకూ మధ్య ప్రతిపక్షాలు అపార్థాలను కల్పించాయని చెబుతున్నప్పుడు ఆయన గొంతు పూడుకుపోయింది.

కాశీలో నామినేషన్ వేళ, సాధారణ ఎన్నికల అయిదో దశ పోలింగ్‌కు పూర్వరంగంలో ఈ అపరిచితుడి ఆవిష్కరణ జరిగింది. రెండో దశ పోలింగ్ తరువాత మారిన స్వరానికి, ఇప్పుడు నాలుగోదశ తరువాత మారుతున్న స్వరానికి తేడాలు గమనించిన వారికి, అందుకు కారణాలు కూడా ఊహించడం కష్టం కాక పోవచ్చు. ఇంకా పోలింగ్ జరగవలసి ఉన్న 163 లోక్‌సభ నియోజకవర్గాలలో మునుపటి మంగళసూత్రాలూ, ముస్లిం రిజర్వేషన్లూ పెద్ద అవసరం లేకపోవచ్చు.

ఇంతకూ దశల వారీగా ఎన్నికల ప్రచారాంశాలను, శైలిని మార్చుకోవడం ముందే రూపొందించుకున్న ప్రణాళికా బద్ధ వ్యూహంలో భాగమా? లేక, ఈ కొత్త రాజకీయ సంవాదాలు, గడచిన దశల పోలింగ్ సరళుల ఆధారంగా తీసుకుంటున్న ఆపద్ధర్మ దిద్దుబాట్లా?

తాను సొంతంగా 303, ఎన్‌డీఏ కూటమి మిత్రులతో కలిసి 353 గెలుచుకున్న భారతీయ జనతాపార్టీ, ఈసారి 370, 400 అన్న లక్ష్యాన్ని ప్రకటించుకుని రంగంలోకి దిగింది. ఆ పార్టీ ధీమాను, ఎదుటి పక్షాన్ని బెదరగొట్టాలనే ధోరణిని ఆ సంఖ్యలు వ్యక్తం చేస్తూ వచ్చాయి. మొదటి రెండు దశల దాకా, ఆ నినాదానికి ప్రతినినాదమే లేదు. మునుపటి కంటె మెరుగైన ప్రచారశక్తితో ప్రయత్నించడం తప్ప ఇండియా కూటమి ప్రారంభదశలో దూకుడు ప్రదర్శించింది లేదు. ముస్లిం వ్యతిరేక ప్రచారాంశాలను సాక్షాత్తూ ప్రధానమంత్రి ధాటిగా మాట్లాడడం మొదలుపెట్టిన తరువాత, ఇండియా కూటమి ఆలోచనలో పడింది. ప్రతికూలపవనాలు వీస్తున్నాయని తెలిసి, తెగింపుతో సాక్షాత్తూ ప్రధానమంత్రి ముస్లిం వ్యతిరేక ప్రచారానికి ఒడిగట్టారని భావించి, సమాధానమివ్వడం మొదలుపెట్టింది. మోదీకి ప్రతికూలత పెరిగిందన్న అభిప్రాయాన్ని, అంకెలలోకి అన్వయించసాగింది. బీజేపీ కూటమికి 400 స్థానాలు అసాధ్యం అన్న మాటతో మొదలై, క్రమంగా, సాధారణ మెజారిటీకే ఆమడ దూరంలో ఆ పార్టీ ఆగిపోతుందన్న దాకా ఇండియా కూటమి నేతలు మాట్లాడారు. అందుకు వివరణగా, ఉత్తరాదిలో అంతా తరుగేనని, దక్షిణాదిలో వస్తుందనుకున్న పెరుగుదల రాదని ఒక వాదన కూడా ప్రచారంలో పెట్టారు. పోయిన ఎన్నికలలో అత్యధిక స్థానాలు గెలిచిన రాష్ట్రాలన్నిటిలో ఈసారి గణనీయమైన కోత తప్పదని చెబుతూ వచ్చారు.



చివరకు వాళ్ల 400, వీళ్ల 220 రెండూ మానసిక యుద్ధతంత్రంలో భాగమే కావచ్చు. అదీ ఇదీ కూడా అసాధ్యమైన సంఖ్యనే కావచ్చు. ఇంకా 163 స్థానాల పోలింగ్ ఉన్న మిగిలిన దశలను మనసులో పెట్టుకుని, ఈ ఎత్తుగడలు సాగుతూ ఉండవచ్చు. కానీ, ఒకరిలో పెరుగుతున్న అధైర్యం, మరొకరిలో కనిపిస్తున్న ఉత్సాహం ఎందువల్ల అన్న సందేహం మిగిలే ఉంటుంది. తనకు ఇష్టమైన ఊహలో ఉండడానికి ఓటరుకు ఇరవైరోజుల అవకాశం ఉంది. బరిలో ఉన్నవారి సంగతి వేరు, అధికారం చేజిక్కుతుందని కొందరి ఆశ. చేజారుతుందని కొందరి భయం.

పోలింగ్ సరళి సమాచారం ప్రతిపార్టీకి సొంత యంత్రాంగం ద్వారా అందుతుంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా అందుబాటులో ఉండే పార్టీలకు మరింత లోతైన సమాచారం అందే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన పోలింగ్‌పై బీజేపీకి అందిన కూపీలేమిటో తెలియదు. ఆ పార్టీ సరళిని బట్టి ఊహించవలసిందే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేత ఎటువంటి మాటలైనా మాట్లాడించడం, అసత్యాలనిపించే ప్రకటనలు కూడా చేయించడం, గద్గద స్వరంతో భావోద్వేగాలను కూడా ప్రదర్శింపజేయడం చూస్తుంటే, లక్ష్యాన్ని సాధించలేకపోవడం గురించిన నిస్పృహ భావం బీజేపీ ప్రచారనిపుణులలో కలిగిందా, ఆ ఆత్రుత, ఉత్కంఠ నుంచే ఆపద్ధర్మ నిర్ణయాలు తీసుకుంటున్నారా? అన్న సందేహాలు కలుగుతాయి.

ఇప్పుడు లక్ష్యాన్ని 272కు దించుకోవాలా? అన్న అంశం మీద, నాలుగో దశ పోలింగ్ ముగిసిన రోజు రాత్రి రాజ్‌దీప్ సర్దేశాయి ఇండియాటుడే టీవీలో చర్చ నిర్వహించారు. 2019 ఎగ్జిట్ పోల్స్‌లో చాలా సమీపస్థాయిలో ఫలితాలను ఊహించగలిగిన యాక్సిస్ పై ఇండియా సారథి ప్రదీప్ గుప్తా, అనేక రాజకీయ పార్టీలకు వ్యూహనిపుణుడిగా పనిచేసిన ప్రశాంత్ కిశోర్, ఎన్నికల విశ్లేషకుడు, సామాజిక శాస్త్రవేత్త యోగేంద్రయాదవ్ పాల్గొన్న ఈ చర్చ మీడియాలో మరింత విస్తృత సంవాదాలకు కారణమైంది. 2019 నాటి పరిస్థితికి, ఇప్పటి పరిస్థితికి పెద్ద తేడా ఏమీ లేదని, బీజేపీ బలం తగ్గిపోతుందని చెప్పేవాళ్లు ఎక్కడ ఏ రాష్ట్రంలో తరుగుదల ఉంటుందో చెప్పాలని ప్రశాంత్ కిశోర్ అభిప్రాయపడ్డారు. 2004 నాటి అనుభవాన్ని చెబుతూ, బీజేపీ పరాజయావకాశాలను చర్చిస్తున్న యోగేంద్రయాదవ్ మాత్రం పరిస్థితిలో మార్పు ఉన్నదని అన్నారు. సీట్లసంఖ్య జోలికి పోను గానీ, గత ఎన్నికలకు ఇప్పటికీ ఓటింగ్ సరళిలో పెద్ద తేడా కనిపించడం లేదని ప్రదీప్ గుప్తా అంటున్నారు. అనేక దశల పోలింగ్‌లో మధ్య దశల నుంచి గాలిమారే అవకాశం లేదని ఖాయంగా చెబుతున్నారు.

ఈ ఇద్దరిలో కనీసం ప్రదీప్ గుప్తా దగ్గర గడచిన మూడు దశల పోలింగ్ ధోరణి గురించిన సమాచారం ఉండవచ్చు. ప్రశాంత్ కిశోర్‌కు ఇప్పుడు సొంతంగా యంత్రాంగం లేదు కానీ, అనుభవం నుంచి, విధాన విశ్లేషణ నుంచి ఫలితాలను ఊహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ఘోరంగా ఓడిపోతారని ఆయన చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు ఆరు నుంచి తొమ్మిది లోపు స్థానాలు వస్తాయని చెబుతున్నారు. జాతీయస్థాయిలో యథాతథ స్థితే ఉంటుందని, ఉత్తరాదిలో ఏమైనా కోల్పోయిన పక్షంలో అవి తక్కిన చోట్ల భర్తీ అవుతుందని ఆయన అంటున్నారు. వీరందరూ 2019 కంటె ఇప్పుడు రాష్ట్రాలలో ఎన్నికల సర్దుబాట్లు భిన్నంగా జరిగాయని, కొత్త సమీకరణలు ఏర్పడ్డాయని గుర్తించారా? మోదీ జాతీయస్థాయి ఎన్నికల యుద్ధం చేస్తుంటే, ప్రతిపక్ష కూటమి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం లెక్కన పోరాడుతోందని గ్రహించారా?

ఈ నిపుణుల అనుభవాన్ని గౌరవించవలసిందే కానీ, ఈ చర్చ, ఈ దశలో ఎందుకు అవసరమవుతోంది? అన్నది ప్రశ్న. బీజేపీ 400 లక్ష్యాన్ని చెప్పినప్పుడు, ఈ గుప్తా, కిశోర్ వంటివారు, అదనంగా 100 స్థానాలు ఎక్కడ గెలుస్తారు అని అడిగారా? ఇప్పుడు మాత్రం బీజేపీ 100 స్థానాలు ఎక్కడ కోల్పోతుందో చెప్పమని ఇండియా కూటమిని నిలదీస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి 220 మించి రాకపోవచ్చునని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబితే, మమతాబెనర్జీ ఇండియా కూటమికి 315 స్థానాలు దక్కవచ్చునని అంటున్నారు. తాజాగా ఖర్గే కూడా గొంతు కలిపి, నాలుగుదశల తరువాత ఇండియా కూటమి బలం పెరిగిందని అన్నారు. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మరొక అడుగు ముందుకు వేసి, బీజేపీకి 200 స్థానాలేనని, ఇండియా కూటమి మమతా బెనర్జీని పక్కకు బెట్టి కాంగ్రెస్‌కు నాయకత్వం అప్పగించాలని మాట్లాడారు. బీజేపీ 400 వాదనకు ఇవి పోటీ వాదనలు మాత్రమేనా? ఆత్మవిశ్వాసాన్ని దట్టించిన ప్రకటనలతో బీజేపీని బెదరగొట్టడానికేనా? కేవలం వ్యూహమే అయితే, వాస్తవం కాకపోతే, మరి ఇండియా కూటమిలో కొంత కొత్త ఉత్సాహం, బీజేపీలో ఉత్కంఠ ఎందుకు కనిపిస్తున్నాయి? ప్రతిపక్ష కూటమి చెబుతున్న గాలిమార్పు వాదనను ఖండించే ఆత్మరక్షణలో ఎందుకు పడిపోయారు? రాహుల్ శివశంకర్ వంటి అస్మదీయ జర్నలిస్టులు పనిగట్టుకుని, 2004కు, 2024కు పోలికే లేదని, మోదీ తిరిగి ఘన విజయం సాధిస్తారని ఎందుకు కొత్తగా విశ్లేషణలు చేయవలసి వస్తోంది?



■ కె. శ్రీనివాస్

సందర్భం

మతవిభజన ముద్రను ఉన్నట్టుండి తుడిపేసుకోవాలని మోదీ ఎందుకు చూస్తున్నారు? ఇటీవలి ప్రచారం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేత ఎటువంటి మాటలైనా మాట్లాడించడం, అసత్యాలనిపించే ప్రకటనలు కూడా చేయించడం, గద్గద స్వరంతో భావోద్వేగాలను కూడా ప్రదర్శింపజేయడం చూస్తుంటే, లక్ష్యాన్ని సాధించలేకపోవడం గురించిన నిస్పృహ భావం బీజేపీ ప్రచారనిపుణులలో కలిగిందా, ఆ ఆత్రుత, ఉత్కంఠ నుంచే ఆపద్ధర్మ నిర్ణయాలు తీసుకుంటున్నారా? అన్న సందేహాలు కలుగుతాయి.

మోతాదు మించిందని, జనం హర్షించడం లేదని సంకేతం అందిందా? సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ చివరి మూడు దశలకు ఎందుకు అవసరమైంది? జూన్ ఒకటో తేదీ లోగా, మోదీ మరిన్ని అవతారాలు ప్రదర్శించబోతారా? సామాజిక మాధ్యమాలలో బీజేపీ వర్గీయులు ఎందుకు గోరువెచ్చగా మారిపోయారు? విమర్శక వీడియోలకు యూట్యూబ్‌లలో కోట్లాది వీక్షణలు ఎందుకు లభిస్తున్నాయి? న్యాయవ్యవస్థలో కొంత ధైర్యం పెరిగిందని వినిపిస్తున్న వ్యాఖ్యలను ఎట్లా అర్థం చేసుకోవాలి? (కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు నుంచి ప్రత్యేక సదుపాయం లభించిందని బాహాటంగా అమిత్ షా విమర్శించడం దేనికి సూచిక?)

చివరకు వాళ్ల 400, వీళ్ల 220 రెండూ మానసిక యుద్ధ తంత్రంలో భాగమే కావచ్చు. అదీ ఇదీ కూడా అసాధ్యమైన సంఖ్యనే కావచ్చు. ఇంకా 163 స్థానాల పోలింగ్ ఉన్న మిగిలిన దశలను మనసులో పెట్టుకుని, ఈ ఎత్తుగడలు సాగుతూ ఉండవచ్చు. కానీ, ఒకరిలో పెరుగుతున్న అధైర్యం, మరొకరిలో కనిపిస్తున్న ఉత్సాహం ఎందువల్ల అన్న సందేహం మిగిలే ఉంటుంది. తనకు ఇష్టమైన ఊహలో ఉండడానికి ఓటరుకు ఇరవైరోజుల అవకాశం ఉంది. బరిలో ఉన్నవారి సంగతి వేరు, అధికారం చేజిక్కుతుందని కొందరి ఆశ. చేజారుతుందని కొందరి భయం.

కొత్త ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

పాలకులు మారినంత మాత్రాన ఆర్థిక విధానాల్లో మార్పు రానంత వరకు ప్రజలకు ఒరిగేది శూన్యం. అధికారం శాశ్వతం కాదు. ఎన్నికల సరళి పరిశీలిస్తే నిశ్శబ్ద విప్లవంలా ఉంది. తెలుగుదేశం పరిస్థితి ఎలా ఉన్నా బీజేపీ, జనసేన తమ స్థానాలను గెలుచుకోకపోతే ఎన్డీఏతో బాబు చెలిమి పట్ల ఓటర్లు సుముఖంగా లేనట్లే. జగన్ పోయి బాబు వచ్చినా పెనం నుండి పొయ్యిలో పడ్డట్టే. రాష్ట్రంలో వనరులను సద్వినియోగం చేసుకుని, అప్పులకై వెంపర్లాడకుండా అందరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి సొంత కాళ్లపై నిలబడేలా చేయాలి. చంద్రబాబు సైతం ఆకాశహర్మ్యాలు నిర్మించకుండా ప్రపంచ బ్యాంకు అప్పుల్లోకి జనాన్ని, రాష్ట్రాన్ని దించకుండా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలి. రైతాంగానికి ఉచిత విద్యుత్తు, ఒక్కసారి రుణమాఫీ, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధర కల్పించాలి. నిరుద్యోగ యువతకు జాబ్ గ్యారంటీ ఇవ్వాలి. ఉద్యోగం పొందే వరకు నిరుద్యోగ భృతి కల్పించాలి. కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలి. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం రోజుకు 500 రూపాయలు ఇవ్వాలి. అసంఘటిత కార్మికులకు ఆశా, అంగన్‌వాడి, హెల్త్ వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి. పబ్లిక్ రంగ పరిశ్రమలను పరిరక్షించాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

సంక్షేమ పథకాలు కావాలో! అభివృద్ధి కావాలో! తేల్చుకోండి అని బీరాలు పలికిన చంద్రబాబు సైతం జగన్‌ను మించి సూపర్ సిక్స్ పేరుతో మేనిఫెస్టో ప్రకటించారు. అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు హామీలు నెరవేర్చాలంటే సుమారు 1.70 వేల కోట్ల రూపాయలు అవుతుందని అంచనా. ఇందు కోసం ప్రజలపై పరోక్ష పన్నులు భారం పడే ప్రమాదం ఉంది. పెన్షన్‌పై ఇచ్చిన మాట తప్పిన జగన్‌కి వ్యతిరేకంగా 80 శాతానికి పైగా ఉద్యోగస్తులు పోస్టల్ బ్యాలెట్‌లో నిరసన తెలిపారు. ఫలితాలు ఎవరికి అనుకూలంగా వచ్చినా ప్రజాస్వామ్యంలో హుందాగా స్వీకరించాలి. కక్షతో దాడులకు పాల్పడితే పాలన శాంతిభద్రతల సమస్యగా మారి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా ఉంటుంది. అందరికీ విద్య ఉచితంగా అందించాలి. తాయిలాలు అందించి యాచకులుగా, సోమరిపోతులుగా చేస్తే సమాజం నిర్వీర్యం అవుతుంది. రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధిని తిరిగి నిలదొక్కుకునేటట్టు చేయాలి. అమరావతి రాజధాని నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టాలి. విశాఖ ఉక్కు ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా పోరాడాలి. ఆ పరిశ్రమకు తక్షణం గనులు కేటాయించేలా చూడాలి. ప్రైవేటుపరం చేసిన పోర్టులను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీలను సాధించాలి.

– దినవహి హరినాథ్

ఆదివాసీలది అరణ్యారోదనేనా?

ఆదివాసీలు నివసించే దండకారణ్యంలో, ప్రభుత్వ సాయుధ బలగాలు ఈ ఏప్రిల్ 16న జరిపిన కాల్పుల్లో, 29 మంది ఆదివాసీ స్త్రీ పురుషులు చనిపోయినట్టు, పత్రికల్లో వార్త! ఆ కాల్పులకు గురైన వారిలో, 27 మంది మొహాల ఫోటోల్ని పత్రికల్లో చూపించారు! దాదాపు అందరి మొహాలూ రక్తాలతో తడిసి వున్నాయి!

తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకూ, ఎన్కౌంటర్లు అనేవి, 1969 నించీ ఇప్పటివరకూ దాదాపు '3 వేలకు పైగా' జరిగినట్టు ఒక లెక్క. ఆ ఎన్కౌంటర్లన్నీ, పోలీసులూ–నక్సలైట్లూ నిజంగా రెండు పక్షాలుగా ఎదురుపడడం వల్ల జరిగినవి కావు అనీ; నిజంగా జరిగిన ఎన్కౌంటర్లు అతి తక్కువ అనీ; హక్కుల సంఘాల నిర్ధారణ! ఇలాంటి వేలాది ఎన్కౌంటర్లలో, ఏప్రిల్ 16న జరిగినది కొత్తదీ కాదు, చివరిదీ కాదు! నిన్న గాక మొన్న కూడా ఎన్కౌంటర్లు జరిగాయి. మే 11న 12 మందినీ, 13న 11 మందినీ కాల్చి చంపారు. కాక పోతే, కొత్త విషయం ఏమిటంటే, దాదాపు 30, 40 ఏళ్ళ కిందటి వరకూ ఎన్కౌంటర్లు జరిగితే, ఇతర ప్రజల్లో కొన్ని చోట్ల అయినా నిరసన ప్రదర్శనలు జరిగేవి. ప్రస్తుతం అవి కనబడడం లేదు! మైదాన ప్రాంతాల ప్రజల్లో కనీస స్పందన కూడా లేకపోవడం, అమానుషంగా వుంది!

ఎవరైనా ఇలా అడగవచ్చు: "గిరిజనుల ప్రాణాలూ, మావోయిస్టుల ప్రాణాలూ మాత్రమేనా విలువైనవి? పోలీసులు ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలతో, ఉద్యోగ ధర్మం పాటించడం గాక ఏం చెయ్యగలరు? అటువంటి పోలీసుల్ని మావోయిస్టులు చంపడం అయితే న్యాయమా?"– అని ప్రశ్నిస్తే, దానికి జవాబు ఏమిటంటే, మావోయిస్టులు, శ్రమ దోపిడీ ప్రభుత్వాన్ని శత్రువుగా చూస్తారు గానీ, పోలీసుల్ని శత్రువులుగా చూడరు! పోలీసులు కూడా పేద శ్రామిక కుటుంబాల వారేననీ, వారికి పెద్ద చదువులూ, పెద్ద పెద్ద ఉద్యోగాలూ లేక, ప్రభుత్వం చెప్పినట్టు, విప్లవకారుల్ని అణిచివేసే ఉద్యోగాల్లోకి చేరారనీ, వారు శత్రువులు కాదనీ, మావోయిస్టులకు తెలుసు. అడవుల్లో బ్రతికే ఆదివాసీల్నీ, వారిని పోరాటాల్లోకి సమీకరించే మావోయిస్టుల్నీ చంపెయ్యమని ప్రభుత్వం ఆదేశిస్తే, విప్లవకారులు ఆత్మరక్షణ కోసం పోలీసుల్ని ఎదుర్కోక తప్పదు కదా?

గిరిజనులు అడవుల్లో నిరుపేదలుగా జీవించే శ్రామికులే. వాళ్ళు నివసించే అడవుల్ని ప్రభుత్వం పెట్టుబడిదారీ కంపెనీల పెత్తందార్లకి, గనుల తవ్వకాలకూ; అనేక రకాల పరిశ్రమల్ని స్థాపించడానికీ, అప్పజెప్పేస్తోంది! మావోయిస్టులు అడవుల బాట ఎందుకు పట్టారు? గిరిజనులను ఏకం చేసి, వారికి శ్రామిక వర్గ చైతన్యాన్ని కలగజేసి, వారి తరఫున పోరాడాలనే! అంతేగానీ, మావోయిస్టులు, తమ పొట్టకూటి కోసం ఆ మార్గాన్ని ఎంచుకున్నవారు కాదు. వారు ఒక ఆశయం కోసం వచ్చినవారు! వారి ఆలోచనల్లోనూ, చర్యల్లోనూ, ఎత్తుగడల్లోనూ, పొరపాట్లున్నా, తప్పులున్నా, గిరిజనుల కోసం పోరాడడమనేదే వారి ప్రధాన ఆశయం! అది ఎటువంటి ఆశయమో అర్థమైతే పోలీసులు, ఆ ఆదర్శ వాదుల మీదా, నిర్భాగ్యులైన గిరిజనుల మీదా, కాల్పులు జరిపే ఉద్యోగాల్లో ఉండగలరా?

మావోయిస్టులు ఒక విషయమై స్వయం పరిశీలన చేసుకోవాలి. 'మైదాన ప్రాంతాలలోని శ్రామిక ప్రజలు, ఆదివాసీల మరణాల పట్లా, వారికి నాయకత్వం వహిస్తున్న వారి మరణాల పట్లా, ఎందుకు స్పందించడం లేదు?'

మావోయిస్టులు, ఒక విషయమై స్వయం పరిశీలన చేసుకోవాలి. 'మైదాన ప్రాంతాలలోని శ్రామిక ప్రజలు, ఆదివాసీల మరణాల పట్లా, వారికి నాయకత్వం వహిస్తున్న వారి మరణాల పట్లా, ఎందుకు స్పందించడం లేదు'– అని గ్రహిస్తున్నారా? ఆత్మ విమర్శగా ఏదో చెప్పుకుంటే కాదు! ఉదాహరణకి, ఉద్యమాలలోకి గతంలో వచ్చినట్టు యువకులు రాకపోవడానికి కారణాన్ని, ప్రపంచీకరణ కారణంగా, హైటెక్ ఉద్యోగాలకీ, పెద్ద జీతాలకీ, యువతీ యువకులు ఎగబడుతున్నారు– అన్నదేనా కారణం? మరి గతంలో, డాక్టర్లూ, ఇంజనీర్లూ, లాయర్లూ, టీచర్లూ వంటి వారు, విప్లవోద్యమాలలోకి చేరేవారు కాదా? గతంలో, ఎంతోమంది ప్రజలు, కార్యకర్తలుగానో, సానుభూతి పరులుగానో వుండేవారు కాదా? 'ఇప్పుడు ప్రభుత్వ నిర్బంధానికి భయపడి మైదాన ప్రాంతాల ప్రజలు నిరసనలు తెలపలేక పోతున్నారు'– అనడం సరైనదా? 'నిర్బంధ విధానాలు' అనేవి చరిత్రలో 'ప్రభుత్వాలు' అనేవి ఏర్పడినప్పటినించీ జరుగుతూనే వున్నాయి. 'రాజ్యాంగ యంత్రం అనేది, పాలకవర్గం, పాలిత వర్గాన్ని అణచడానికి ఏర్పడ్డ పనిముట్టు'– అని మార్క్సిజం చెబుతుంది! ఆ 'దోపిడీ రాజ్యాంగ యంత్రాంగం' ఇరవై నాలుగు గంటలూ, విరామం లేకుండా పాలక వర్గాలకు సేవలు చేస్తుంటుంది. ఎన్నికలు జరగనీ, దేశాధినేతలు మరణించనీ, వర్షాలు కురవనీ, ఎండలు మండనీ, మంచుముద్దలు పడనీ, నిర్బంధ యంత్రాంగం నిరంతరం పనిచేస్తూనే వుంటుంది.

'ఉద్యమకారుల ఆచూకికీ, వారిని దెబ్బకొట్టడానికీ, అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నాయి ప్రభుత్వాలు.



అందుకే ప్రజలు నిరసనలు చూపలేరు'– అనేది ఒక వాదన! 'వియత్నాం విప్లవ చరిత్ర'ని చూస్తే, అప్పటికే వున్న అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి, బాంబుల వర్షం కురిపించిన అమెరికాని వియత్నాం ఓడగొట్టలేదా?


అసలు సమస్య ఎక్కడుందీ – అంటే, 'విప్లవం అంటే కొద్ది మంది చైతన్యవంతులైన వారే, ప్రజల తరఫున చేసే పోరాటం'– అని యాంత్రికంగా అనుకోవడంలోనే వుంది. శ్రామిక ప్రజల్లోనే అనేక రకాల విభాగాల వారు వున్నారనీ, వారిని ప్రజా సంఘాల లోనో, వర్గ సంఘాల లోనో ఏకం చెయ్యాలనీ, వారి చొరవని పెంచాలేగానీ, ఆ సంఘాలను పార్టీ జేబు సంస్థలుగా నడపకూడదు– అనే, గ్రహింపు విప్లవకారుల్లో మొదటినించీ తక్కువగా ఉన్నట్టు కనపడుతుంది. 'దళ చర్యలే సాయుధ పోరాటం' అనే భావన కూడా వుంది. కమ్యూనిస్టు సిద్ధాంత అవగాహన కనీసంగా లేని యువకుల్ని కూడా 'మిలిటెన్సీ' పేరుతో, వారి వ్యక్తిగత పరాక్రమాన్నే గీటురాయిగా పార్టీలోకి తీసుకోవడాలూ, అలా చేరిన వాళ్ళలో కొందరు, పార్టీ నేతల్నే నిద్రల్లో హతమార్చే ద్రోహులుగా తయారై అదృశ్యం కావడాలూ కనపడతాయి. విప్లవ సిద్ధాంతం నేర్చుకోవడానికి మార్క్సు మూల గ్రంథం అయిన, 'పెట్టుబడి'లో సారాంశాన్ని గ్రహించి నడవడం ప్రధానం అనే దాన్ని ఎంత గ్రహించారు?

ఏ ప్రభుత్వాన్నైతే సాయుధంగా కూలదోస్తామని ప్రకటించుకున్నారో, ఆ ప్రభుత్వంతోనే చర్చలు పనికి రావు అనీ, తోటి విప్లవ గ్రూపులతో ఎంత వరకూ ఏకం కాగలరో అంతవరకూ చర్చలు జరపాలి– అనీ అంటే, 'నీకు చరిత్ర పరిజ్ఞానం లేదు' అంటారు. ఎన్నో అవగాహనా లోపాల్ని సరిచేసుకుని, సరికొత్తగా మళ్ళీ మొదటి నించీ ప్రారంభించ నక్కర లేదా? శ్రామిక ప్రజల్నీ కూడగట్టే పని గురించి ఉద్యమకారులకు దారి చూపే ఎంగెల్సు చెప్పిన మాటలు గుర్తు చేసుకుందాం.

ఎంగెల్స్: "వర్గ చైతన్యం లేని శ్రామిక జనాలకు, అతి కొద్ది మంది చైతన్యవంతులైనవారు మాత్రమే నాయకత్వం వహించి చేసే ఆకస్మిక దాడులూ; విప్లవ పోరాటాలూ; చేసే కాలం గతించింది. సామాజిక వ్యవస్థను సంపూర్ణంగా పరివర్తన చెందించడం – అనేదే ప్రశ్న అయినప్పుడు, శ్రామిక జనాలు తమంతట తాము వర్గ పోరాటంలో వుండి తీరాలి! సమస్య ఏదో, తాము దేని కోసం పోరాడుతున్నారో, అప్పటికే గ్రహించి వుండి తీరాలి! ఏమి చేయాలో, జనాలు అర్థం చేసుకోవాలీ అంటే, సుదీర్ఘమైన, నిరంతరమైన పని అవసరం."

ఇలాంటి కృషి ఇప్పటికైనా జరగకపోతే, ప్రజలు నిస్పృహలో కూరుకుపోతారు. ఆదివాసీలదే కాదు, ప్రజలందరిదీ అరణ్యారోదనగానే మిగిలిపోతుంది.

■ రంగనాయకమ్మ



రద్దీలోనూ రైళ్ల రద్దు!



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల పాట్లు ఇలా..



బస్టాండులో ప్రయాణికుల రద్దీ ఇలా..

ప్రయాణికుల రద్దీ బుధవారం కూడా కొనసాగింది. ఓటు వేసేందుకు దూరప్రాంతాల నుంచి వచ్చినవారు తిరిగి పయనమవుతున్నారు. బస్సులు, రైళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. నగరంలోని పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ కిటకిటలాడిపోతున్నాయి. మరోపక్క వేసవి సెలవులకు టూర్లు, పర్యాటక ప్రదేశాలకు వెళ్లేవారు ఎక్కువే. ఈ క్రమంలో రైళ్లను పెంచాల్సిన అధికారులు ఉన్నవాటిని రద్దు చేసి ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు.

- 6లో..

వచ్చేది మేమే..

విజయవాడ పశ్చిమ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో రెచ్చిపోతున్న వైసీపీమూక

సెంట్రల్‌లో జనసైనికులపై దాడి

మీ సంగతి చూస్తాం!



టీడీపీ ఏజెంట్లు, నాయకులకు వైసీపీ నేతల బెదిరింపులు

'ఇప్పుడు కేసులు పెడుతున్నారు. జూన్ 4 తర్వాత మీ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోండి. పెట్టిన కేసులు ఉపసంహరించుకోకుంటే జూన్ 4 తర్వాత మీ అంతు చూస్తాం' అంటూ వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడకముందే వైసీపీ నేతలు మరోసారి తాము అధికారంలోకి వచ్చినట్లు భావిస్తున్నారు. పోలింగ్ రోజున టీడీపీ బూతు ఏజెంట్లు, నాయకులపై దాడికి తెగబడిన వైసీపీ నాయకులపై టీడీపీ నాయకులు కేసులు పెట్టారు. వీటిని ఉపసంహరింపజేసేలా వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. లేకుంటే అంతుచూస్తామని బెదిరిస్తున్నారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమం 42వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి భర్త ప్రసాద్ రెడ్డి పోలింగ్ రోజున రెచ్చిపోయారు. టీడీపీ నాయకురాలు విజయశ్రీ, ఆమె భర్త శ్యాంపై పోలింగ్ రోజున దాడిచేసి కులంపేరుతో దూషిస్తూ చితకబాదారు. దీనిపై విజయశ్రీ దంపతులు ప్రసాద్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. చైతన్యకళాశాల పోలింగ్ బూత్ వద్ద కూడా ప్రసాద్‌రెడ్డి హల్‌చల్ చేశారు. పోలింగ్ ఏజెంటుగా ఉన్న శ్రీకాంత్‌ను, ఓటువేసేందుకు వచ్చిన టీడీపీ మద్దతుదారులు జయచంద్రను దారుణంగా కొట్టారు. వీరు కూడా ప్రసాద్‌రెడ్డిపై కేసులు పెట్టారు. బుధవారం ఉదయం నుంచి కేసులు పెట్టిన వారికి వైసీపీ నాయకుల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. పెట్టిన కేసులు విత్‌డ్రా చేసుకోకపోతే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతు చూస్తామని బెదిరిస్తున్నారు.

జనసైనికులపై వెలంపల్లి గ్రూపు దాడి

విజయవాడ సెంట్రల్‌లో వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ అభ్యర్థి వెలంపల్లి అనుచరులు పోలింగ్ రోజున ఘర్షణ వాతావరణం సృష్టించారు. పోలింగ్ గడువు ముగిసిన తర్వాత పోలింగ్ కేంద్రంలోకి వెళుతున్న వెలంపల్లి అనుచరులను జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన వెలంపల్లి అనుచరులు గంధసిరి బాలాజీ, ప్రకాశ్, ప్రభు జనసేన కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. దీనిపై జనసేన కార్యకర్తలు నున్న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ఉపసంహరించుకోకపోతే అంతు చూస్తామని మంగళవారం రాత్రి వైసీపీ నాయకుల నుంచి జనసేన కార్యకర్తలకు ఫోన్లు వచ్చాయి.

మీ అంతు చూస్తామంటూ హెచ్చరికలు

ఐదేళ్ల విధ్వంసంతో విసిగిపోయిన ఓటర్లు ఎలాగూ తమకు ఓటు వేయరన్న ఉద్దేశంతో చాలాచోట్ల వైసీపీ అభ్యర్థులు కూటమి అభ్యర్థుల ఓట్లకు గండికొట్టే ప్రయత్నం చేశారు. కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో గొడవలు సృష్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. విజయవాడ పశ్చిమ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపించింది. పెనమలూరులో వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ ఆయన కుమారులు పోరంకిలో నానా బీభత్సం సృష్టించారు. ఇక్కడ ప్రతిసారీ టీడీపీకి మెజారిటీ వస్తుంటుంది. దీంతో ఇక్కడ గొడవలు సృష్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు ప్రయత్నించారు. పోలీసుల సమక్షంలోనే జోగి రమేశ్ ఆయన తనయులు రెచ్చిపోయారు. జూన్ 4 తర్వాత పెనమలూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, వారి మద్దతుదారుల అంతు చూస్తామని జోగి అనుచరులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఓ సామాజికవర్గాన్ని ఉద్దేశించి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. జూన్ 4 తర్వాత ఆ సామాజికవర్గం వారు నియోజకవర్గాన్ని విడిచి వెళ్లిపోయేలా చేస్తామని జోగి గ్యాంగ్ హెచ్చరిస్తుండటం గమనార్హం.

ఒకవర్గమే ఉంటుందంటూ..

గన్నవరంలో వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ టీడీపీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో స్వయంగా తిరుగుతూ గొడవలు సృష్టించి పోలింగ్‌కు విఘాతం కలిగించే ప్రయత్నం చేశారు. అయితే టీడీపీ శ్రేణులు దీటుగా ఎదుర్కోవడంతో ఆయన ఆటలు సాగలేదు. జూన్ 4 తర్వాత నియోజకవర్గంలో ఒక వర్గమే ఉంటుందని వంశీ అనుచరులు హెచ్చరిస్తుండటం గమనార్హం.

● గుడివాడలో వైసీపీ అభ్యర్థి కొడాలి నాని ఆధ్వర్యంలో రాజీనామా చేసిన వలంటర్లను చాలా పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూర్చోబెట్టారు. దీనికి కొందరు అధికారులు వత్తాసు పలికారు. వలంటీర్ల ద్వారా ఓటర్లను బెదిరించో.. ప్రలోభపెట్టో వైసీపీకి ఓట్లు వేయించాలని నాని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మంగళవారం రాత్రి రెచ్చిపోని నాని అనుచరులు గుడివాడ నియోజకవర్గం గుడ్లవల్లేరు మండలం కౌతవరంలో టీడీపీ నాయకుడు మల్లిపెద్ది సుబ్రమణ్యంపై దాడికి యత్నించాయి. గుడివాడ నుంచి వచ్చిన వైసీపీ మూకలు ఈ దాడి చేసేందుకు ప్రయత్నించగా టీడీపీ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవడంతోపాటు సకాలంలో పోలీసులు స్పందించడంతో పెద్ద ఘర్షణ జరగకుండా ఆగిపోయింది.

ఇసుక రీచ్‌ల్లో దోపిడీ..

ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు హెచ్చరించినా వైసీపీ నాయకులు బేఖాతరు చేస్తున్నారు. కృష్ణా జిల్లాలోని తోట్లవల్లూరు మండలం, ఘంటసాల మండలంలోని రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. స్థానికులు అభ్యంతరాలు పెడుతున్నా వారిని బెదిరించి మరీ తవ్వకాలు జరుపుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు కూడా వైసీపీ నాయకులు ఇదే తరహాలో ఇసుక రీచ్‌లను కైవశం చేసుకునేందుకు ఏకంగా మైనింగ్ అధికారులనే బెదిరించారు.

విజయవాడ తూర్పులో తోపుగా నిలిచేది ఎవరు? 'సెంటర్' పాయింట్‌లో ఎవరు ఉంటారు? పశ్చిమలో పాలకుడు ఎవరు? జిల్లాలో గెలుపు గుర్రాలు ఎవరు? ఎవరికి ఎంతెంత మెజారిటీ వస్తుంది? ఉమ్మడి జిల్లాలో ఎక్కడ ఉన్నా వినిపిస్తున్న ప్రశ్నలు. పోలింగ్ ముగిసిన తర్వాత గెలుపుపై ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి. హోరాహోరీగా సాగిన పోరులో గెలుపు తమదంటే తమదని ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. గెలుపు లెక్కలను తేల్చుకునే పనిలో అభ్యర్థులు ఉంటే పందేలను పరుగులు తీయించే పనిలో పందెం రాయుళ్లు ఉన్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన పందేల కంటే ఈసారి పందేలు రెట్టింపు స్థాయిలో జరుగుతుండడం గమనార్హం. నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు దగ్గర నుంచి రాష్ట్రంలో అధికారంలోకి ఎవరు వస్తారనే దాని వరకు పందేలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఈ పందేల్లో కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి.



పందెం పరుగులు

ఫలితాలపై రూ.కోట్లలో బెట్టింగ్‌లు

- కోకొల్లలుగా పుట్టుకొస్తున్న యాప్‌లు
- అభ్యర్థుల గెలుపు, మెజారిటీలపై భారీగా పందేలు
- ప్రభుత్వ ఏర్పాటుపైనా కొనసాగుతున్న బెట్టింగ్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : పందెం రాయుళ్లు ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా ఆరు కేటగిరీల్లో పందేలు కడుతున్నారు. అభ్యర్థుల అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా పార్టీల అభిమానులు రెండు రోజులుగా ఇదే పనిలో ఉన్నారు. నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారు? గెలిచిన అభ్యర్థికి ఎంత ఆధిక్యం వస్తుంది? ఉమ్మడి జిల్లాలో ఏ పార్టీ ఎక్కువ సీట్లు సాధిస్తుంది? రాష్ట్రంలో ఏ పార్టీ అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటుంది? నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల వారీగా ఏ పార్టీకి ఎంత ఆధిక్యం వస్తుంది? అన్న అంశాలపై పందేలు జోరుగా సాగుతున్నాయి. కార్యకర్తల స్థాయిలో ఉన్న వారు లక్షల్లో పందేలు కడుతుంటే, నాయకుల స్థాయిలో ఉన్నవారు కోట్లలో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఎటు చూసినా బెట్టింగ్‌లు చర్చలు నడుస్తున్నాయి. పందేలపై ఆసక్తి ఉన్నవాళ్లు అంశాలను, లెక్కలను పరిగణనలోకి తీసుకుని దిగుతున్నారు. కొంతమంది భూములను బెట్టింగ్‌ల్లో పెట్టడం గమనార్హం. జిల్లాలో ఈసారి పోలింగ్ శాతం బాగా పెరిగింది. రాష్ట్రం మొత్తం ఇదే సీన్ కనిపిస్తోంది. పార్టీకి రాష్ట్రంలో వచ్చే సీట్ల వారీగా, ఎంపీ సీట్ల వారీగా పందేలు జోరందుకున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బెట్టింగ్‌లు ఐపీఎల్‌ను మించి ఉంటున్నాయని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈసారి ఎన్నికలను అన్ని పక్షాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. తిరిగి అధికారాన్ని చేపడతామన్న ధీమాను వైసీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఈసారి అధికార మార్పిడి తథ్యమని, పీఠంపై కూటమి ఉంటుందని ఎన్డీఏ నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. కొంత మంది సర్వే నివేదికలను బేరీజు వేసుకుని పందేల బరిలోకి దిగుతున్నారు.

● యాప్‌ల్లో ప్రత్యేక బెట్టింగ్

జూన్ నాలుగో తేదీన అభ్యర్థుల జాతకాలు తెలిసిపోతాయి. మధ్యాహ్నానికి స్పష్టమైన తీర్పు వస్తుంది. మామూలుగా జరిగే పందేలతోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. దీనికోసం ప్రత్యేకంగా కొన్ని యాప్‌లు పనిచేస్తున్నాయి. ఇందులో మొత్తం ఐదు అంశాల వారీగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఏ పార్టీకి ఎన్ని సీట్లు, ఎంపీ సీట్లను ఏ పార్టీ ఎన్ని గెలుస్తుంది? ఒక్కో పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి అన్న అంశాలపై ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లను చేరవేయడానికి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. మామూలుగా జరుగుతున్న బెట్టింగ్‌లు లక్షల నుంచి కోట్ల వరకు ఉండగా, యాప్‌ల్లో మాత్రం పైసల్లో చూపిస్తున్నారు. పోలీసుల చిక్కినా తమ బెట్టింగ్‌లు పైసల్లో ఉన్నాయని చెప్పుకోవడానికి వీలుగా ఈ విధంగా చేస్తున్నారని తెలుస్తోంది. జరిగే బెట్టింగ్ మాత్రం లక్షల్లో ఉంటోంది. ఈ బెట్టింగ్‌లు ఎవరిని కుబేరులను చేస్తాయో, ఎవరిని బిచ్చాధికారిని చేస్తాయో వచ్చే నెల నాలుగున తేలిపోతుంది.

కృష్ణానది మధ్యలో ఆగిపోయిన లాంచీ

మట్టిదిబ్బలకు తగలడం వల్లే..

- 6లో..

- ఆందోళన చెందిన 32 మంది ప్రయాణికులు
- అధికారుల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు..

పోస్టల్‌తో పెరిగిన పోలింగ్

జిల్లాలో 2.45 శాతం పెరుగుదల

- జిల్లా వ్యాప్తంగా మొత్తం పోలింగ్ 80.39 శాతం నమోదు
- పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకొని కృష్ణాజిల్లాలో 85.40 శాతం పోలింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపితే జిల్లా వ్యాప్తంగా నమోదు అయిన మొత్తం పోలింగ్ శాతం మారింది. బుధవారం ఈ వివరాలను జిల్లా ఎన్నికల యంత్రాంగం విడుదల చేసింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 17,574 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలుపుకుంటే జిల్లా వ్యాప్తంగా 80.39 శాతం పోలింగ్ నమోదు అయింది. 2019లో నమోదు అయిన పోలింగ్ శాతం 77.94తో పోల్చి చూస్తే 2.45 శాతం పోలింగ్ అదనంగా నమోదు అయింది. తిరువూరు నియోజకవర్గంలో 88.19 శాతం, విజయవాడ పశ్చిమలో 67.15 శాతం, విజయవాడ సెంట్రల్‌లో 73.99 శాతం, విజయవాడ తూర్పులో 72.49 శాతం, మైలవరంలో 86.26 శాతం, నందిగామలో 88.63 శాతం, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 91 శాతం మేర పోలింగ్ నమోదు అయింది. తిరువూరు నియోజకవర్గంలో 2.92 శాతం మేర పోలింగ్ శాతం పెరిగింది. విజయవాడ పశ్చిమలో 0.99 శాతం పెరిగింది. విజయవాడ సెంట్రల్‌లో 8.26 శాతం మేర పోలింగ్ శాతం పెరిగింది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 4.99 శాతం, మైలవరంలో నియోజకవర్గంలో 3.66 శాతం, నందిగామ నియోజకవర్గంలో 0.62 శాతం, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 2.53 శాతం పోలింగ్ పెరిగింది.

కృష్ణాజిల్లాలో 85.40 పోలింగ్‌శాతం

మచిలీపట్నం : సార్వత్రిక ఎన్నికల్లో కృష్ణా జిల్లాలో మొత్తంగా 85.40 శాతం మేర ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో 15,39,460 మంది ఓటర్లు ఉండగా ఈనెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో 12,93,603 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 84.45 శాతం నమోదైంది. దీంతోపాటు 19,414 మంది ఉద్యోగులు, అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు. 1,725 మంది తమ గృహాల వద్దనే ఓటుహక్కును వినియోగించుకునే వెసులుబాటును కల్పించారు. దీంతో జిల్లాలో మొత్తంగా ఓటుహక్కు వినియోగించుకున్న వారిసంఖ్య 13,14,742కి చేరింది. దీంతో జిల్లా మొత్తం పోలింగ్ శాతం 85.40గా నమోదైంది.



పోస్టల్ బ్యాలెట్ శాతంతో పెరిగిన పోలింగ్ శాతం ఇలా

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	13న పోలైన ఓట్లు	పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	మొత్తం పోలైన ఓట్లు	శాతం
తిరువూరు	2,07,190	1,81,669	2710	1,84,379	88.99
విజయవాడ వెస్ట్	2,55,963	1,70,104	1795	1,71,899	67.16
వి. సెంట్రల్	2,77,724	2,02,635	2866	2,05,501	73.99
విజయవాడ ఈస్ట్	2,70,624	1,93,026	3150	1,96,176	72.49
మైలవరం	2,81,732	2,40,487	2536	2,43,023	86.26
నందిగామ	2,05,480	1,79,915	2206	1,82,121	88.63
జగ్గయ్యపేట	2,05,364	1,84,575	2311	1,86,886	91.00
మొత్తం	**17,04,077**	**13,52,411**	**17,574**	**13,69,985**	**80.39**

పేకాట మాఫియా



బందరు, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో రాత్రి సమయంలో డెన్‌లు

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం, పరిసర ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి పేకాట శిబిరాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నాడు. హైటెక్ పద్ధతుల్లో శిబిరాలను కొనసాగిస్తున్నాడు. పోలీస్‌శాఖలోని అన్ని విభాగాలను తనదారిలోకి తెచ్చుకున్నాడు. పోలీసులు దాడిచేసేందుకు వస్తుంటే ముందస్తు సమాచారం క్షణాల్లో పేకాట శిబిరం నిర్వహించే వ్యక్తికి చేరుతోంది. ఎన్నికల సమయం కావడంతో పేకాటతోపాటు ఏ పార్టీ గెలుస్తుంది? ఎవరికి ఎంత మెజారిటీ వస్తుంది? అని బెట్టింగులూ ఈ శిబిరంలో నిర్వహిస్తున్నారు. శిబిర నిర్వాహకుడే మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు.

- హైటెక్ పద్ధతిలో రోజూ లక్షల్లో జూదం
- మచిలీపట్నం మూడు స్తంభాల సెంటరు నుంచి పేకాటరాయుళ్ల తరలింపు
- రోజుకో ప్రాంతంలో పేకాట
- చోద్యంచూస్తున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు మండలం కోన, గుండుపాలెంలోని చేపలచెరువులు, గుండేరు డ్రెయిన్‌గట్టుపై, చల్లపల్లి మండలం కొత్తమాజేరు, ఘంటసాల మండలం యండకుదురు గ్రామాల్లో గుండేరు డ్రెయిన్ గట్టు, చేపలచెరువులను వేదికగా చేసుకుని కొన్ని నెలలుగా వైసీపీ సానుభూతిపరుడు పేకాట శిబిరాన్ని ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నాడు. ఒకరోజు పేకాట శిబిరం పెట్టిన ప్రాంతంలో మరో వారం రోజుల వరకు అక్కడ శిబిరం పెట్టకుండా ప్రాంతాలను మారుస్తూ ఉంటాడు. విజయవాడ, పామర్రు, గుంటూరు, రేపల్లె, కైకలూరు, గుడివాడ, మచిలీపట్నం, బాపట్ల తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజు రాత్రి 10 గంటల సమయానికి మచిలీపట్నం మూడు స్తంభాల సెంటరుకు పేకాటరాయుళ్లు 50-60 మందికిపైగా చేరుకుంటారు. వీరంతా కార్లలో వచ్చి జాతీయరహదారి పక్కనే, పెట్రోల్ బంకుల వద్దకార్లు పార్కింగ్ చేసి అక్కడ వేచి ఉంటారు.

● అంతా పకడ్బందీగా..

పేకాటరాయుళ్లు ఎక్కడికి రావాలో రాత్రి 10.30 గంటల సమయంలో ఫోన్‌లలో మెసేజ్ పెడతారు. ఈ సమాచారం ఆధారంగా మూడు స్తంభాల సెంటరులో సిద్ధంగా ఉన్న పేకాట నిర్వాహకుడి వద్ద పనిచేసే మనుషులు వీరి నుంచి నగదు కట్టించుకుని టోకెన్లు ఇస్తారు. తరువాత ఫోన్లు తీసేసుకుని ఎక్కడ పేకాట శిబిరం ఏర్పాటు చేస్తే అక్కడకు తీసుకువెళతారు. పేకాట శిబిరం వద్దకు వెళ్లాక ఫోన్లు ఇస్తారు. రోజుకు కనీసంగా రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల మేర నగదు ఈ పేకాట శిబిరంలో చేతులు మారుతోంది. పేకాటలో మొదటి రౌండ్‌లో గెలిచిన వారికి వెంటనే నగదు ఇవ్వరు. తెల్లవారుజాము మూడు, లేదా నాలుగు గంటలకు ఆట పూర్తయ్యేవరకు ఆడాల్సిందే. ఆటపూర్తయిన తరువాత గెలిచినవారికి నగదు ఇచ్చేందుకు వ్యక్తి (బ్యాంకురు) వచ్చి నగదు ఇస్తాడు. ఓడిపోయినవారికి కారు కిరాయి ఖర్చులు ఇచ్చి పంపుతారు. బ్యాంకరు అందుబాటులో లేకుంటే పేకాట శిబిరం నిర్వహించే వ్యక్తి మచిలీపట్నంలోని తన ఇంటివద్దనే నగదు ఇస్తుండటం గమనించదగ్గ అంశం.

పోలీసులను గుప్పిట్లో పెట్టుకుని...

మచిలీపట్నం తాలూకా సర్కిల్ పరిధిలోనే పేకాట శిబిరాలు ఎక్కువ రోజులపాటు జరుగుతున్నాయి. తాలూకా పోలీసులు, అధికారులు ఎవ్వరూ శిబిరం వైపునకు రాకుండా అందరికీ కలిపి ఒకరోజు పేకాట శిబిరం పెడితే రూ.75వేల వరకు మామూళ్ల రూపంలో పంపుతున్నట్టు పేకాట నిర్వాహకుడు బాహాటంగానే చెబుతున్నాడు. స్పెషల్ బ్రాంచ్, ఎస్ఈబీ పోలీసులు దాడులు చేయకుండా ఆ కార్యాలయాల్లో పనిచేసే ఒకరిద్దరు సిబ్బందిని వేగులుగా నియమించుకున్నానని పేకాట నిర్వాహకుడు చెబుతున్నాడు. పోలీసులు దాడులు చేసేందుకు వస్తుంటే ముందస్తుగానే సమాచారం పంపేలా రోజువారీ మామూళ్లు ఇస్తున్నానని చెబుతున్నాడు. మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి మచిలీపట్నంలో పేకాట శిబిరం నిర్వహణపై ఫిర్యాదులు అందాయి. అధికారులు వచ్చేలోపే అన్నీ సర్దేశారు. పేకాట శిబిరంపెట్టిన ప్రతిరోజు రూ.1.70 లక్షల వరకు మామూళ్ల రూపంలో పోలీసులకు ఖర్చుచేస్తున్నట్టు సమాచారం

బాధితులు ఎందరో

మచిలీపట్నం, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో నిర్వహించే పేకాట శిబిరానికి విజయవాడ, గుంటూరు, పామర్రు, గుడివాడ, తదితర ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లు తరలివస్తున్నారు. నగదు కోల్పోయిన వారి నుంచి బంగారు నగలు, ఇతరత్రాలను తాకట్టుపెట్టుకుని వడ్డీకి అప్పులు కూడా ఈ పేకాట శిబిరం నిర్వాహకుడే ఇస్తున్నాడు. పామర్రుకు చెందిన ఒక హోటల్ యజమాని పేకాటలో పెద్దమొత్తంలో నగదును పోగొట్టుకుని ఆర్థికంగా నష్టపోయినట్లు పేకాటరాయుళ్లు చెప్పుకుంటున్నారు. విజయవాడకు చెందిన మరో వ్యక్తి అప్పులపాలై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తోటి పేకాటరాయుళ్లు చెప్పుకుంటున్నారు. మరో వ్యక్తి పేకాటలో నగదు పోగొట్టుకుని అప్పుగా తన కారును ఉంచుకోమని మచిలీపట్నంలోనే విడిచిపెట్టి వెళ్లడం గమనార్హం. వారంరోజులుగా రోజుకు ఈ పేకాట శిబిరంలో కోటి రూపాయలకుపైగా నగదు చేతులు మారుతుండటం గమనార్హం. పోలీసు ఉన్నతాధికారులు ఈ పేకాట శిబిరం నిర్వహించకుండా కళ్లెం వేస్తారా? లేక మిన్నకుండిపోతారో వేచిచూడాలి.

దుర్గమ్మ సన్నిధిలో పరిపాలన అస్తవ్యస్తం!

- నెలల తరబడి ఒకేచోట తిష్ట
- ఉద్యోగుల పనితీరుపై కోర్టు అక్షింతలు



వన్‌టౌన్, మే 15 : దుర్గామల్లేశ్వర దేవస్థానం పరిపాలనా విభాగం అస్తవ్యస్తంగా మారింది. ఉద్యోగులు నెలల తరబడి ఒక్కచోటే తిష్ట వేసి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగుల తీరువల్ల కొన్ని సందర్భాల్లో హైకోర్టు ఈవోకు అక్షింతలు వేసింది. దేవస్థానంలో అర్చకులతో పాటు 250 మంది శాశ్వత ఉద్యోగులు, 60 మంది ఎన్‌ఎంఆర్‌లు, 100 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, శానిటేషన్, సెక్యూరిటీలో ఇంకా పలువురు పనిచేస్తున్నారు. పరిపాలనా విభాగంలో ఏఈవో, సూపరింటెండెంట్‌తో పాటు నలుగురు గుమస్తాలు పనిచేస్తున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు మూడు నెలలకొకసారి అంతర్గత బదిలీలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇంతకు ముందు ఈవోలు, ఇప్పటి ఈవో కూడా పరిపాలనా విభాగాలు మినహా మిగిలిన వారికి అంతర్గత బదిలీలు చేస్తున్నారు. ఏఈవోను మారుస్తు మిగతా వారిని అలానే కొనసాగిస్తున్నారు. ఏడాది కాలంగా సూపరింటెండెంట్ ఇక్కడే ఉంటూ ఉద్యోగుల్లో తనకు అనుకూలమైన వారి పట్ల ఒక రకంగా, లేనివారిపట్ల మరొక రకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంతో కీలకమైన పరిపాలన విభాగంలో ప్రతి అంశం ఈవో దృష్టికి తీసుకువస్తూ ఆ మేరకు ఆదేశాలను పొందవలసి ఉంటుంది. ఇటీవల ఎన్ఎం ఆర్‌లను శాశ్వత ప్రాతిపదికన నియమించే విషయంలో ఉద్యోగులు కోర్టును ఆశ్రయించగా కోర్టు వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో కమిషనర్ కూడా కోర్టు తీర్పు మేరకు వారిని ఉద్యోగాలలో నియమించాలని ఆదేశించారు. కానీ ఈ విషయాన్ని ఈవో దృష్టికి సూపరింటెండెంట్ తీసుకువెళ్లలేదు. ఉద్యోగులు మరల కోర్టును ఆశ్రయించడంతో ఈవో కోర్టుకు హాజరై సమాధానం ఇవ్వాల్సి వచ్చింది. దీనిపై ఈవో కేఎస్ రామారావు వివరణ ఇస్తూ పరిపాలనా విభాగంలో జరుగుతున్న అంశాలు తన దృష్టికి వచ్చాయన్నారు. త్వరలోనే ఆ విభాగంలో ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తామని తెలిపారు.



ఆలయంలో రాత్రి బస చేసిన వారికి భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో

భక్తులకు భోజన ఏర్పాట్లు పరిశీలించిన ఈవో

వన్‌టౌన్ : దుర్గగుడిలో రాత్రి బస చేసిన భక్తులకు భోజన ఏర్పాట్లను ఈవో రామారావు స్వీయ పరిశీలన చేశారు. బుధవారం రాత్రి ఆయన భక్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. భోజనాలలో నాణ్యత ఉండాలని, భక్తులకు సంతృప్తి కలిగించే విధంగా భోజన ఏర్పాట్లు ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. దేవస్థానంలో చీరల కౌంటర్‌ను పరిశీలించారు. భక్తులు సమర్పించిన చీరలకు రశీదులు ఇస్తున్నారా లేదా అని పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.

24, 25 తేదీల్లో చాగంటి ప్రవచనాలు

వన్‌టౌన్, మే 15 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీలలో చాగంటి కోటేశ్వరావు ప్రవచనాలు జరగనున్నాయి. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రెండురోజుల పాటు జరిగే ప్రవచనాల ఏర్పాట్లపై దేవస్థానం ఈవో కేఎస్ రామారావు బుధవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రవచనానికి తగిన ఏర్పాట్లు, భక్తులు, ఆహూతులు, అతిధులకు ఏర్పాట్లపై ఆయన చర్చించారు. దుర్గామల్లేశ్వరస్వామి వైభవం పేరిట చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఉంటాయని ఈవో తెలిపారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు 24, 25 తేదీలలో జరిగే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆలయ శిఖర స్వర్ణ తాపడానికి విరాళం



దుర్గగుడిలో అమ్మవారి ఆలయ శిఖరానికి బంగారు తాపడం నిమిత్తం విజయవాడ సమీపంలోని యనమలకుదూరులోని పైపులరోడ్డుకు చెందిన ఆవుల మధుసూదనరెడ్డి, జయలక్ష్మిలు బుధవారం ఆలయానికి విచ్చేసి ఏఈవో రమేష్ ద్వారా డోనర్ సెల్‌కు రూ.1,11,116ల చెక్కును విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం, ఆశీర్వచనం అందజేశారు.



కొల్లు రవీంద్రను కలిసిన టీడీపీ నేతలు

వైసీపీ ఆగడాలపై గవర్నర్‌కు ఫిర్యాదు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 15 : పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ శ్రేణులు, ఓటర్లపై వైసీపీ నాయకులు పలు చోట్ల దాడులు జరిపారని, ఈ ఘటనలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్ర మీడియాతో మాట్లాడారు. వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే దాడులకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో టీడీపీ నేతలపై దాడులకు దిగుతున్నారన్నారు. పోలింగ్ సమయంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించారన్నారు. పోలింగ్ శాతం పెరగడంతో వైసీపీ నాయకులు ఓటమి భయంతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఓటింగ్ సరళి కూటమికి అనుకూలంగా ఉందన్నారు. బుధవారం రవీంద్రను పలువురు టీడీపీ, జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కాటన్ దొరకు ఘన నివాళి



వన్‌టౌన్, మే 15 : కృష్ణా, గోదావరి డెల్టాల రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 221 జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని జలవనరులశాఖ కార్యాలయంలో ఉన్న కాటన్ విగ్రహానికి సాగునీటి వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్రలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, కృష్ణా, గోదావరి డెల్టాల ఆయకట్టు అభివృద్ధికి కాటన్ చేసిన సేవలను గుర్తుచేశారు. కాటన్ స్ఫూర్తితో 13 జిల్లాలలో 50 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉపయోగపడే పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో 194 టీఎంసీల సామర్థ్యంగల పోలవరంప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పూర్తి చేయాలన్నారు.

కృష్ణానది మధ్యలో ఆగిపోయిన లాంచీ

- ఆందోళన చెందిన 32 మంది ప్రయాణికులు
- అధికారుల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు..

ఇబ్రహీంపట్నం, మే 15 : గుంటూరు జిల్లా రాయపూడి నుంచి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీకి ప్రయాణమైన ఓ లాంచీ కృష్ణానదిలో నీరు లేకపోవడంతో మట్టిదిబ్బలకు తగిలి బుధవారం రాత్రి నిలిచిపోయింది. ఆ సమయంలో లాంచీలో సుమారు 32 మంది ప్రయాణికులు ఉన్నారు. రాయపూడి నుంచి ఫెర్రీకి బుధవారం రాత్రి 6 గంటలకు ఈ లాంచీ బయల్దేరింది. మార్గంమధ్యలో లాంచీ ఆగిపోవడంతో అందులోని ప్రయాణికులు ప్రాణభీతితో భయాందోళన చెందారు. లాంచీ ఆగిపోయిన విషయం తెలుసుకున్న పోలీస్, రెవెన్యూ యంత్రాంగం స్థానిక మత్స్యకారుల సాయంతో ప్రయాణికులను నాటు పడవల్లోకి ఎక్కించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది.

సమస్యాత్మక ప్రాంతాల్లో.. ఫ్లాగ్ మార్చ్



కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

- లెక్కింపు పూర్తయ్యే వరకు కొనసాగింపు

విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు నిర్వహించడానికి ముందు క్రిటికల్, నార్మల్ కేటగిరీల ప్రాంతాలను రెండు విభాగాలుగా విభజిస్తారు. క్రిటికల్ కేటగిరీలో ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ సజావుగా నిర్వహించడానికి పాలమిలటరీ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తారు. ఇదంతా ఎన్నికల ముందు జరిగే ప్రక్రియ. పోలింగ్ ముగిసిన తర్వాత ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో పలుచోట్ల జరుగుతున్న ఘటనల నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయానికి వచ్చారు. తిరుపతిలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులవర్తి నానిపై స్ట్రాంగ్‌రూంలు ఉన్న ప్రదేశంలో వైసీపీ మూకలు దాడి చేశాయి. పల్నాడు జిల్లాలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉద్రికత్తలు రేకెత్తే అవకాశాలున్న ప్రదేశాల్లో పోలీసు నిఘా కొనసాగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. ఎన్నికల విధుల కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పారామిలటరీ బలగాలతో ఆయా ప్రదేశాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ మార్చ్‌లు నిర్వహించాలని నిర్ణయించారు.

పంజా సెంటర్, గాంధీబొమ్మ రోడ్డు, వైఎస్సార్ కాలనీలో పోలీస్ పికెట్



వన్‌టౌన్ : ఎన్నికలు పురస్కరించుకుని పంజా సెంటర్, వించిపేట గాంధీబొమ్మ సెంటర్, వైఎస్సార్ కాలనీలో జరిగిన గొడవల నేపథ్యంలో ముందస్తుగా విజయవాడ నగర పోలీస్ కమిషనర్ పీహెచ్ రామకృష్ణ ఆదేశాల మేరకు వెస్ట్ డీసీపీ హరికృష్ణ, వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసినట్టు కొత్తపేట సీఐ గణేశ్ తెలిపారు. బుధవారం సాయంత్రం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పంజాసెంటర్, వించిపేట గాంధీబొమ్మసెంటర్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, పోలింగ్ రోజున వించిపేటలోని మహమ్మదాలీపురం స్కూల్‌లో 208 బూత్ వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య గొడవ జరిగిందని ఇరుపార్టీల ఫిర్యాదుల మేరకు బాధ్యులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు వరకు ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పికెట్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాలలో 24 గంటలు పోలీసులు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.



స్ట్రాంగ్ రూమ్‌లు, పరిసర ప్రాంతాలను తనిఖీ చేస్తున్న సీపీ

స్ట్రాంగ్ రూమ్‌లు.. పరిసర ప్రాంతాల తనిఖీ

గుణదల : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఈవీఎం బాక్సులను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లు, పరిసర ప్రాంతాలను సీపీ రామకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని నిమ్రా, నోవా కళాశాల ఆవరణలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. సీసీ కెమేరాల పర్యవేక్షణలో ఉన్నప్పటికీ 24 గంటలూ పటిష్టమైన బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

రద్దీలోనూ.. రద్దు!

- ప్రయాణికుల రద్దీ.. అయినా పలు రైళ్ల రద్దు
- వేసవిలో రైళ్లు చాలినన్ని లేక నానా అగచాట్లు
- పై నుంచి వచ్చేవి తప్ప అదనపు రైళ్లు లేవు
- ఏకంగా పక్షం రోజుల పాటు పలు రైళ్ల రద్దు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మెయింటెనెన్స్ పనుల పేరుతో రైళ్ల ఆపేస్తారు.. పనులు ఎక్కడ జరుగుతాయో తెలియదు.. జరుగుతున్నాయా అంటే గ్యారంటీ లేదు.. రద్దు చేస్తే పక్షం రోజులు పైనే ఉంటున్నాయి. తర్వాత మరికొన్ని రద్దు చేయటం పరిపాటిగా మారింది. రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత అర్థ సంవత్సరకాలంగా మెయింటెనెన్స్ పనుల పేరుతో భారీ సంఖ్యలో రైళ్లను రద్దు చేస్తూ ప్రయాణికులతో ఆటలాడుతున్న రైల్వే అధికారులు ఈ వేసవిలో అత్యంత రద్దీ సీజన్‌లోను ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మెయింటెనెన్స్ పనులపైనా స్పష్టత ఉండటం లేదు. మెయింటెనెన్స్ పేరుతో రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తున్నారు. ఎక్కడ పనులు చేపడుతున్నారన్నది అధికారులకు కూడా స్పష్టత ఉండటంలేదు. వందే భారత్ రైళ్లకు ప్రయోజనం కల్పించటం కోసమే ఇతర రైళ్లను మెయింటెనెన్స్ పనుల పేరుతో ఆపేస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

● గతంతో పోల్చుకుంటే ఇప్పుడు విజయవాడ డివిజన్ మీదుగా నాలుగు వందే భారత్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల రద్దీ కూడా అమాంతంగా పెరుగుతోంది. వందేభారత్ రైళ్లలో నూరుశాతం ఆక్యుపెన్సీ చూపించటం ద్వారా రానున్న రోజుల్లో వీటిని ప్రైవేటీకరణ చేయాలన్న ఉద్దేశ్యంతోనే వీటికి అపరిమిత డిమాండ్ కల్పించే ప్రయత్నం జరుగుతోందన్న విమర్శలు కూడా వస్తున్నాయి.

● కేంద్ర ప్రభుత్వ విధానాలు రైల్వే బోర్డుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రైల్వేబోర్డు ఒత్తిళ్లతో ఐఆర్ఎస్ అధికారులు చేసేదేమీలేక ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారు. కరోనా తర్వాత రైలుకు సామాన్యులను దూరం చేసే ప్రయత్నం అధికమైంది. ఇటీవల తరచూ దీర్ఘకాలం పాటు రైళ్ల రద్దు వల్ల ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు.

● ఖరీదైన ప్రయాణంతో కూడిన రైళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సామాన్య మధ్యతరగతి వర్గాలు ప్రయాణించే రైళ్లు తరచూ రద్దు కావటం, గంటల తరబడి ఆలస్యంగా నడపటంతో ఎప్పుడు ఏ రైలు ఉంటుందో? ఉండదో? తెలియని పరిస్థితి నెలకొంది.

● పోలింగ్ రోజున విజయవాడ మీదుగా విశాఖ చేరుకోవాల్సిన రైళ్ల మెయింటెనెన్స్ పేరుతో ఆలస్యమవడంతో ఈసీకి వీడియో తీసి పంపితే.. ఈసీ ఆదేశాలతో గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి రైల్వే అధికారులు ఆ రైలును విశాఖకు పంపారు. అర్ధ సంవత్సరం కాలం పైగానే మెయింటెనెన్స్ పేరుతో రైళ్లను రద్దు చేయటం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది.

● ప్రస్తుత వేసవి సెలవుల దృష్ట్యా రైల్వే అధికారులు అదనపు రైళ్లను నడపాలి. అదనపు రైళ్లను నడపకుండా.. ఉన్న రైళ్లను రద్దు చేయటం వల్ల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాల్సిందే. రైళ్ల భారీ సంఖ్యలో తరచూ రద్దు కావటం ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేయడమే.



రైళ్ల రద్దుతో స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు

వేసవిలో.. భారీగా రైళ్ల రద్దు

వేసవి రద్దీలో మరోమారు రైల్వే అధికారులు ఏకంగా 16 రైళ్లను రద్దు చేశారు. మొత్తం 12 రైళ్లను మే 26వ తేదీ వరకు రద్దు చేశారు. మరో 4 రైళ్లను మే 31వ తేదీ వరకు రద్దు చేశారు. రద్దు చేసిన వాటిలో రాజమండ్రి-విశాఖపట్నం(07466), విశాఖపట్నం-రాజమండ్రి(07467), నర్సాపూర్-నిడదవోలు (07897), నిడదవోలు-నర్సాపూర్ (07771), నర్సాపూర్-విజయవాడ(17270), విజయవాడ-నర్సాపూర్ (07862), నర్సాపూర్-రాజమండ్రి(07883), రాజమండ్రి-నర్సాపూర్ (07884), విశాఖపట్నం-గుంటూరు (22701), గుంటూరు-విశాఖపట్నం(22702), గుంటూరు-విశాఖపట్నం (17239), విశాఖపట్నం-గుంటూరు (17240)లను మే 25 వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే నర్సాపూర్-గుంటూరు (17282), గుంటూరు-నర్సాపూర్ (17281), హుబ్బళ్లి-విజయవాడ (17329), విజయవాడ-హుబ్బళ్లి (17330)లను మే 31వ తేదీ వరకు రద్దు చేశారు.



పోలింగ్‌కు ముందు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్‌ఫొటో)



బలరామునిపేటలో పోలీసు కవాతు

ఎన్నికల అనంతరం మచిలీపట్నంలో అల్లర్లు జరుగుతున్నందున కేంద్ర బలగాలు నగరంలో పలుప్రాంతాల్లో కవాతు చేశాయి. బలరామునిపేటలో అల్లర్లు జరుగుతాయని సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో పోలీసులు, కేంద్ర బలగాలు గస్తీ తిరుగుతున్నారు. - మచిలీపట్నం టౌన్

మూలపాడు వద్ద నాలుగుకార్లు ఢీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం

ఇబ్రహీంపట్నం, మే 15 : విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై మూలపాడు వద్ద త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. వేగంగా వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో ఒకదానికి వెనుక ఒకటి నాలుగు కార్లు ఢీ కొట్టాయి. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

గురుకుల ఇంటర్ సీట్లకు నేడు, రేపు కౌన్సెలింగ్

వన్‌టౌన్, మే 15 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక, సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ సీట్లకు ఈ నెల 16, 17 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కో-ఆర్డినేటర్ బి.సుమిత్రాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సాంఘిక, సంక్షేమ గురుకులాల్లో 2024-2025 విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు మిగిలి ఉన్న సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మార్కుల ఆధారంగా మొదటి జాబితాలో విద్యార్థులకు సీట్లు కేటాయించామని మెరిట్ ప్రకారం మిగిలిన సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఈనెల 16వ తేదీన కృష్ణారావు పాలెంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బాలురకు ఈనెల 17వ తేదీన కుంటముక్కలలోని గురుకుల పాఠశాలలో బాలికలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రాతిపదికన కౌన్సెలింగ్ జరుగుతుందని, విద్యార్థులకు సెల్‌ఫోన్ ద్వారా సందేశం పంపించడంతో పాటు ఫోన్ సమాచారం ఇచ్చారన్నారు. ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు బాలికలు 9704550059, బాలురు 9704550060 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, మే 15 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ఈ ఏడాది జూలై నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ, డిగ్రీ హానర్స్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ బుధవారం ఒక ప్రకటన తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పంపేందుకు జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ 2, 3 సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రీ రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా జూన్ 30వ తేదీవరకు చెల్లించవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బీఏ, బీకాం, డిగ్రీ కోర్సులకు ఫీజు మినహాయింపుతో ఆన్‌లైన్ ద్వారా కొత్త అడ్మిషన్, రీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌లోగానీ విజయవాడ కొత్తపేట హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 నెంబర్‌కు ఫోన్ చేసి గానీ తెలుసుకోవచ్చన్నారు.

టెన్సింగ్ నార్గే అడ్వంచర్ అవార్డుకు ..

భవానీపురం : భారత యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ ద్వారా 2023 సంవత్సరానికి అడ్వంచర్ యాక్టివిటీస్‌లో విశేష ప్రతిభ కనబర్చిన వ్యక్తుల నుంచి టెన్సింగ్ నార్గే నేషనల్ అడ్వంచర్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021, 22, 23 సంవత్సరాల్లో భూమి, నీరు, సముద్రం, గాలిలో చేసే సాహస కార్యకలాపాలు, జీవిత కాలంలో సాహస కార్యక్రమాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఆన్‌లైన్ ద్వారా జూన్ 14వ తేదీలోగా వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ//అవార్డ్సుజీవో.ఇన్//ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్సింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం, బ్లేజర్, రూ.15లక్షల నగదు రాష్ట్రపతి అందజేస్తారన్నారు. వివరాలకు 9032115987 నెంబర్‌లో కార్యాలయ పనివేళ్లలో సంప్రదించాలన్నారు.

వంతెన నిర్మించారు.. అప్రోచ్ రోడ్డు మరిచారు!

- శిథిల వంతెనపై ప్రయాణికుల పాట్లు



పల్లె తాళ్లపాలెంలో నిర్మించిన వంతెన

మచిలీపట్నం టౌన్, మే 15 : బందరు రూరల్ మండలంలో మేజర్ పంచాయతీ అయిన తాళ్లపాలెం శివారు పల్లె తాళ్లపాలెంలో వంతెన నిర్మించినా.. అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగంగా మారింది. వంతెన నిర్మించి రెండేళ్లయినా అప్రోచ్ రోడ్డు వేయకపోవడం వల్ల వంతెనపై రాకపోకలు జరగడంలేదు. దీంతో ప్రజలు మూడు కిలో మీటర్లు మేర చుట్టు తిరిగి వస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం దీనికి కారణంగా తెలుస్తోంది. తాళ్లపాలెంలో జొన్నలవారిమోడి వద్ద డ్రెయిన్‌పై నలభై సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన శిథిలమైంది. బందరు-పెడన, బంటుమిల్లి మండలాలను కలిపే ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



వంతెనకు అప్రోచ్ రోడ్డులేని వైనం



ధర్మపథం వేదికపై లలితా సంగీత విభావరి

వన్‌టౌన్, మే 15: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ధర్మపథం వేదికపై బుధవారం కంకటాల జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో లలితా సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంకటాల జ్ఞానేశ్వరి, సరోజ, చంద్రిక, రమ, సోనిక, వయోలిన్ నాగుల్‌వలి, తబలా సూర్య తదితరులు తమ గాత్రంతో ఆహూతులను ఆకట్టుకున్నారు.





నవరంగ్ టీ స్టాల్ సమీపంలో రోడ్డు మీదనే వాహనాలకు మరమ్మతులు



సినిమా చూసేందుకు వచ్చే వాహనాలతో మూసుకుపోయిన రహదారి

వాహనదారులకు దారేదీ ?

- కాంగ్రెస్ ఆఫీసు రోడ్డులో అడ్డదిడ్డంగా ఆక్రమణలు
- బాధ్యతలు వదిలివేసిన మున్సిపల్, ట్రాఫిక్ సిబ్బంది
- నిత్యం వాహనదారులతో ఘర్షణ పడుతున్న షాపు నిర్వాహకులు

గవర్నర్‌పేట, మే 15: ఇది మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వీధి. పబ్లిక్ రాకపోకల కోసం ఏర్పాటు చేసిన రహదారి. కానీ ఇక్కడ ప్రభుత్వ నిబంధనలు ఎవరూ పాటించరు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారు. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసి పోలీసులు కేసులు రాయడమూ మానేశారు. దీంతో ఇక్కడ ఉదయం 11 గంటలు దాటితే ఆ దారిలో ప్రజల వాహనాలు తిరగడానికి వీలు ఉండదు. ఇక సాయంత్రం 5 గంటల నుంచి వాహనాలకు దారి లేక ఇబ్బందులు పడే ప్రజలు దారి ఇవ్వమని షాపుల వాళ్లను అడిగితే దౌర్జన్యాలను ఎదుర్కోవాల్సిందే. ఈ రోడ్డు వారి సొంతం. అదే గవర్నర్‌పేటలోని కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు.

ఏలూరు రోడ్డులోని రాజ్ టవర్స్ సెంటర్ నుంచి నవరంగ్ సినిమా థియేటర్ వరకు విస్తరించి ఉన్న ఈ రోడ్డులో వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు ట్రాఫిక్ పోలీసుల దృష్టికి, నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది దృష్టికి స్థానికులు అనేక మార్లు తీసుకువెళ్ళినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కొత్త సినిమా వచ్చిందంటే ఈ రోడ్డులోకి నడిచి వెళ్లడం తప్ప టూ వీలర్‌ను కూడా వేసుకువెళ్లే అవకాశం ఉండదు. రోడ్ల మీదనే వాహనాలు నిలిపి రిపేర్లు చేసే మెకానిక్ షాపులు, ద్విచక్ర వాహనాలకు, కార్లకు స్పేర్ పార్టులు విక్రయించే షాపులు అధికంగా ఉండటమే కాకుండా రోడ్డు మీదనే పార్కు చేసి వాహనాలను డెకరేట్ చేస్తూ ఉండటంతో ఇటుగా వెళ్లే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు నవరంగ్ టీ స్టాల్ ముందు వాహనాలు అడ్డదిడ్డంగా పార్కు చేస్తుండటంతో నవరంగ్ థియేటర్‌కు వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోతోంది. రోడ్డుకు ఇరువైపులా షాపు యజమానులు షాపులకు ముందు వరుసలో మెటీరియల్ పేర్చి రోడ్డును మరింత ఇరుకుగా మార్చివేశారు. మెకానిక్‌లు వాహనాలకు చేసే రిపేర్ల కారణంగా శబ్ద కాలుష్యం భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారి ఇవ్వమని థియేటర్‌లో సినిమా చూసేందుకు ఫ్యామిలీతో వచ్చే ద్విచక్ర వాహనదారులపై ఘర్షణ పడుతూ నానా దుర్భాషలాడటం సర్వసాధారణంగా మారిపోయిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించి వాహనదారులకు దారి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారం మెరుగు పెడతామని మోసం

● పోలీసుల అదుపులో ఇద్దరు బీహారీలు

పాయకాపురం, మే 15 : బంగారు నగలు మెరుగు పెడతామని మహిళను మోసగించిన బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని నున్న రూరల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం రొట్ట లక్ష్మీ శాంతినగర్‌లో ఉంటుంది.

మంగళవారం ఉదయం వెండి, బంగారు నగలకు మెరుగుపెడతామని ఇద్దరు వ్యక్తులు చెప్పగా మొదట వాళ్లకు వెండి పట్టీలు ఇచ్చింది. పట్టీలు తెల్లగా మెరిసిపోతుండటంతో ఇంట్లోని బంగారపు చైన్ కూడా వారికి ఇచ్చింది. మెరుగు పెట్టే క్రమంలో ద్రావకంలో వేసిన చైన్ సన్నగా అయిపోవడం, ముక్కలుగా విరిగిపోవడంతో అనుమానం కలిగి స్థానికులు ఇద్దరు యువకులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నున్న రూరల్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బీహార్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

● కార్పొరేటర్ బోయి సత్యబాబు



సీనియర్ ఇంజనీర్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

చిట్టినగర్, మే 15: 50వ డివిజన్ పలు ప్రాంతాల్లో రంగుమారి వస్తున్న మంచినీటిని సక్రమంగా శుద్ధి చేసి వాసన రాకుండా ప్రజలకు అందించాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సీనియర్ ఇంజనీర్ రామ్మోహన్‌రావు(ఎస్‌ఈ)ని కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా డివిజన్‌లో మంచినీరు కలుషితంగా, గమాక్షిన్ వాసన వస్తుందని, ప్రజలు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు సీపీఎం నాయకులు పి.రాజు, నాగరాజు, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు

ప్రయాణికుడిపై దుండగుల దాడి

● బెదిరించి రూ.4వేలు అపహరణ

వన్‌టౌన్, మే 15: ప్రయాణికుడిపై నలుగురు గుర్తు తెలియని దుండగులు దాడి చేసి రూ.4వేలు అపహరించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వన్‌టౌన్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అన్నమ్మయ్య జిల్లా కలికిరి గ్రామానికి చెందిన చల్లా వెంకటరమణ వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. మంగళవారం ఆయన దుర్గమ్మను దర్శించుకునేందుకు రైలు దిగి అర్ధరాత్రి 2.10 నిముషాల సమయంలో నడుచుకుంటూ వస్తున్నారు. ఇదే సమయంలో లోబ్రిడ్జి వద్దకు వచ్చేసరికి మోటార్ సైకిల్‌పై వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు అతనిని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.4వేలను అపహరించారు. దుండగులు నలుపు రంగు మోటార్ సైకిల్‌పై వచ్చినట్లుగా వెంకటరమణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్‌ఐ శారదా సతీష్ కేసు నమోదు చేశారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పాయకాపురం, మే 15 : అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ప్రశాంతినగర్ ప్రాంతానికి చెందిన ఎస్‌కె కమల్ బాషా(30) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం నగరంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద స్నేహితులతో కలసి మద్యం తాగాడు. అనంతరం చెయ్యి నొప్పి అని చెప్పడంతో స్నేహితులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. కమల్ తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారే వెంకట్రావు మృతి పార్టీకి తీరని లోటు



వెంకట్రావు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

పాతరాజరాజేశ్వరి పేట, మే 15 : టీడీపీ సీనియర్ నాయకుడు కారే వెంకట్రావు పార్టీకి ఎనలేని సేవలు చేశారని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. స్థానిక 56వ డివిజన్, పాతరాజరాజేశ్వరి పేటలోని ఆయన నివాసం వద్ద బుధవారం కారే వెంకట్రావు భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్‌మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్. బేగ్ దర్శించారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.



భరత్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేబీఎన్ నిర్వాహకులు

పవర్ లిఫ్టర్ భరత్‌కుమార్ ప్రతిభ దేశానికే గర్వకారణం

వన్‌టౌన్, మే 15: తమ కళాశాల విద్యార్థి పవర్ లిఫ్టర్ భరత్‌కుమార్ ప్రతిభ దేశానికే గర్వకారణమని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ అన్నారు. పవర్ లిఫ్టర్ భరత్‌కుమార్ సాధించిన విజయాలకు అభినందనగా బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భరత్‌కుమార్ ఇటీవల చైనాలో హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభను ప్రదర్శించి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడన్నారు. తన కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచినందుకు మరో బంగారు పతకాన్ని కైవసం చేసుకుని కళాశాల కీర్తినే కాకుండా రాష్ట్రానికి దేశానికి కూడా పేరు, ప్రఖ్యాత్యలు తీసుకువచ్చారని ఇది దేశానికే గర్వకారణమని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ 2022లో టర్కీలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీలలో భరత్‌కుమార్ పాల్గొని కాంస్య పతకాన్ని సాధించారని, అతని ప్రతిభను గుర్తించి అప్పట్నుంచి తమ కళాశాల యాజమాన్యం లక్షలాది రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. అతన్ని తీర్చిదిద్దిన కళాశాల క్రీడావిభాగాధిపతి డి.హేమచంద్రరావును అభినందించారు. కళాశాల కమిటీ ప్రముఖులు చెవిటి శ్రీనివాసులు, గ్రంధి పవన్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కే.రామకృష్ణ పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యం తోడ్పాటు

కేబీఎన్ కళాశాల యాజమాన్యం తోడ్పాటుతో తాను ఎన్నో విజయాలు సాధించినట్లు ఈ సందర్భంగా భరత్‌కుమార్ వెల్లడించారు. తాను సాధించిన పతకాలను ప్రదర్శించారు. టర్కీలో, చైనాలో తాను పోటీల్లో పాల్గొనేందుకు కళాశాల యాజమాన్యం ఎంతగానో ప్రోత్సహించిందని ఇందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

తూర్పులో పెరిగిన ఓటింగ్..ఎవరికి లాభం..?

- గత మూడు దఫాలకంటే నాలుగు శాతానికి పైగా పెరిగిన ఓటింగ్
- గతంలో ప్రత్యర్థులు ఈసారి మిత్రపక్షం
- ఎవరికి వారు తమకే లాభం అంటున్న ప్రధాన పార్టీలు

మొగల్రాజపురం, మే 15: విజయవాడ నగరంలో తూర్పు నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఒకప్పుడు కంకిపాడు పేరుతో ఉన్న నియోజకవర్గంలో పటమట, గుణదల, రూరల్ కలిసి ఉండేది. పునర్విభజనలో కేవలం అర్బన్ ఏరియాతో తూర్పు నియోజకవర్గంగా మారింది. అప్పటి నుంచి ఈ నియోజకవర్గంలో ఓటింగ్ సరళి మారుతూ ఉంది. గత మూడు ఎన్నికలు అనగా 2009, 2014, 2019తో ప్రస్తుతం ఈ ఏడాది మే 13 జరిగిన ఎన్నికలతో పోల్చుకుంటే ఓటింగ్ సరళి ఆ మూడు దఫాల కంటే ఈ సారి నాలుగు శాతానికి పైగా పెరిగింది.

2009లో ప్రజారాజ్యం అభ్యర్థిగా యలమంచిలి రవి, కాంగ్రెస్ అభ్యర్థిగా దేవినేని నెహ్రూ, తెలుగుదేశం అభ్యర్థిగా గద్దె రామ్మోహన్ పోటీలో ఉన్నారు. వీరిలో యలమంచిలి రవికి 53319 ఓట్లు, నెహ్రూకు 53129, గద్దె రామ్మోహన్‌కు 52274 ఓట్లు వచ్చాయి. త్రిముఖ పోటీలో ప్రజారాజ్యం అభ్యర్థి యలమంచిలి రవి విజేతగా నిలిచారు. ఏపీ విభజన తరువాత 2014లో టీడీపీ, వైసీపీ మధ్య పోటీ జరిగింది. టీడీపీ అభ్యర్థిగా గద్దె రామ్మోహన్, వైసీపీ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణల మధ్య ద్విముఖ పోటీ జరిగింది. ఈ ఎన్నికల్లో గద్దె రామ్మోహన్‌కు 88,784 ఓట్లు రాగా, వంగవీటి రాధాకృష్ణకు 73282 ఓట్లు వచ్చాయి గద్దె రామ్మోహన్ విజేతగా నిలిచారు. 2019 ఎన్నికల్లో మళ్లీ త్రిముఖ పోటీ జరిగింది. టీడీపీ అభ్యర్థిగా గద్దె రామ్మోహన్, వైసీపీ అభ్యర్థిగా బొప్పన భవకుమార్, జనసేన అభ్యర్థిగా బత్తిన రాములు ప్రధానంగా పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో గద్దె రామ్మోహన్‌కు 82990, భవకుమార్‌కు 67826, బత్తిన రాముకు 30137 ఓట్లు రాగా విజేతగా గద్దె రామ్మోహన్ నిలిచారు. ప్రస్తుత ఎన్నికల విషయానికి వస్తే ప్రధానంగా బీజేపీ, జనసేన బలపరచిన టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్, వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ మధ్య ద్విముఖ పోటీ జరిగింది.

	ఓట్లు మొత్తం	పోలింగ్	శాతం
2009	2,50,832	1,72,187	68.65 %
2014	2,78,451	1,86,071	66.82 %
2019	2,75,724	1,86,923	67.70 %
2024	2,70,624	1,93,031	71.3 %

● 2014లో తగ్గిన పోలింగ్ శాతం

2009లో 1,72,187 ఓట్లు పోలవగా, 2014లో 1,86,071 ఓట్లు పోలయ్యాయి. 2009లో కంటే 2014లో 13,884 ఓట్లు పెరిగాయి. 2019లో 1,86,923 పోలయ్యాయి. 2014 కంటే 2019లో కేవలం 852 ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఈసారి ఎన్నికల్లో 1,93,031 ఓట్లు పోలయ్యాయి. 2019 కంటే 6108 ఓట్లు అధికంగా పోలయ్యాయి. మొత్తం ఓట్ల విషయానికి వస్తే 2009లో 2,50,832 ఓట్లు నమోదయ్యాయి. 2014లో 2,78,451 ఓట్లు ఉండగా 27,619 ఓట్లు పెరిగాయి. 2019లో 2,75,724 ఓట్లు ఉండగా 2014 కంటే 2727 ఓట్లు తగ్గాయి. 2024లో మొత్తం ఓట్లు 2,70,624 కాగా 5100 ఓట్లు తగ్గాయి. మొత్తం ఓట్లు రెండు సార్లు తగ్గాయి. రెండు సార్లు పెరిగాయి. కానీ పోలింగ్ శాతం మాత్రం 2014 ఒక్కసారే తగ్గింది. మూడు సార్లు పెరిగింది.

● ప్రత్యర్థులు కలిశారు

తూర్పు నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన గద్దె రామ్మోహన్ మీద 2014లో 2019లో ప్రత్యర్థులుగా తలపడ్డ వంగవీటి రాధాకృష్ణ, బొప్పన భవకుమార్ అంతకు ముందు వారు పోటీ చేసిన వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. 2019లో జనసేన తరుపున పోటీ చేసిన బత్తిన రాము పక్కకు తప్పుకోగా ఆయన పోటీ చేసిన జనసేన ఈ సారి టీడీపీకి మిత్ర పక్షంగా మారింది. దీంతో ఈసారి పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభంగా మారుతుందనే దాని మీద ప్రధాన పార్టీలు తమ కంటే తమకు అని చెబుతున్నాయి.

ఉచిత వేసవి క్రీడా శిబిరాలు లేనట్లేనా?

డీఎస్ఏ కోచ్‌లున్న వరకే శిక్షణా కార్యక్రమాలు : డీఎస్‌డీవో అజీజ్

విజయవాడ స్పోర్ట్సు, మే 15: క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయాల్సిన వేసవి ఉచిత క్రీడా శిబిరాల ఊసే లేకుండా పోయింది. ఏటా మే 1వ నుంచి నెలాఖరు వరకు ఈ శిబిరాలను శాప్ పర్యవేక్షణలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ వీటిని నిర్వహిస్తుండేది. ఎన్నికల కోడ్ ఒక కారణం అయితే, కొత్తగా వచ్చిన శాప్ నూతన అధికారులకు ఈ శిబిరాల నిర్వహణకు గైడ్‌లైన్స్ జారీ చేయకపోవడంతో స్తబ్దత నెలకొంది. జిల్లా పరిధిలో మొత్తం 50 వేసవి క్రీడా శిబిరాలను ఏటా నిర్వహించే వారు. వీటికి కోచ్‌లు, సామాగ్రి కింద రూ.5వేల వరకు ప్రతి శిబిరానికి వెచ్చించే వారు. కాగా ఎన్నికల కోడ్ రాకముందు మేల్కొవాల్సిన అధికారులు దీనిపై అతీగతీ లేకపోవడం క్రీడల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అవగతం అవుతుంది. ఆడుదాం- ఆంధ్రా అంటూ ఎన్నికలకు ముందు రూ.100 కోట్ల పైబడి నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేసిన వైసీపీ ప్రభుత్వం ఈ శిబిరాల నిర్వహణపై అధికారులను ఎందుకు అప్రమత్తం చేయలేకపోయిందో? అన్న విమర్శలు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కనీసం 20 రోజులకైనా పూర్తిస్థాయిలో వేసవి ఉచిత శిబిరాలను నిర్వహిస్తే క్రీడల పట్ల కింద తరగతుల విద్యార్థుల్లో ఆసక్తి నెలకొనేది. అది కాస్తా ఈ సారి నీరు గారిపోయింది. శాప్ అధికారులు గైడ్‌లైన్స్ కోసం అధికారులు ఎదురు చూసి ఈ విడతకు డీఎస్ఏ రెగ్యులర్ కోచ్‌లతో కొన్ని క్రీడాంశాలకే శిక్షణ ఇప్పించాలని యోచిస్తున్నారు.

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా డీఎస్ఏ పరిధిలోని ఫుట్‌బాల్, బాక్సింగ్, జూడో, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, యోగా, టెన్నిస్‌ల్లో శిక్షణ ఇవ్వాలని కోచ్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు శిబిరాల నిర్వహణకు తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. వస్తే ఇంకా పకడ్బందీగా శిక్షణా శిబిరాలను విస్తరిస్తామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భవానీపురం, మే 15 : కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ లలితానగర్ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు లలితానగర్, నూరి మసీద్‌రోడ్డు, రైతుబజార్ రోడ్డు, రేపాకు వారి వీధి, టెలిఫోన్స్ కాలనీ, పోలీస్ కాలనీ, నేతాజి స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై దాడిచేసిన వారిపై కేసు


ఉంగుటూరు, మే 15 : ఎన్నికల రోజున టీడీపీ కార్యకర్తపై వైసీపీకి చెందిన కొంతమంది నాయకులు మూకుమ్మడి దాడిచేసి అతని బైక్‌ను ధ్వంసం చేసిన ఘటనపై ఉంగుటూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఎస్సై వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని పొణుకుమాడు పోలింగ్ కేంద్రంలో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శెట్టి రాజేష్ (36) ఓటు వేసేందుకు 277వ నెంబర్ పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. అదే సమయంలో అక్కడ క్యూలైన్లలో ఉన్న ఓటర్లను ఫ్యాన్‌గుర్తుకే ఓటేయాలంటూ కొంతమంది స్థానిక వైసీపీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేస్తుండటం గమనించాడు. వారి తీరును అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే వారిని పోలింగ్ కేంద్రం ప్రాంగణం నుంచి బయటకు పంపించి వేయాలని కోరాడు. దీంతో ఆగ్రహించిన వైసీపీ శ్రేణులు మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ అసభ్యపదజాలంతో దూషిస్తూ రాజేష్‌పై భౌతికదాడికి పాల్పడ్డారు. బయట ఉన్న అతని బైక్‌ను కూడా ధ్వంసం చేశారు. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు అన్నే శివప్రసాద్, కడవకొల్లు రాము, కోటా లక్ష్మణరావు, పెదముత్తి శివనాగేశ్వరరావు, సూరపనేని అనిల్‌కుమార్, కడవకొల్లు శ్రీనివాసరావు, కడవకొల్లు వెంకటేశ్వరరావు, కోటా నాగబాబు, పూసపాటి రాంప్రసాద్, బొత్సా గోవింద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

జూనియర్ న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించండి

● బైరాకు విన్నవించిన న్యాయవాది కళ్లే నాగేశ్వరరావు



విజయవాడ లీగల్, మే 15 : జూనియర్ న్యాయవాదులకు వృత్తిలో మెళకువల కోసం శిక్షణా తరగతులను నిర్వహించాలని అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రావుకోటేశ్వరరావుకు న్యాయవాది కళ్లే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయంలో బైరాను కళ్లే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల కోసం ఫ్యాకల్టీలో పాల్గొని మెళకువలు నేర్పాలని విన్నవించారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటానని బైరా తెలిపారు.



వినోదానికి తెర

• నెలాఖరు దాకా సింగిల్ స్ర్కీన్ థియేటర్ల మూత

పరీక్షల సీజన్.. ఇండియన్ ప్రీమియర్ లీగ్, సార్వత్రిక ఎన్నికలు.. ఇలా అన్నీ ఒకేసారి రావడంతో థియేటర్లకు వెళ్లే జనమే కరువయ్యారు. మినిమం ఆక్యుపెన్సీ కూడా లేకపోవడంతో నష్టాలను తట్టుకోలేక కొన్ని సింగిల్ స్ర్కీన్ థియేటర్లు దాదాపు రెండు వారాల పాటు మూతపడనున్నాయి. పెద్ద సినిమాలేవీ ఇప్పట్లో లేకపోవడం, చిన్న సినిమాలను చూసేందుకు ప్రేక్షకుడు ఆసక్తి చూపకపోవడం వల్ల రోజురోజుకీ థియేటర్లలో ఆక్యుపెన్సీ తగ్గిపోతోంది. ఈ కారణంగానే ఈనెల 17 నుంచి నెలాఖరు వరకూ థియేటర్లను స్వచ్ఛందంగా మూసేయ్యాలని కొంతమంది థియేటర్ యజమానులు నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌కు, ఈ నిర్ణయానికీ ఎలాంటి సంబంధం లేదని, ఇప్పట్లో పెద్ద సినిమాల విడుదల లేకపోవడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఓ ఎగ్జిబిటర్ వెల్లడించారు. రోజువారీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో నష్టాలను తగ్గించుకోవడానికి థియేటర్ రన్ తాత్కాలికంగా ఆపడం తప్ప వేరే మార్గం కనిపించడం లేదని ఆయన వాపోయారు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరమే అయినా తప్పడం లేదని మరికొంత మంది థియేటర్ యజమానులు చెప్పారు.

కారణాలు ఏమిటి?

కొత్తవారితో తీసే చిత్రాలను, లో బడ్జెట్ సినిమాలను చూడడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపించకపోవడంతో సింగిల్ స్ర్కీన్ థియేటర్లకు కష్టాలు మొదలయ్యాయని చెప్పాలి. తగినంత మంది ప్రేక్షకులు లేకపోవడం వల్ల షో నే కాన్సిల్ చేయడం ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. ఇప్పటికే ఓటీటీల దెబ్బకు విలవిలలాడుతున్న సింగిల్ స్ర్కీన్ థియేటర్లను ఈ పరిణామాలు మరింత నష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. వారం వారం పెద్ద సంఖ్యలో చిన్న సినిమాలు విడుదలవుతున్నా ప్రేక్షకులను ఆకట్టుకొనే అంశాలు వాటిల్లో ఉండకపోవడం వల్ల నిర్మాతలతో పాటు తాము కూడా నష్టపోవాల్సి వస్తోందని థియేటర్ యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్రాంతి సీజన్ తర్వాత విడుదలైన ఒకటి రెండు సినిమాలు తప్ప మిగిలినవేవీ ఆడక పోవడంతో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. పెద్ద హీరోలు రెండు మూడేళ్లకు ఓ సినిమా చేయడం ఆక్యుపెన్సీ తగ్గడానికి ప్రధాన కారణమనీ, అభిమానుల కోసమన్నా టాప్ స్టార్స్ సంవత్సరానికి కనీసం ఒక్క సినిమా చేయాలని ఈ సందర్భంగా థియేటర్ యజమానులు అభ్యర్థిస్తున్నారు.

నష్టాలు వస్తున్నా మొండిగా నడుపుతున్నాం

అయితే తాము థియేటర్లను మూత వేయడం లేదని ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. నాలుగు షోలకు బదులుగా ఐదు షోలు వేయబోతున్నామని చెప్పారు. కొన్ని థియేటర్ల యజమానులు మాత్రమే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చన్నారు.

జంట నగరాల్లో, ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఇలా థియేటర్లు మూత వేస్తున్న వారు ఎవరూ లేరన్నారు. నగర శివార్లు, తాలూకాలలో కొన్ని చోట్ల ఇలా చేస్తుండవచ్చన్నారు. సినిమాలు లేవని థియేటర్ మూత వేస్తే అది థియేటర్ రన్‌పై నెగిటివ్ ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు, అందుకే మూతేయడం ఇష్టం లేక, కష్టమైనా నడుపుతున్నాం అని సంధ్య థియేటర్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. వీరి బాటలోనే మరి కొంతమంది థియేటర్ల యజమానులు కూడా తమ నిర్ణయాన్ని మార్చుకొని ప్రదర్శనలను కొనసాగించనున్నట్లు తెలిపారు. పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వకపోయినా ప్రస్తుతానికి చిన్న సినిమాలనే ప్రదర్శిస్తామని చెబుతున్నారు.

సింగిల్ స్ర్కీన్స్‌లోనే కాదు.. మల్టీప్లెక్స్‌లో కూడా

ప్రేక్షకులు లేక షోలు రద్దు చేయడం, థియేటర్లు మూసెయ్యడం తెలుగు రాష్ట్రాల్లో చాలాకాలంగా జరుగుతున్నదే. థియేటర్‌ను క్లోజ్ చేయడం కంటే నడిపిస్తేనే ఎక్కువ నష్టం వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో థియేటర్ నిర్వహణ గుదిబండగా మారింది. థియేటర్ రన్ చేయడానికి రోజుకి రూ 12 వేలు ఖర్చవుతుంటే, ఆదాయం మాత్రం నాలుగైదు వేలకి మించి రావడం లేదు.. సినిమా వేస్తే రూ. 7 వేలు నష్టం. అలా కాకుండా థియేటర్ మూసేస్తే రూ. 4 వేలు నష్టం. ఇది బాధాకరం అయినా థియేటర్లను మూసెయ్యక తప్పడం లేదు. సింగిల్ థియేటర్ల పరిస్థితి ఇలా ఉంటే మల్టీప్లెక్స్‌కు కూడా ఈ కష్టాలు తప్పడం లేదు. అక్కడ గతంలో వారానికి 80 షోలు ఉండేవి. ఇప్పుడు 20 షోలు వేయడం గగనమవుతోంది. ఇక సింగిల్ స్ర్కీన్లలో ఇంతకుముందు వారానికి 28 షోలు వేసే వాళ్లం. కానీ ఇప్పుడు 15 మాత్రమే ఉంటున్నాయి. విద్యుత్, జీతాలు, యూఎఫ్‌వో ఛార్జీలు, జీఎస్టీ అన్నీ కలిపి ఎగ్జిబిటర్లకు తడిసి మోపెడవుతోంది.

కనీసం పదిమంది ఉండడం లేదు

కనీసం పదిమంది అయినా వస్తేనే షో వేస్తున్నాం. ఇటీవలే విడుదలైన ఒక సినిమాకు మూడు షోలు అలాగే వేశాం. నాలుగో షోకు అంతమంది జనం లేకపోవడంతో రద్దు చేశాం. మల్టీప్లెక్స్‌ల్లో కూడా ఇదే జరుగుతోంది. థియేటర్ దగ్గరకొచ్చాక షో బంద్ అనడంతో కొన్నిసార్లు ప్రేక్షకులతో గొడవలు అవుతున్నాయి. తెలంగాణలోనే కాదు ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొన్ని థియేటర్లను రెండు వారాల కిందే మూసేశారు.. మళ్లీ పూర్తి స్థాయిలో ఎప్పుడు తెరుచుకుంటాయి అనేది ఇప్పుడు చెప్పలేం. రెండు తెలుగు రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్‌లతో కలిపి 1900 స్ర్కీన్లు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి. మిడ్‌రేంజ్ సినిమాలకు కూడా నిర్మాతలు షేర్ గ్యారంటీలు, అడ్వాన్స్‌లు అడుగుతున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య మేం రిస్క్ చేయాలని అనుకోవడం లేదు. నిర్మాతలు ముందుకు వచ్చి తగిన సహకారం అందిస్తే సినిమాలు ప్రదర్శిస్తాం.

-విజయేందర్ రెడ్డి, తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్.



గుడి కోసం ఎన్టీఆర్ విరాళం

చిన్న సాయం చేసి ఆ విషయం ఊరంతా చాటుకుంటున్న రోజులివి. కానీ ఓ మంచి పని కోసం లక్షల రూపాయల విరాళం ఇచ్చి కూడా ఆ విషయం ఎక్కడా ఎవరికీ చెప్పకుండా మౌనంగా వహించి తన ప్రత్యేకత మరోసారి చాటుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. విషయం ఏమిటంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గన్న పేటలో ఉన్న వీరభద్రస్వామి దేవాలయానికి ఎన్టీఆర్ రూ. 12.50 లక్షల విరాళం ఇచ్చారు. ఇది ఎప్పుడు ఇచ్చారో కూడా ఎవరికీ తెలీదు. చిన్న ఊరు, చిన్న గుడి కావడంతో ఈ విషయం బయటకు కూడా రాలేదు. అయితే ఇటీవల ఎవరో ఆ గుడికి వెళ్లి అక్కడున్న శిలా ఫలకం మీద జూనియర్ ఎన్టీఆర్ పేరు చూసి ఆ విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అందరికీ తెలిసింది. ఎన్టీఆర్ మంచి మనసుకి ఫిదా అయిన నెటిజన్లు ఆయనకు అభినందనలు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.



డబుల్ డోస్... దిమాకీ కిరికిరి

రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. హీరో పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ 'దిమాకీ కిరి కిరి' పేరుతో టీజర్ విడుదల చేశారు. ఇందులో రామ్ ఇస్మార్ట్ నెస్, కావ్యా థాపర్ పరిచయం, సంజయ్‌దత్ పవర్‌ఫుల్ ఎంట్రీ అలరించాయి. అద్భుత శివలింగం, క్లైమాక్స్ ఫైట్ .. భారీ జనసమూహం కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో కూడా స్పిరుచ్వల్ టచ్ ఉంటుందని హింట్ ఇచ్చారు దర్శకుడు పూరి. హైదరాబాద్ యాసలో రామ్ చెప్పే డైలాగులు, మాస్ యాక్షన్ ఫ్యాక్ అవతార్ అలరించాయి. డబుల్ ఎనర్జీ, డబుల్ ఫన్‌తో ఈ సినిమా ఉంటుందని టీజర్ చూడగానే అర్థమవుతుంది.

తెలుగు, తమిళ, కన్నడ, మలయాల, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సన్నాహాలు చేస్తున్నారు.


సైకో థ్రిల్లర్స్‌లో ట్రెండ్ సెట్ చేస్తుంది



'మంత్ర, మంగళ' లాంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో దర్శకుడిగా మంచి విజయాలను అందుకున్నారు ఓషో తులసిరామ్. ఈసారి ఆయన సైకో థ్రిల్లర్ చిత్రం 'దక్షిణ'తో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కల్ట్ కాన్సెప్ట్ మూవీ బేనర్‌పై అశోక్ షిండే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కబాలి' ఫేమ్ సాయిధన్సిక ఇందులో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా యూనిట్ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో నన్ను భయపెట్టిన ట్రైలర్ ఇదే. 'దక్షిణ' చిత్రంతో తులసిరామ్ గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ను ఇవ్వబోతున్నారు' అని ప్రశంసించారు. నిర్మాత మాట్లాడుతూ "దక్షిణ' సినిమా ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్‌ను ఇస్తుంది. తర్వాతేం జరుగుతుందో అనే ఉత్కంఠను ప్రేక్షకులు అనుభవిస్తారు, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు.

విలన్‌కు విలన్‌గా

తనదైన విలనిజంతో వెండితెరపై విజృంభిస్తున్నారు సైఫ్ అలీఖాన్. పలు పాన్ ఇండియా చిత్రాల్లో విలన్‌పాత్రలకు దర్శకులకు ఆయన తొలి ప్రాధాన్యంగా మారారు. అయితే ఇప్పుడాయన తన పంథా మార్చి మరోసారి కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ మలయాళ దర్శకుడు ప్రియదర్శన్‌తో ఆయన ఓ చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ థ్రిల్లర్ చిత్రంలో సైఫ్ అంధుడిపాత్రలో కనిపించనున్నారు. జులైలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. స్ర్కిప్ట్ వర్క్ పూర్తి చేసిన ప్రియదర్శన్ నటీనటుల ఎంపికపై దృష్టి సారించారట. 'యానిమల్'లో విలన్‌గా ఆకట్టుకున్న బాబీడియోల్‌ను ఈ సినిమాలో ప్రతి నాయక పాత్రకు సంప్రదించగా, ఆయన అంగీకరించారని బాలీవుడ్ టాక్. కథ, పాత్ర బాగా నచ్చడంతో కష్టమైనా డేట్లు అడ్జస్ట్ చేసేందుకు బాబీడియోల్ సిద్ధమయ్యారట. ఏకబిగిన సాగే 40 రోజుల షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేయాలనే ఆలోచనతో ప్రియదర్శన్ ఉన్నారట.





భార్యాభర్తల ఈగోల గోల

రాహుల్ విజయ్, శివానీ జంటగా నటించిన 'విద్య వాసుల అహం' వెబ్ సిరీస్ ఈ నెల 17న ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో మహేశ్ దత్తా, లక్ష్మీ నవ్య నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ .. కొత్తగా పెళ్లయిన విద్య, వాసు అహంకారాన్ని వీడి తమ కాపురాన్ని ఎలా చక్కదిద్దుకున్నారనే ఇతివృత్తంతో సిరీస్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఇది కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనీ, ఇందులోని నాలుగు పాటలను నాలుగు రకాలుగా సంగీత దర్శకుడు కల్యాణీ మాలిక్ కంపోజ్ చేశారని తెలిపారు. హీరోయిన్ శివానీని కూడా ఆయనే రికమెండ్ చేశారని మణికాంత్ గెల్లి చెప్పారు.



హీరో రాహుల్ మాట్లాడుతూ 'ఇదొక క్యూట్ ఈగోస్ ఫన్ ఫిల్మ్. హాయిగా ఫ్యామిలీతో కలసి చూస్తూ ఎంజాయ్ చెయ్యవచ్చు' అన్నారు.

'ఈ టీమ్‌తో నాకు రెండేళ్ల నుంచి అనుబంధం ఉంది. దర్శకుడు మణికాంత్ కథ చెప్పగానే హీరో ఎవరని అడిగాను. రాహుల్ విజయ్ అని చెప్పగానే హ్యాపీగా ఫీల్ అయ్యాను. ఈ ప్రాజెక్ట్ ఒప్పుకొన్న వారం రోజులకి 'కోట బొమ్మాళి' చిత్రం ఓకే అయింది. అలా రెండేళ్లుగా రాహుల్‌తోనే వర్క్ చేస్తున్నాను. ఏ మాత్రం ఈగో లేని వ్యక్తి' అని శివానీ చెప్పారు.



యాక్షన్‌కు పూజా సన్నద్ధం

ప్రస్తుతం బాలీవుడ్‌లో కథానాయికగా తన అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు పూజాహెగ్డే. ఆమె హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'సన్కీ'. సునీల్‌శెట్టి తనయుడు అహాన్‌శెట్టి కథానాయకుడిగా నటిస్తున్నారు. అద్నాన్ ఏ షేక్, యాసిర్ ఝా దర్శకత్వం వహిస్తున్నారు. సాజిద్ నడియాడ్ వాలా నిర్మాత. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 15న 'సన్కీ' విడుదలవుతోంది.



జూన్ తొలివారంలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. క్రికెట్, ప్రేమ లాంటి అంశాల చుట్టూ అల్లుకున్న కథలో పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలవనున్నాయని చిత్రబృందం ప్రకటించింది. ఇంటర్నేషనల్ స్టంట్ డిజైనర్ కేచ ఖంఫక్డీ ఆధ్వర్యంలో పోరాట ఘట్టాలు తెరకెక్కనున్నాయి. అందుకే 'సన్కీ' కోసం అహాన్‌శెట్టి, పూజాహెగ్డే ఇద్దరూ చెమటోడ్చుతున్నారు. ప్రస్తుతం అహాన్ క్రికెట్ ప్రాక్టీస్‌లో పాల్గొంటున్నారు. అలాగే శరీరాన్ని పాత్రకు తగ్గ ఆకృతికి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఇక పూజాహెగ్డే అయితే ఈ సినిమాలో తన పాత్ర కోసం చాలా కష్టపడుతున్నారు. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నారు పూజా. పతాక సన్నివేశాల్లో హీరో హీరోయిన్ల మధ్య వచ్చే ఎమోషనల్ సీన్లు ఈ సినిమాకు హైలెట్‌గా ఉంటాయట. అందుకే నటనకు సంబంధించి ఇప్పటికే ఒక రౌండ్ వర్క్‌షాప్ కూడా ఆమె పూర్తి చేశారని తెలుస్తోంది. అలాగే జిమ్‌లోనూ తీవ్రమైన శిక్షణ తీసుకుంటున్నారు.

కౌన్సెలింగ్

ఎప్పుడు నడవాలంటే..

నా పేరు భవాని. నాకు 35 ఏళ్లు. నాకు వ్యాయామం పట్ల.. ముఖ్యంగా నడక పట్ల చాలా ఆసక్తి ఉంది. ఏ సమయంలో నేను నడిస్తే మంచిది? దీని వల్ల నాకు ఎలాంటి ఫలితాలు లభిస్తాయి?

Q A

ఉదయాన్నే లేచి నడిస్తే మంచిదా? లేక సాయంత్రాలు మంచిదా? అనే ప్రశ్నపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఆరోగ్య నిపుణులలో ఏకాభిప్రాయం లేదు. శరీర తత్వం, జీవన శైలి, ఆహారపు అలవాట్ల ఆధారంగా ఎప్పుడు నడవాలి అనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. అయితే నడక వల్ల శారీరకంగా కానీ మానసికంగా కానీ ఒత్తిడి పెరగకూడదు. ఆరోగ్య నిపుణుల అధ్యయనాల ప్రకారం చూస్తే- సాయంత్రాలు నడిస్తే- శరీరం ఎక్కువగా అలసిపోతుంది. అంతే కాకుండా పట్టణాలలో వాయుకాలుష్యం ఉదయం కన్నా సాయంత్రాలు తక్కువ ఉంటుంది. అందువల్ల పట్టణాలలో ఉన్నవారు ఉదయాన్నే లేచి నడిస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. అయితే కొందరు నిపుణులు మాత్రం- నడకను మన జీవితంలో విడదీయరాని భాగంగా మార్చుకోవాలని సలహా ఇస్తున్నారు. సమయం చిక్కినప్పుడు అటూ ఇటూ నడుస్తూ ఉండటం వల్ల కేలరీలు కరుగుతూ ఉంటాయి.

మందులు వేసుకొనేవారు..

సాధారణంగా మనకు ఉదయం బీపీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బీపీ మందులు వేసుకొనేవారు ఉదయం ఎక్కువగా నడవకూడదు. అంతే కాకుండా చాలా మంది ఉదయాన్నే ఐదు గంటలకే లేచి నడక ప్రారంభిస్తారు. దీని వల్ల శరీరం అలసిపోతుంది కానీ ఉదయ సూర్యరశ్మి నుంచి వచ్చే డి విటమిన్ లభించదు. ఇదే విధంగా సూర్యుడు అస్తమించటం ప్రారంభించిన తర్వాత నడిస్తే మంచిది. దీని వల్ల సూర్య రశ్మి నేరుగా శరీరంపై పడదు.



ఎవరు ఎంత నడవచ్చు

మహిళలు	అడుగులు
30-40 ఏళ్లు	12 వేలు
40-50 ఏళ్లు	11 వేలు
50-60 ఏళ్లు	10 వేలు
60 ఏళ్లు దాటితే	8 వేలు

పురుషులు	అడుగులు
18-50 ఏళ్ల వరకు	12 వేలు
50 ఏళ్లు దాటిన వారు	11 వేలు



ఎంత నడవాలి?

రోజుకు ఐదు వేల అడుగులు(సుమారు 3.5 కిలోమీటర్లు) వేస్తే జీవనశైలి వచ్చే జబ్బులు రావు. పది వేల అడుగులు (సుమారు ఏడు కిలోమీటర్లు) వేయగలిగితే బీపీ, మధుమేహం వంటి జబ్బులు దరిచేరవు. ఇక పిల్లల విషయానికి వస్తే వారు రోజుకు గంట నుంచి గంటన్నర సేపు ఆడితే ఎక్కువగా ప్రయోజనం ఉంటుంది.

పరుగా? నడకా?

పరుగులో రెండు రకాలు ఉంటాయి. ఒక మాదిరి వేగంతో నడిస్తే దానిని జాగింగ్ అంటారు. నిపుణుల లెక్కల ప్రకారం- గంటకు ఆరు కిలోమీటర్ల లక్ష్యాన్ని చేరగలిగితే దానిని జాగింగ్ అంటారు. అంత కన్నా ఎక్కువ వేగంగా నడిస్తే అది పరుగు కేటగిరిలోకి చేరుతుంది. చెడు కొలస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారు, ఆస్మా ఉన్నవారు జాగింగ్ చేస్తే మంచిది. దీని వల్ల శరీరంలో రక్తప్రసారం పెరుగుతుంది. ఎండోమార్ఫిన్స్ ఉత్పత్తి వేగవంతమవుతుంది. వీటి వల్ల మనసు తేలికపడుతుంది. ఆనందకరమైన ఆలోచనలు వస్తాయి. అయితే బరువు తగ్గాలనుకొనేవారు జాగింగ్ చేస్తే మంచిది. పది వేల అడుగులు జాగింగ్ చేస్తే 500 నుంచి 700 కేలరీలు కరుగుతాయి. పది వేల అడుగులు నడిస్తే 350 నుంచి 500 కేలరీలు కరుగుతాయి

ఆయన కుంచె నుంచి జాలువారిన ప్రతి చిత్రం అపురూపమే.
పురాణేతిహాసాల పాత్రలకు, చారిత్రక పురుషులకు,
స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలకు కాన్వాసుపై రూపమిచ్చిన కళాస్రష్ట.
చిత్రకళలో తెలుగునేల ఖ్యాతిని ఖండాంతరాలకు విస్తరింపజేసిన
ప్రఖ్యాత చిత్రకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు
కొండపల్లి శేషగిరి రావు శతజయంతి సంవత్సరం ముగిసింది.
ఈ సందర్భంగా శేషగిరిరావు జీవన రేఖల గురించి ఆయన కోడలు
కొండపల్లి నీహారిణి 'నవ్య'తో సంభాషించారు...





మామయ్య... కుంచెతో చరిత్ర రాశారు

"మా నాన్న పెండ్యాల రాఘవరావు సామ్యవాద భావజాలానికి నిబద్ధుడు. మా మామయ్య కొండపల్లి శేషగిరిరావు నిత్యం భగవన్నామ స్మరణతో చిత్రకళకు అంకితమైన మహనీయుడు. దృక్పథాలు వేరైనా, సాటి మనుషుల పట్ల ప్రేమగా మెలగడం వారి నైజం. నాన్న నాస్తికుడైనా, మామయ్య ఆస్తికుడైనా... ఇతరుల అభిప్రాయాలను, విశ్వాసాలను గౌరవించడంలో మాత్రం ఇద్దరిదీ ఒకటే పంథా. అదే వారిని మొదట స్నేహితులను, ఆ తరువాత వియ్యంకులను చేసింది. శేషగిరిరావుగారిది ఆదర్శవివాహం. మా నాన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బంధు, మిత్రుల ఇళ్ళకు వెళ్లి... అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేవారు. ఒకసారి నర్సంపేట వెళ్లినప్పుడు... తొమ్మిదేళ్ళకే వితంతువు అయిన కమలా దేవి అనే బాలికను చూసి చలించిపోయారు. ఆ అమ్మాయికి తన స్నేహితుడైన కొండపల్లి శేషగిరిరావుతో వివాహం జరిపించాడు. 1945లో వితంతు వివాహం చేయడమంటే మాటలా! అది ఆనాడు ఒక పెద్ద సంచలనం. ఒకవైపు కుటుంబం, మరోవైపు సమాజం నుంచి వచ్చిన ఒత్తిళ్ళను ఎదిరించి నిలవడం సాధారణ విషయం కాదు. సంఘ సంస్కరణ భావాల పునాదిగా ఒక్కటైన కమలాదేవి, శేషగిరిరావు దంపతుల ఇంటికి తర్వాత నేను మూడో కోడలుగా వెళ్లాను. ఆదర్శ వివాహంతో ఒక్కటైన మా అత్త, మామ చివరివరకు అన్యోన్యంగా జీవించారు.

నా చదువు కోసం కొట్లాడారు..

మామయ్యకు మహిళలంటే ఎనలేని గౌరవం. పెళ్లి అయ్యాక భార్యను చదువుకోమని ప్రోత్సహించారు. అలా మా అత్తమ్మతో పాటు పల్లా దుర్గయ్య గారి భార్య, బిరుదురాజు రామరాజుగారి భార్య కలిసి ఆంధ్ర సారస్వత పరిషత్ లో హిందీ ప్రాథమిక వరకు చదివారు. మా అత్తమామలకు ఆరుగురు మగపిల్లలు, ఒక అమ్మాయి. మా ఆరుగురు కోడళ్ళనూ కూతురుతో సమానంగా చూశారు. కాకతీయ యూనివర్సిటీలో బీఏ రెండవ సంవత్సరం పూర్తయిన వెంటనే నాకు పెళ్లి అయింది. మరుసటి ఏడాది హైదరాబాద్‌లో చదువు కొనసాగిద్దామని మైగ్రేషన్ సర్టిఫికెట్ అడిగితే ఇవ్వడం కుదరదన్నారు. ఆ సంగతి తెలిసి మామయ్య ఉద్యోగానికి సెలవు పెట్టి, కాకతీయ యూనివర్సిటీకి వెళ్లి, కొట్లాడి మరీ ఆ సర్టిఫికెట్ తీసుకొచ్చారు. ఆయనే స్వయంగా నన్ను రెడ్డి ఉమెన్స్ కాలేజీలో చేర్పించారు. డిగ్రీ చివరి సంవత్సరం ఫలితాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నా నెంబరు మొదట పేపర్లో కనిపించలేదు. ఆ సమయంలో నేను కాన్పు కోసం చిన్నపెండ్యాలలోని మా పుట్టింట్లో ఉన్నాను. "జీవితంలో ఆటుపోట్లు సహజం. ఈ సమయం పోతే తిరిగిరాదన్నది అవాస్తవం. మళ్లీ మనం సమయాన్ని చేజిక్కించుకోవచ్చు. పరీక్షలో ఫెయిల్ అయినంత మాత్రాన అధైర్యపడకు. ముందు మరెన్నో అవకాశాలు ఉంటాయి" అని నాకు ధైర్యం చెబుతూ మామయ్య ఉత్తరం రాశారు. ఇది ఆయన మంచితనానికి నిదర్శనం. నన్ను సొంతబిడ్డలా ఆదరించిన మామయ్య జీవిత చరిత్రను 2009లో 'చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు' పేరుతో రాశాను. అది చదివి ఆయన చాలా సంతోషించారు.

శాంతినికేతన్‌లో చదువు...

సంప్రదాయ కుటుంబంలో పుట్టిన మామయ్య కడు పేదరికాన్ని అనుభవించారు. ఆయన తల్లి రామచూడమ్మ.. బంధువుల ఇళ్ళల్లో వంటచేసి తన కొడుకును చదివించారు. మామయ్యకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. అయినా, పరమత సహనానికి ప్రతీక ఆయన జీవితం. చిన్నతనంలో మజరుద్దీన్ మాస్టారి ప్రోత్సాహంతో 1937లో ముంబాయిలో డ్రాయింగ్ హయ్యర్‌గ్రేడ్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారు. నిజాం రాజ్యంలోని 'స్కూల్ ఆఫ్ ఆర్ట్' (ఇప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం)లో చదివేందుకు మొదట అవకాశం లభించలేదు. అప్పుడు మా నాన్నతో పాటు మందుముల నర్సింగరావు, వట్టికోట ఆళ్వారు స్వామి ఆయనను నిజాం రాష్ట్ర పాలనాధికారి మెహదీనవాజ్ జంగ్ దగ్గరికి తీసుకెళ్లారట. అతను మా మామయ్యను స్వయంగా 'స్కూల్ ఆఫ్ ఆర్ట్'కు కారులో తీసుకువెళ్లి మరీ చేర్పించారట. రవీంద్రనాథ్ ఠాగూర్‌లాంటి ప్రఖ్యాత వ్యక్తులు విడిది చేసిన మెహదీ నవాజ్ జంగ్ ఇంట్లో కొన్నాళ్ళు శేషగిరిరావు గారికి ఆశ్రయం ఇచ్చారు. నవాబు గారి భార్య తనను సొంత తల్లిలా ఆదరించారని మామయ్య చెబుతుండేవారు. ఐదేళ్ల కోర్సు పూర్తయిన తర్వాత మెహదీ సాబ్ సూచనతో 1947లో శాంతినికేతన్‌లో చేరారు. అక్కడ నందలాల్‌బోసుగారి లాంటి మహనీయుల శిష్యరికం ఆయన గొప్ప చిత్రకారుడిగా రూపొందడానికి తొలి అడుగు అయింది. ఏడాది తర్వాత తిరిగి హైదరాబాద్ వస్తుండగా రైల్లో మామయ్యమీద రజాకార్ల మూక దాడిచేయబోతే... అందులోని మీర్జా అనే కుర్రాడు గుర్తుపట్టి వదిలేయమన్నారట. అలా మామయ్యది భిన్న దృక్పథాలు, విభిన్న విశ్వాసాలతో కలగలిసిన జీవితం.

ఆ కుంచె నుంచి కొన్ని వేల చిత్రాలు...

కొండపల్లి శేషగిరిరావుగారు కొన్ని వేల చిత్రాలు గీశారు. కాకతీయ రాజు గణపతి దేవుడు, రాణీ రుద్రమ, పల్నాటి బ్రహ్మనాయుడు లాంటి చారిత్రక వ్యక్తులు, శకుంతల, వరూధిని, దమయంతి లాంటి ఇతిహాస వ్యక్తుల చిత్రాలు, పోతన వంటి ప్రాచీన కవుల రూపాలు మా మామయ్య కుంచె నుంచి జాలువారాయి. హైదరాబాద్ నగర చుట్టుపక్కల ఇవాళ కానరాని అత్యంత అద్భుతమైన రాళ్ళ గుట్టలను యాభై ఏళ్ళ కిందటే 'సేవ్ రాక్' పేరుతో కాన్వాస్ మీద ఆయన బంధించారు. 'కాకి పడగలు' పట చిత్రాలను వెలుగులోకి తెచ్చారు. భారత స్వాతంత్ర్యోద్యమ, నిజాం వ్యతిరేక పోరాట ఘటనలకు దృశ్యరూపమిచ్చారు. రామాయణ, భాగవత, మహాభారత ఘట్టాలను చిత్రీకరించారు. తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 'తెలుగు తల్లి'కి రూపమిచ్చారు. వాషింగ్‌టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచిన టంగుటూరి ప్రకాశం పంతులు నిలువెత్తు తైలవర్ణ చిత్రం శేషగిరిరావు గారు గీసిందే. రామప్ప దేవాలయంలోని శిల్పకళా వైభవాన్ని కాన్వాసు మీద గీసిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. ఇలా ఒకటా, రెండా... మామయ్య గీసిన ప్రతి చిత్రం చారిత్రకమైనదే. ఆయన తన కుంచెతో చరిత్ర రాశారు. ఎన్నో అంశాలను రంగుల్లో నిక్షిప్తం చేశారు.

చిత్రకళకే జీవితం అంకితం

మామయ్య చిత్రకళ పట్ల నిబద్ధత, సమాజంపట్ల బాధ్యత కలిగిన గొప్ప చిత్రకారుడు. తను చదివిన కళాశాలలోనే 1952లో అధ్యాపకుడిగా చేరారు. ముప్పై ఏళ్లకుపైగా బోధనారంగంలో సేవలందించి, లక్ష్మాగౌడ్, బి. నరసింగరావు, వైకుంఠం, సూర్యప్రకాశ్, సురభి వాణీదేవి లాంటి ప్రియ శిష్యులను సంపాదించుకొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం... చనిపోవడానికి అంటే 2012కు నాలుగేళ్ల ముందు వరకు పూర్తిగా చిత్రలేఖనానికే అంకితమయ్యారు. కాగితం కనిపిస్తే బొమ్మ గీసేవారు. అంతగా ఆర్ట్‌లో నిమగ్నమయ్యారు. అలాంటి గొప్ప చిత్రకారుడి సేవలను గుర్తించి... చరిత్రలో ఆయనకు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వకపోవడం బాధాకరం. మామయ్య పేరుతోనూ అవార్డు నెలకొల్పుతామని తొమ్మిదేళ్ళ కిందట ఒక మంత్రి ప్రకటించారు. ఇంతవరకు అది కార్యరూపం దాల్చలేదు. శతజయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించలేదు. తెలంగాణకే కాదు తెలుగు చిత్రకళకు వన్నెతెచ్చిన కొండపల్లి శేషగిరిరావు గారి కళాసేవకు తగిన గుర్తింపు దక్కాలన్నదే మా అభిలాష."

• సాంత్వన్
ఫొటోలు - రాజ్‌కుమార్

జపాన్ చిత్రకారిణి అభిమానం...



ప్రసిద్ధ జపాన్ చిత్రకారిణి ఫుకూ ఆకినో ఒకసారి భారతదేశ సందర్శనకు వచ్చారు. ఆమె నాగార్జున కొండను చూడాలనుకున్నప్పుడు "అయితే హైదరాబాద్‌లోని కొండపల్లి శేషగిరిరావుగారిని కూడా కలుసుకోండి" అని కోల్‌కతాలోని మిత్రులు సూచించారట. అలా ఆమె మా ఇంటికి వచ్చారు. మామయ్యగారు గీసిన వర్ణచిత్రాలు, రేఖాచిత్రాలన్నింటినీ చూసి.. తన్మయత్వంతో భారతీయుల పద్ధతిలో మామయ్యకు తలవంచి నమస్కరించారు. బురదలో పొర్లాడుతున్న పందుల చిత్రంతో పాటు నల్లపిల్లి పెయింటింగ్‌ను పేరున్న ఒక కన్నడ చిత్రకారుడు అడిగి మరీ తీసుకున్నారు. 'చనిపోయిన ఆవుకన్నును పొడుస్తున్న కాకి బొమ్మ' లాంటి కొన్ని చిత్రాల ద్వారా ఆయన మానవ స్వభావాన్ని కూడా ఎత్తిచూపారు. శిల్పకళ మీద లోతైన అధ్యయనంతో రాసిన వ్యాసాలను 'చిత్రశిల్ప కళారామణీయకము' పేరుతో పుస్తకంగా ప్రచురించారు. ఊరూరా తిరిగి, వాకిళ్లలో మహిళలు వేసే రకరకాల ముగ్గులను సేకరించారు. ముగ్గుల చరిత్రను, వాటి విశేషాలను 'రూపరుచి' పేరుతో రాశారు. దీన్ని త్వరలోనే పుస్తకంగా తీసుకొస్తాం.

ఆ గుర్తింపు ఇచ్చేది లేదన్నారు

కొండపల్లి శేషగిరిరావు గారు, స్వాతంత్ర్య సమరయోధుడు హీరాలాల్ మోరియా కలిసి వార్ధా వెళ్లి... మహాత్మాగాంధీని కలిశారు. "ఈ దేశ యువతగా స్వాతంత్ర్యోద్యమంలో మీరు భాగం కావాలి" అంటూ బాపూజీ వారికి ఉపదేశించారు. ఆ స్ఫూర్తితో ప్రతినిరసన కార్యక్రమంలోనూ మామయ్య పాల్గొన్నారు. ఒక దశలో ఆయన చిన్నమ్మ కుమారుడు చకిలం యాదగిరిరావు ఆచూకీ చెప్పమని పోలీసులు నిర్బంధించి మరీ హింసించినా, మామయ్య నోరు మెదపలేదు. నిజాం దాష్టీకాలను ఎండగడుతూ కార్టూన్లు గీశారు. అయితే, ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయి. ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను గుర్తిస్తున్న క్రమంలో... కొండపల్లి శేషగిరిరావు గారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నట్టు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు రెండూ సర్టిఫికేట్లు ఇచ్చాయి. ఇరుపార్టీలు ఎలా ఇస్తాయంటూ ప్రభుత్వ అధికారులు మొదట మామయ్య పేరును గుర్తింపు జాబితా నుంచి పక్కనపెట్టారు. "కళాకారులకు సామాజిక ప్రయోజనాలే ముఖ్యం కానీ రాజకీయ పార్టీలతో సంబంధం ఉండదు" అని దీటుగా బదులిచ్చారు మామయ్య. తర్వాత ప్రభుత్వం ఆయనను స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించింది.



వరూధినీ ప్రవరాఖ్య
శకుంతల

కేన్స్ ఎర్ర తివాచీ పరిచింది

ఒళ్లంతా తెల్ల మచ్చలు... బయటకు వెళితే వింత చూపులు... బాల్యం ఆటపాటలతో కాకుండా... అవహేళనలు అవమానాలతో గడిచింది. బాధను దిగమింగుకుని... ఆ హేళనలనే స్ఫూర్తిగా మలుచుకుని... ఆత్మవిశ్వాసంతో నిలబడింది. కంటెంట్ క్రియేటర్‌గా లక్షల మందికి చేరువై... ఎందరికో ప్రేరణగా మారింది. ఇప్పుడు ప్రతిష్టాత్మక 'కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్' రెడ్ కార్పెట్‌పై మెరిసే తొలి విటిలిగో భారతీయురాలిగా చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతున్న ఆస్థా షా జర్నీ ఇది...

'నేను నేనులా ఉంటా'.. ఇది అస్థా షా చెప్పే మాట. ఎవరికో భయపడి, ఇంకెవరో ఏదో అనుకొంటారని ఒళ్లంతా కప్పుకొని తిరగడం తనవల్ల కాదంటుంది ఈ ముంబయి భామ. అయితే ఇప్పుడు పరిస్థితులు ఒకప్పటిలా కాదని.. ఫ్యాషన్ పరిశ్రమ తనలాంటివారికి కూడా ర్యాంప్‌పై నడిచే అవకాశాలు కల్పిస్తోందని అంటుంది. అందుకు తననే ఒక ఉదాహరణగా చెబుతోంది 26 ఏళ్ల ఆస్థా. ఇంట్లో దేనికీ లోటు లేకపోయినా... ఆమె జీవితం పూల పాన్పు కాదు. అడుగు బయట పెడితే చాలు... చులకన చేసే మాటలు... ఉచిత సలహాలు. వినీ వినీ విసుగెత్తిపోయింది. రోదనలతో నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపింది. అమ్మానాన్నల అండతో తిరిగి మనిషి అయింది.

డిజిటల్ కంటెంట్ క్రియేటర్ అయిన ఆస్థా షా పేరు రెండేళ్ల కిందట బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. విటిలిగో (తెల్ల మచ్చలు)తో తాను చేస్తున్న పోరాటం... భావోద్వేగాలతో నిండిన తన నిత్య జీవితాన్ని నెటిజనులతో ఆమె పంచుకుంది. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో లక్షల మందిని కదిలించింది.

మందులతో ఫలితం లేక...

ఆస్థానా తనకున్న దీర్ఘకాలిక చర్మ వ్యాధికి ఊహ తెలియకముందు నుంచీ చికిత్స తీసుకొంటోంది. కానీ ఏదీ ఫలితం ఇవ్వలేదు. 'అల్లోపతి, హోమియోపతి, నేచురోపతి... అన్ని రకాల మందులూ వాడాను. గుళ్లు, గోపురాలు తిరిగాను. గ్రామాలకు వెళ్లి బాబాలను కలిశాను. ఏదీ పని చేయలేదు. నా ఒంటిపై తెల్ల మచ్చలు పెరుగుతున్నాయే కానీ ఏ మాత్రం తగ్గుముఖం పట్టలేదు. దీంతో ఆరేళ్ల తరువాత మందులు వాడడం మానేశాను. విటిలిగో అనేది పెరగవచ్చు.. లేదా తగ్గవచ్చు. అది శరీర తత్వం మీద ఆధారపడి ఉంటుంది. దానికి మందు లేదు. వైద్యం తీసుకున్నన్ని రోజులూ నరకం చూశాను. చాక్లెట్లు, పుల్లని పదార్థాలు, శీతల పానీయాలు.. ఏవీ తినలేకపోయాను. ఎండలో తిరగలేకపోయాను. నా బాల్యాన్ని పూర్తిగా కోల్పోయాను. ఎప్పుడైతే మందులు ఆపేశానో.. ఇక అప్పటి నుంచి నా జీవితాన్ని నేను జీవించడం మొదలుపెట్టాను' అంటూ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది ఆస్థా షా.

ఆమే నాకు స్ఫూర్తి...

"నేను రోడ్డు మీదకు వెళితే కొంతమంది నా ముఖంకేసి వింతగా చూస్తారు. ఒళ్లంతా కప్పుకోమని మరికొందరు సలహాలిస్తారు. అందుకని గడప దాటకుండా ఇంట్లోనే బందీగా ఉండలేముగా! ఆ వింత చూపులు, ఉచిత సలహాలే నాకు ప్రేరణగా మలుచుకున్నా. అలాంటి ఘటనలు ఎదురైన ప్రతిసారీ మరింత కసితో నా లక్ష్యం వైపు పరుగులు పెట్టడం అలవాటు చేసుకున్నా. నాలో ఇంతటి స్ఫూర్తిని, ధైర్యాన్ని నింపింది ఎవరో కాదు... కెనడియన్ మోడల్ విన్నీ హార్లో. 'విక్టోరియాస్ సీక్రెట్ ఫ్యాషన్ షో-2016'లో క్యాట్‌వాక్ చేసిన మొట్టమొదటి విటిలిగో మోడల్‌గా విన్నీ చరిత్ర సృష్టించింది. అది చూపించి మా నాన్నకు చెప్పాను... 'విన్నీలా నేను కూడా ఏదోఒక రోజు ర్యాంప్‌పై నడుస్తా'నని. విన్నీతో పోలిస్తే నా పరిస్థితి భిన్నమైనది. ఇప్పుడు మచ్చలు నా ఒళ్లంతా వ్యాపించేశాయి. కానీ విన్నీ ఏనాడూ తన మచ్చలను దాచే ప్రయత్నం చేయలేదు. ఆమె ఆమెలా జీవించడానికే ఇష్టపడుతుంది. ఆ అంశమే నన్ను బాగా ఆకట్టుకుంది. నా మీద నాకు ప్రేమ కలిగించింది" అంటుంది ఆస్థా.

కలలో కూడా ఊహించనిది...

కెనడియన్ ఫ్యాషన్ మోడల్ అయిన విన్నీ షా 2018లో 'కేన్స్' రెడ్ కార్పెట్ మీద నడిచింది. అప్పట్లో అదొక సంచలనం. ఎందుకంటే అక్కడ మెరిసిన తొలి విటిలిగో సెలబ్రిటీ విన్నీ. అదే బాటలో ఆస్థా షా నడుస్తోంది. ఈ నెల 19న 'కేన్స్' ఎర్ర తివాచీపై ఆమె హొయలు ఒలికించేందుకు సిద్ధమవుతోంది. తద్వారా ఆ వేదికపై క్యాట్‌వాక్ చేసిన తొలి విటిలిగో భారతీయురాలిగా చరిత్ర సృష్టించనుంది. ఈ అవకాశం తనకు రావడంపట్ల ఆస్థా ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అదే సమయంలో ఒకింత గర్వంగానూ భావిస్తోంది. "ఇది నిజమేనా! ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. కలలో కూడా ఊహించనిది. ఆ ఉత్సవానికి ఏ డ్రెస్ వేసుకోవాలో నిర్ణయించుకోలేకపోతున్నా. అయితే నాకు సాయం చేయడానికి చాలామంది డిజైనర్లు ముందుకు వస్తున్నారు. 'కేన్స్'లో విన్నీలా నేను కూడా పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపించాలని కోరుకొంటున్నా. ఏదిఏమైనా నాకు వచ్చిన అద్భుత అవకాశం ఇది. నాలాంటి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుకొంటున్నా. రెడ్ కార్పెట్ మీదకు వెళ్లగానే 'విన్నీ... నీవల్లే ఇవాళ నేను ఇక్కడ ఉన్నాను' అని బిగ్గరగా అరిచి చెప్పాలని ఉంది. 'డాల్మేషన్ డాగ్‌లా ఉన్నావని' నన్ను హేళన చేసినవారికి 'ఇది నేను సాధించిన విజయం. మనిషి ఆకారాన్ని, లోపాలను కాదు... అతడిలోని ప్రతిభను గుర్తించండి' అనే సందేశం ఇవ్వాలనుకొంటున్నా. 'కేన్స్'కు పయనమవుతున్న వేళ ఇలా నాలో ఎన్నో ఆలోచనలు, అంతర్మథనాలు" అంటూ తన అంతరంగాన్ని పంచుకుంది ఆస్థా షా.



వాళ్లే నా బలం

'కేన్స్' రెడ్ కార్పెట్ మీద కనిపించనున్న ఆస్థా షాకు సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె తరచూ రీల్స్ పోస్ట్ చేస్తుంటుంది. కొన్ని బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా వ్యవహరిస్తోంది. 'సామాజిక మాధ్యమాల్లోకి వచ్చాకే నేనేంటో అందరికీ తెలిసింది. చాలామంది నాలోని లోపాన్ని కాకుండా... కంటెంట్ క్రియేటర్‌గా నాలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. మొట్టమొదటి వీడియో పోస్ట్ చేశాక.. 'ఈ సమాజంలో ఎలా నెట్టుకొస్తున్నావ'ని కొందరు అడిగారు. నా కథ విని ఎందరో చలించారు. అలాంటి మాటలు నాలో ఉత్తేజాన్ని కలిగిస్తాయి' అంటున్న ఆస్థా షా ఇప్పుడు ఎంతోమందికి ప్రేరణ అయ్యారు.

ఏది నిజమైన ఐస్‌క్రీమ్?



వేసవిలో ఐస్‌క్రీమ్‌లకు మంచి డిమాండ్ ఉంటుంది. రాత్రి బయటకు వెళ్లి ఐస్‌క్రీమ్‌లు తినే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. అయితే చాలా సందర్భాలలో ఐస్‌క్రీమ్‌లుగా విక్రయించే ఫ్రోజెన్ డిజర్ట్‌లలో పాలే ఉండవు. వీటిని పామ్ ఆయిల్, చక్కెర, మిల్క్ పౌడర్‌లతో తయారుచేస్తారు. అందువల్ల నిజమైన ఐస్‌క్రీమ్‌ని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం.

- ఐస్‌క్రీమ్ ప్యాక్ మీద నీళ్లు, మిల్క్ సాలిడ్స్, పామ్ ఆయిల్, లిక్విడ్ గ్లూకోజ్, సోయా ప్రొటీన్ మొదలైనవి ఉంటే అది పాలతో తయారుచేసిన ఐస్‌క్రీమ్ కాదు. అందుకే వీటిని ఫ్రోజెన్ డిజర్ట్‌గా పిలుస్తారు. దీనిలో ఉండే పామ్ ఆయిల్ వల్ల శరీరంలో చెడు కొలస్ట్రాల్ పెరుగుతుంది. రక్తనాళాలు పూడుకుపోతాయి. లిక్విడ్ గ్లూకోజ్ వల్ల శరీరంలో షుగర్ స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. అంతే కాకుండా దీనిలో టెట్రాజైన్ అనే కృత్రిమ కలరింగ్ ఏజెంట్‌ను ఉపయోగిస్తారు. దీని వల్ల కొందరికి ఎలర్జీలు వస్తాయి. మరి కొందరికి రకరకాల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి.
- అసలైన ఐస్‌క్రీమ్- ఫ్రోజెన్ డిజర్ట్‌ల మాదిరిగా మృదువుగా ఉండదు. దీనిలో పాలు, పంచదార, ఇతర సహజసిద్ధమైన డ్రైఫ్రూట్స్‌ను ఉపయోగిస్తారు. అయితే వీటిలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల తక్కువ కేలరీలు కావాలనుకొనేవారు ఫ్రోజెన్ డిజర్ట్‌లను తినటం మంచిది. మధుమేహం, బీపీ వంటి సమస్యలు ఉన్నవారు ఐస్‌క్రీమ్‌లు, ఫ్రోజెన్ డిజర్ట్‌లను తినకపోవటం మంచిది.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: హైదరాబాద్

హైదరాబాద్ X గుజరాత్



ఫెడ్‌కప్‌లో నీరజ్‌కు స్వర్ణం

భువనేశ్వర్: టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, మరో రెండు నెలల్లో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌కు ముందు సొంతగడ్డపై పసిడి పతకం సాధించి, సత్తా చాటాడు. బుధవారం జరిగిన ఫెడరేషన్ కప్‌లో 26 ఏళ్ల నీరజ్ జావెలిన్‌ను 82.27 మీటర్ల దూరం విసిరి, ప్రథమ స్థానంలో నిలిచాడు. తొలి మూడు రౌండ్లు పూర్తయ్యేసరికి ద్వితీయ స్థానంలో నిలిచిన నీరజ్, నాలుగో రౌండ్‌లో పుంజుకుని ప్రథమ స్థానానికి చేరుకున్నాడు. 2021 తర్వాత నీరజ్ పాల్గొన్న తొలి దేశవాళీ పోటీ ఇదే కావడం విశేషం. ఇదే విభాగంలో డీపీ మను రెండో స్థానంలో నిలిచి, రజతం నెగ్గాడు. ఆసియా క్రీడల కాంస్యపతక విజేత, సంగారెడ్డి జిల్లాకు చెందిన అగసర నందిని హెప్టాథ్లాన్‌లో స్వర్ణంతో మెరిసింది. నందిని మొత్తంగా 5,460 పాయింట్లు సాధించి, అగ్రస్థానంలో నిలిచింది. ఇక, 100 మీటర్ల స్ప్రింట్‌లో హైదరాబాద్ అమ్మాయి నిత్య నాలుగో స్థానంలో నిలిచి కొద్దిలో కాంస్య పతకం కోల్పోయింది. పురుషుల 100 మీటర్ల స్ప్రింట్‌లో నెల్లూరు అథ్లెట్ శ్రీనివాస్ ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

హెప్టాథ్లాన్‌లో తెలుగమ్మాయి నందినికి పసిడి


నందిని



ప్రణయ్‌కు మీరాబ షాక్

'థాయ్‌లాండ్'లో సాత్విక్ జోడీ బోణీ

బ్యాంకాక్: స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌కు థాయ్‌లాండ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. భారత్‌కే చెందిన యువ ఆటగాడు మీరాబ లువాంగ్ మైస్నమ్ ఆరంభ రౌండ్లో సహచరుడు ప్రణయ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. మణిపూర్‌కు చెందిన 21 ఏళ్ల మీరాబ 21-18, 21-19తో ఐదోసీడ్ ప్రణయ్‌ను కంగుతినిపించి రెండోరౌండ్ చేరాడు. ఇక, పురుషుల డబుల్స్‌లో టాప్‌సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. సాత్విక్ జంట 21-13, 21-13తో మలేసియా ద్వయం నూర్ మ్మద్-తాన్ వీ కియోంగ్‌ను వరుసగేముల్లో ఓడించి రెండోరౌండ్లో ప్రవేశించింది. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్లో అస్మిత చాలిహా 19-21, 21-15, 21-14తో ఎస్టర్ (ఇండోనేసియా)పై నెగ్గింది. మిగతా భారత షట్లర్లలో ఆకర్షి కశ్యప్, మాళవికా బన్సోడ్, ఉన్నతి హుడా, సామియా, కిరణ్ జార్జ్, సతీశ్ కుమార్ ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే వెనుదిరిగారు.

టార్గెట్..ప్లేఆఫ్స్ బెర్త్

టైటాన్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు

హైదరాబాద్: బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతుండగా, బౌలర్లూ మెరుగ్గా రాణిస్తుండడంతో ఈ సీజన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ ముంగిట నిలిచింది. గురువారం ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో ఆ జట్టు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. గుజరాత్‌తో గాక మరో మ్యాచ్ మిగిలున్నా.. టైటాన్స్‌పై గెలిస్తే సన్‌రైజర్స్‌కు ప్లేఆఫ్ బెర్త్ ఖాయమవుతుంది. 12 మ్యాచ్‌ల్లో 14 పాయింట్లు సాధించిన ఆ జట్టు గరిష్ఠంగా 18 పాయింట్లు పొందే చాన్సుంది. అలాగే రన్ రేట్ (+0.406) కూడా ఎంతో మెరుగ్గా ఉంది. ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాన్ని నితీశ్, క్లాసెన్, సమద్ కొనసాగిస్తే రైజర్స్‌కు తిరుగుండబోదు. మరోవైపు 13 మ్యాచ్‌ల ద్వారా కేవలం 11 పాయింట్లతోనే ఉన్న గుజరాత్..ఇప్పటికే నాకౌట్ రేసునుంచి అవుటైంది. కనీసం చివరి పోరులో గెలిచి లీగ్‌ను గౌరవప్రదంగా ముగించాలని భావిస్తోంది. అయితే ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతున్న సన్‌రైజర్స్‌ను అందునా..వారి సొంత గ్రౌండ్‌లో అడ్డుకోవడం గుజరాత్‌కు అయ్యేపనేనా?

సచిన్ టెండూల్కర్ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

ముంబై: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు సెక్యూరిటీ గార్డుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర రిజర్వ్ పోలీసు విభాగం (ఎస్ఆర్‌పీఎఫ్)కు చెందిన జవాను ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. 39 ఏళ్ల ప్రకాశ్ కాప్డే అనే గార్డు తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోయాడని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం సెలవుపై తన స్వస్థలమైన మహారాష్ట్రలోని జామ్నర్‌కు వెళ్లిన ప్రకాశ్ అక్కడే బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. వ్యక్తిగత కారణాల రీత్యానే ఆ జవాను ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు.

సెమీస్‌లో అభిషేక్

ఎలోర్డా కప్ బాక్సింగ్

అస్తానా (కజకిస్థాన్): భారత బాక్సర్ అభిషేక్ యాదవ్ (67 కిలోలు) ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ బౌట్‌లో 5-0తో స్థానిక బాక్సర్ రఖాత్ సీజమ్‌ను చిత్తు చేశాడు. ఇక, మంగళవారం రాత్రి జరిగిన బౌట్లలో నెగ్గిన మనీష (60 కి), మోనిక (81+ కి) సెమీఫైనల్స్‌లో ప్రవేశించారు. నిఖత్ జరీన్ (52 కి) సెమీఫైనల్ గురువారం జరగనుంది.

రాయల్స్ నాలుగోసారీ

పంజాబ్ చేతిలో ఓటమి ● కర్రాన్ హాఫ్ సెంచరీ


సామ్ కర్రాన్ (63 నాటౌట్)

గువాహటి: ప్లేఆఫ్స్‌కు చేరినా..రాజస్థాన్ రాయల్స్ మాత్రం ఓటమి బాటను వీడలేదు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు ఐదు వికెట్లతో పంజాబ్ కింగ్స్ చేతిలో పరాజయం చవిచూసింది. రాయల్స్‌కిది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 144/9కే పరిమితమైంది. రియాన్ పరాగ్ (48), అశ్విన్ (28) మాత్రమే రాణించారు. కర్రాన్, హర్షల్, రాహుల్ చాహర్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో పంజాబ్ 18.5 ఓవర్లలో 145/5 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ సామ్ కర్రాన్ (63 నాటౌట్) కడదాకా నిలిచి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. రొసో (22), జితేశ్ శర్మ (22) సత్తా చాటారు. అవేశ్, చాహల్ రెండేసి వికెట్లు తీశారు. కర్రాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అయితే పంజాబ్ ఇప్పటికే నాకౌట్ రేసు నుంచి అవుటైన సంగతి తెలిసిందే. ఈ పరాజయంతో ప్లేఆఫ్స్‌లో టాప్-2లో నిలవడం రాజస్థాన్‌కు కష్టమే.

కర్రాన్ కెప్టెన్ ఇన్నింగ్స్: క్లిష్టమైన పిచ్‌పై 145 పరుగుల కష్టమైన ఛేదనలో పంజాబ్ కూడా మొదటి ఓవర్లోనే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ చేజార్చుకుంది. కానీ బెయిర్‌స్టో, రొసో చక్కగా ఆడుతూ రెండో వికెట్‌కు 30 పరుగులు జత చేసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే బాధ్యత చేపట్టారు. ఈ దశలో తన తొలి ఓవర్ చేపట్టిన అవేశ్ మూడు బంతుల్లో హార్డ్ హిట్టర్లు రొసో, శశాంక్ (0) అవుట్ చేసి రాజస్థాన్‌లో హుషారు తెచ్చాడు. పవర్ ప్లేలో పంజాబ్ 39/3తో నిలవగా 8వ ఓవర్లో కీలకమైన బెయిర్ స్టో (14)ను అవుట్ చేసిన చాహల్.. పంజాబ్‌ను దెబ్బ తీశాడు. కింగ్స్ ఇన్నింగ్స్ చప్పగా సాగుతున్న దశలో అశ్విన్ బౌలింగ్‌లో జితేశ్ 6, చాహల్ బౌలింగ్ కర్రాన్ 4 కొట్టి ఒకింత ఊపు తెచ్చారు. 63 పరుగులు జత చేసి ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీలో జితేష్‌ను పెవిలియన్ చేర్చిన చాహల్ రాజస్థాన్‌కు కీలక బ్రేక్ ఇచ్చాడు. ఇక..మూడు ఓవర్లలో 25 రన్స్ కావాల్సిన వేళ సందీప్ వేసిన 18వ ఓవర్లో కర్రాన్ సిక్సర్ దంచడంతో మొత్తం 10 పరుగులొచ్చాయి. 19వ ఓవర్లోనూ అవేశ్ బౌలింగ్ మరో భారీ సిక్సర్ బాదిన కర్రాన్..అశుతోష్ శర్మ (17 నాటౌట్) జతగా పంజాబ్ విజయాన్ని ఖాయం చేశాడు.



2 ఐపీఎల్‌లో 500 రన్స్‌కుపైగా చేసిన రెండో అన్‌క్యాప్డ్ క్రికెటర్ రియాన్ పరాగ్. షాన్ మార్ష్ 2008లో తొలి ఆటగాడిగా నిలిచాడు.

పంజాబ్ బౌలర్లు భళా: టాస్ గెలిచి రాజస్థాన్ బ్యాటింగ్ ఎంచుకోగా..తొలి ఓవర్లోనే జైస్వాల్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన కర్రాన్ ప్రత్యర్థికి ఝలకిచ్చాడు. అయితే శాంసన్-కోహ్లెర్ కుదురుకొని ఇన్నింగ్స్‌ను నడిపించారు. సంజూ తన సహజ శైలిలో ఆడుతూ అర్ష్‌దీప్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు దంచగా, కోహ్లెర్ మాత్రం భారీ షాట్లు ఆడలేకపోయాడు. మరోవైపు ఎలిస్, హర్షల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పవర్ ప్లేను 38/1తో రాయల్స్ ముగించింది. కానీ ఏడో ఓవర్లో శాంసన్ (18)ను ఎలిస్ క్యాచవుట్ చేయడంతో 36 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తదుపరి ఓవర్లో కోహ్లెర్‌ను స్పిన్నర్ రాహుల్ చాహర్ పెవిలియన్ చేర్చాడు. దాంతో పరాగ్, అశ్విన్ ఆచితూచి ఆడడంతో రాజస్థాన్ స్కోరుబోర్డు మందగించింది. అయితే చాహర్ వేసిన 12వ ఓవర్లో బ్యాట్ ఝుళిపించిన అశ్విన్ 6,4,4 కొట్టి 17 పరుగులు రాబట్టాడు. ఈ దశలో పంజాబ్ బౌలర్లు మరోసారి విజృంభించారు. అశ్విన్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేసి 50 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఇక జురెల్ (0)ను కర్రాన్, పావెల్ (4)ను చాహర్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చడంతో 102/6తో రాజస్థాన్ తీవ్ర ఇక్కట్లలో పడింది. తన చివరి రెండు ఓవర్లలో ఫెరీరా (7), పరాగ్‌లను హర్షల్ అవుట్ చేయగా బౌల్ట్ (12) రనౌట్ కావడంతో ఆర్ఆర్ స్కోరు కనీసం 150కి కూడా చేరలేదు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (బి) కర్రాన్ 4, కోహ్లెర్ (సి) జితేశ్ (బి) చాహర్ 18, శాంసన్ (సి) చాహర్ (బి) ఎలిస్ 18, పరాగ్ (ఎల్బీ) హర్షల్ 48, అశ్విన్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 28, జురెల్ (సి) హర్‌ప్రీత్ (బి) కర్రాన్ 0, పొవెల్ (సి అండ్ బి) చాహర్ 4, ఫెరీరా (సి) రొసో (బి) హర్షల్ 7, బౌల్ట్ (రనౌట్) 12, అవేశ్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 144/9; వికెట్ల పతనం:** 1-4, 2-40, 3-42, 4-92, 5-97, 6-102, 7-125, 8-138, 9-144; **బౌలింగ్:** కర్రాన్ 3-0-24-2, అర్ష్‌దీప్ 4-0-31-1, ఎలిస్ 4-0-24-1, హర్షల్ 4-0-28-2, రాహుల్ చాహర్ 4-0-26-2, హర్‌ప్రీత్ బ్రార్ 1-0-10-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (సి) చాహల్ (బి) బౌల్ట్ 6, బెయిర్‌స్టో (సి) పరాగ్ (బి) చాహల్ 14, రొసో (సి) జైస్వాల్ (బి) అవేశ్ 22, శశాంక్ (ఎల్బీ) అవేశ్ 0, కర్రాన్ (నాటౌట్) 63, జితేశ్ (సి) పరాగ్ (బి) చాహల్ 22, అశుతోష్ (నాటౌట్) 17, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 18.5 ఓవర్లలో 145/5; వికెట్ల పతనం:** 1-6, 2-36, 3-36, 4-48, 5-111; **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-1, సందీప్ 4-0-28-0, అవేశ్ 3.5-0-28-2, అశ్విన్ 4-0-31-0, చాహల్ 4-0-31-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	13	8	5	0	16	0.273
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	13	4	9	0	8	-0.271

నేపాల్ క్రికెటర్ లామిచానె నిర్దోషి

హైకోర్టు తీర్పు ● వరల్డ్‌కప్‌నకు ఎంపికయ్యే చాన్స్

ఖాట్మండు: అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపాల్ స్టార్ క్రికెటర్ సందీప్ లామిచానెను హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. రెండేళ్ల క్రితం 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ నమోదైన కేసులో లామిచానెకు జిల్లా కోర్టు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, కింది కోర్టు తీర్పును లామిచానె హైకోర్టులో సవాల్ చేశాడు. దీనిపై విచారణ తర్వాత లామిచానె ఎలాంటి తప్పూ చేయలేదని హైకోర్టు తీర్పు వెలువరించిందని నేపాల్ క్రికెట్ బోర్డు తెలిపింది. దీంతో 23 ఏళ్ల లామిచానె.. త్వరలో జరిగే టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనే నేపాల్ జట్టుకు అందుబాటులో ఉండనున్నాడు.

ఐఎల్‌టీ20లో రాయుడు

దుబాయ్: టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఇంటర్నేషనల్ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20) మూడో సీజన్‌లో ఆడనున్నాడు. వచ్చే ఏడాది జనవరి 11 నుంచి ఫిబ్రవరి 9 వరకు యూఏఈలో ఈ టోర్నీ జరగనుంది. మొత్తం 34 మ్యాచ్‌లు జరిగే ఈ టోర్నీలో ఆరు జట్లు పోటీపడతాయి.

బిజినెస్

ఎఫ్‌డీలపై ఎస్‌బీఐ వడ్డీ పెంపు

ముంబై: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) ఎస్‌బీఐ వడ్డీరేట్లు పెంచింది. ఎఫ్‌డీల కాల పరిమితిని బట్టి ఈ పెంపు 0.25 శాతం నుంచి 0.75 శాతం వరకు ఉంటుంది. రూ.2 కోట్ల లోపు ఉండే డిపాజిట్లకు ఈ రేట్లు వర్తిస్తాయి ఈ నిర్ణయం ప్రకారం వడ్డీరేట్లు ఈ విధంగా ఉంటాయి.

కాలపరిమితి	ప్రస్తుత రేటు%	కొత్త రేటు%
45 రోజులు	3.5	4.00
46-179 రోజులు	5.5	6.00
180-210 రోజులు	6.00	6.50
211-1 ఏడాది	6.25	6.75
1-2 సంవత్సరాలు	6.80	7.30
2-3 సంవత్సరాలు	7.00	7.50
3-5 సంవత్సరాలు	6.75	7.25
5-10 సంవత్సరాలు	6.50	7.5

బ్రైట్‌కామ్‌కు భారీ షాక్!

వచ్చేనెల 14 నుంచి షేర్ల ట్రేడింగ్ నిలిపివేత ● సర్క్యులర్ జారీ చేసిన స్టాక్ ఎక్స్ఛేంజీలు

వరుసగా రెండు త్రైమాసికాల ఆర్థిక ఫలితాలు ప్రకటించనందువల్లే..



ముంబై: హైదరాబాద్‌కు చెందిన డిజిటల్ మార్కెటింగ్ సొల్యూషన్స్ కంపెనీ బ్రైట్‌కామ్ గ్రూప్‌నకు స్టాక్ ఎక్స్ఛేంజీలు భారీ షాకిచ్చాయి. వచ్చేనెల 14 నుంచి కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను నిలిపివేస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. వరుసగా రెండు త్రైమాసికాల (2023 జూలై- సెప్టెంబరు, అక్టోబరు-డిసెంబరు) ఆర్థిక ఫలితాలను ప్రకటించడంలో కంపెనీ విఫలమైన కారణంగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2023 జూలై 11న జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్‌లోని 33వ నిబంధనకు అనుగుణంగా కంపెనీపై చర్యలు చేపట్టినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలు తమ సర్క్యులర్‌లో వెల్లడించాయి. నియంత్రణ మండలి నిబంధనలను పాటించేవరకు బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్ల ట్రేడింగ్‌పై సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేశాయి. షేర్ల ట్రేడింగ్ నిలిపివేసిన 15 రోజుల తర్వాత, ఆరు నెలల వరకు ప్రతివారంలో మొదటిరోజున ఈ షేర్లలో ట్రేడింగ్‌కు అనుమతించడం జరుగుతుందని తెలిపాయి. బీఎస్ఈలో బ్రైటాకామ్ గ్రూప్ షేరు బుధవారం 4.96 శాతం క్షీణించి రూ.12.27 వద్దకు పడిపోయింది. సోమవారం నాడు షేరు ఏడాది కనిష్ఠ స్థాయి రూ.12.19 వద్దకు పతనమైంది.

5.7 లక్షల మంది రిటైల్ ఇన్వెస్టర్లు ఇరుక్కు పోయినట్లేనా..?

ఈ సస్పెన్షన్ కాలంలో కంపెనీ ప్రమోటర్ వాటా షేర్లను స్తంభింపజేయడంతోపాటు డీమ్యాట్ ఖాతాలోని ఇతర సెక్యూరిటీలను సైతం స్తంభింపజేయడం జరుగుతుందని బీఎస్ఈ తెలిపింది. ప్రస్తుతం బ్రైట్‌కామ్ గ్రూప్‌లో ప్రమోటర్‌కు వాటా 18.38 శాతంగా ఉండగా.. మిగతా 81.62 శాతం వాటా పబ్లిక్ వాటాదారుల చేతుల్లో ఉంది. పబ్లిక్ షేర్‌హోల్డర్లలో 5.7 లక్షల మంది రిటైల్ మదుపరులే. వీరి చేతుల్లో కంపెనీకి చెందిన 37.89 శాతం వాటాకు సమానమైన షేర్లున్నాయి. షేర్ల ట్రేడింగ్ నిలిపివేత ఆదేశాల నేపథ్యంలో ముందు సెషన్లలో ఈ కంపెనీ షేరు మరింత క్షీణించే ప్రమాదం ఉంది. దాంతో బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్లు కలిగి ఉన్న చిన్న మదుపరులు భారీగా నష్టపోయే అవకాశాలున్నాయి.

కంపెనీకి దెబ్బ మీద దెబ్బ

లిస్టింగ్ నిబంధనల అతిక్రమణ, ఇన్వెస్టర్లకు బహిర్గతం చేయాల్సిన సమాచారాన్ని దాచిపెట్టడం, నిబంధనల ఉల్లంఘన వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రైట్‌కామ్ గ్రూప్ రెండేళ్లకు పైగా కాలం నుంచే సెబీ నిఘాలో ఉంది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు ఈ కంపెనీ వ్యయాలను తక్కువ చేసి, లాభాలను పెంచి చూపినట్లు సెబీ గుర్తించింది. కంపెనీ పెద్ద మోసానికి పాల్పడిందని, ఐదేళ్లలో కంపెనీ తన పద్దుల్లో రూ.1,280 కోట్ల విలువైన లావాదేవీలను కప్పిపుచ్చిందని నియంత్రణ మండలి వెల్లడించింది. బ్రైట్‌కామ్ గ్రూప్ చైర్మన్, ఎండీ సురేశ్ కుమార్ రెడ్డి ఏ కంపెనీలోనూ డైరెక్టర్ పదవి చేపట్టకుండా ఈ ఫిబ్రవరిలో సెబీ నిషేధం విధించింది. అంతేకాదు, సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి కంపెనీని నిషేధించింది.

మూడు రోజుల లాభాలకు బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం నీరసించింది. సెన్సెక్స్ 117.58 పాయింట్ల నష్టంతో 72,987.03 వద్ద, నిఫ్టీ 17.30 పాయింట్ల నష్టంతో 22,200.55 వద్ద ముగిశాయి. దీంతో సెన్సెక్స్ మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడినట్టయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై నెలకొన్న సందిగ్ధం, ఎఫ్‌పీఐల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. సెన్సెక్స్ హెవీ వెయిట్ స్టాక్స్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్ సహా పలు కౌంటర్లలో అమ్మకాలు మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	91,000 ▲
ముంబై	72,930 ▲	66,810 ▲	84,505 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ



హైదరాబాద్	550
వరంగల్	552
చిత్తూరు	618
విజయవాడ	540
గోదావరి	540
విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	142
వరంగల్	142
కరీంనగర్	142
మహబూబ్‌నగర్	142
కర్నూలు	142
విశాఖపట్నం	144
గోదావరి	152
విజయవాడ	152
గుంటూరు	152
ఒంగోలు	152
చిత్తూరు	154

టెలికాం చార్జీలు పెరగాల్సిందే..

ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్



న్యూఢిల్లీ: ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే టెలికాం చార్జీలు చాలా తక్కువని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ అన్నారు. టెల్కోల రిటర్నుల నిష్పత్తి మెరుగుపడాలంటే చార్జీలను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. "టెలికాం పరిశ్రమకు ప్రస్తుతం అవసరమైన రిటర్నులు చార్జీల సవరణపైనే ఆధారపడి ఉన్నాయి. టెల్కోలకిదే ఇప్పుడు ప్రధాన సమస్య. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే మన దగ్గర టెలికాం చార్జీలు అత్యంత కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. కంపెనీల రిటర్నుల నిష్పత్తి మెరుగుపడాలంటే చార్జీలను సవరించాల్సిందే. కంపెనీలకు ఆదాయం ఏ సాంకేతికత ద్వారా సమకూరింది అనేది సమస్య కాదు" అని ఎయిర్‌టెల్ మార్చి త్రైమాసిక ఎర్నింగ్స్ కాల్‌లో విఠల్ పేర్కొన్నారు. ప్రస్తుతం 5జీ సేవల ద్వారా లభించే ఆదాయం పరిమితమే అయినప్పటికీ, మొత్తం వ్యాపారంపై ఎంత మేర రిటర్ను లభిస్తున్నదనేదే కంపెనీ చూస్తుందన్నారు. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఎయిర్‌టెల్‌కు ఒక్కో వినియోగదారు నుంచి లభించే సగటు ఆదాయం (ఆర్పు) రూ.209కి పెరిగింది. కాగా, ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా(వీఐ) మూలధన నిధులను సమీకరించగలిగినందుకు సంతోషిస్తున్నాని విఠల్ అన్నారు. భారత టెలికాం మార్కెట్ మూడు ప్రైవేట్ కంపెనీలతో మెరుగైన సేవలందించగలదన్నారు.

ఎన్‌సీసీ టర్నోవర్ 31 శాతం వృద్ధి

ఒక్కో షేరుపై రూ.2.20 డివిడెండ్

హైదరాబాద్: ఇన్‌ఫ్రా రంగంలోని ఎన్‌సీసీ లిమిటెడ్ ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.6,530.05 కోట్ల టర్నోవర్‌పై రూ.239.16 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ టర్నోవర్ 31 శాతం పెరిగింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ కన్సాలిడేటెట్ టర్నోవర్ రూ.15,701 కోట్ల నుంచి రూ.20,970.91 కోట్లకు, నికర లాభం రూ.609.20 కోట్ల నుంచి రూ.710.69 కోట్లకు చేరాయి. ఆర్థిక ఫలితాలు బాగుండడంతో రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.2.20 (110 శాతం) చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ కొత్తగా రూ.27,283 కోట్ల విలువైన ఆర్డర్లు సంపాదించింది. దీంతో ప్రస్తుతం కంపెనీ చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.57,536 కోట్లకు చేరింది.

గ్రాన్యూల్స్ లాభం రూ.130 కోట్లు

ఒక్కో షేరుపై రూ.1.5 డివిడెండ్

హైదరాబాద్: స్థానిక ఫార్మా కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా మార్చి త్రైమాసికంలో రూ.130 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది ఎనిమిది శాతం ఎక్కువ. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.1,195 కోట్ల నుంచి రూ.1,176 కోట్లకు పడిపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ నికర లాభం 22 శాతం తగ్గి రూ.405 కోట్లకు, టర్నోవర్ రూ.4,512 కోట్ల నుంచి రూ.4,506 కోట్లకు పడిపోయాయి. అయినా రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.1.5 (150 శాతం) తుది డివిడెండ్ చెల్లించాలని డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

1:5గా ఆంధ్రా పేపర్స్ షేర్ల విభజన

హైదరాబాద్ : ఆంధ్రా పేపర్స్ తన షేర్లను 1:5గా విభజించాలని నిర్ణయించింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. దీంతో రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరు రూ.2 ముఖ విలువ ఉండే ఐదు షేర్లుగా మారుతుంది. ఈ షేర్ల విభజన పూర్తయ్యేందుకు నాలుగు నెలలు పడుతుందని కంపెనీ అంచనా. ఈ విభజనతో స్టాక్ మార్కెట్‌లో కంపెనీ షేర్ల లభ్యత (లిక్విడిటీ) బాగా పెరిగి షేర్లు రిటైల్ ఇన్వెస్టర్లకు కూడా అందుబాటులోకి వస్తాయని అంచనా.

గోల్డ్ లోన్లపై జర జాగ్రత్త

ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్లపై ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. ఈ కంపెనీలు రుణాలు మంజూరు చేసేటపుడు లోన్ టు వాల్యూ రేషియో, వేలం పద్ధతి, నగదు పంపిణీ విషయాల్లో తూచా తప్పకుండా నిబంధనలు పాటించాలని కోరింది. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ ఈ నిబంధనలు తుంగలో తొక్కిందని తేలడంతో ఆర్‌బీఐ ఈ విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఆదాయ పన్ను చట్టం ప్రకారం ఏ లావాదేవీల్లోనూ రూ.20,000కు మించి నగదు ఇవ్వరాదు. కానీ కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు పసిడి రుణాలు ఇచ్చేటపుడు మొత్తం రుణంలో 40 నుంచి 50 శాతం నగదు రూపంలో ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఖాతాదారుల ఆభరణాల వేలం నిబంధనల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని కోరింది.

నాలుగు నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

ఏప్రిల్ ఎగుమతుల్లో స్వల్ప వృద్ధి



న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం ఏప్రిల్ నెలలో స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. అంతర్జాతీయ ఆర్థిక అస్థిరతల నడుమన ఎగుమతులు కేవలం ఒక శాతం పెరిగి 3499 కోట్ల డాలర్లుగా (రూ.2.97 లక్షల కోట్లు) నమోదయ్యాయి. అయితే వాణిజ్య లోటు మాత్రం నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 1910 కోట్ల డాలర్లకు (రూ.1.62 లక్షల కోట్లు) చేరింది. గత ఏడాది ఏప్రిల్‌లో వాణిజ్య లోటు 1444 కోట్ల డాలర్లుగా (రూ.1.23 లక్షల కోట్లు) ఉంది. గత ఏడాది డిసెంబరులో నమోదైన గరిష్ఠ స్థాయి 1980 కోట్ల డాలర్ల (రూ.1.68 లక్షల కోట్లు) తర్వాత వాణిజ్య లోటు ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల్లో ఆరోగ్యవంతమైన వృద్ధి చోటు చేసుకుంది. ఏప్రిల్‌లో దిగుమతులు కూడా 10.25 శాతం పెరిగి 5409 కోట్ల డాలర్లుగా (రూ.4.60 లక్షల కోట్లు) నమోదయ్యాయి. బంగారం దిగుమతులు గణనీయంగా పెరగడం ఇందుకు దోహదపడింది.

కారుతో ఢీకొట్టి.. వేటకొడవలితో నరికి..

- అఖిలప్రియ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుపై హత్యాయత్నం
- ఆమె నివాసం బయట అర్ధరాత్రి దాడి
- నరకడంతో తలకు లోతయిన గాయం




నిఖిల్‌ను కారుతో ఢీకొట్టిన సీసీ ఫుటేజీ దృశ్యం, వేటకొడవలితో నరకడంతో తీవ్రంగా గాయపడిన ప్రైవేటు సెక్యూరిటీగార్డు నిఖిల్

ఆళ్లగడ్డ, మే 15: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అఖిలప్రియ ప్రైవేటు సెక్యూరిటీ గార్డుపై హత్యాయత్నం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఎవరో పిలిచినట్టు అనిపించి అఖిలప్రియ ఇంట్లోంచి ఆమె బాడీగార్డు నిఖిల్ బయటకు వచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన గుర్తుతెలియని వ్యక్తులు కారుతో నిఖిల్‌ను ఢీకొట్టారు. కారు గుద్దిన వేగానికి నిఖిల్ ఎగిరి అవతల పడ్డారు. కారును ఆపి కిందకు దిగిన ముగ్గురు ఆగంతకులు వేటకొడవళ్లతో దాడి చేశారు. ఆ దాడి నుంచి తప్పించుకుని అఖిలప్రియ ఇంటి వైపు నిఖిల్ పరుగుతీశారు. ఆ ఇంటి దగ్గరల్లో నిఖిల్‌ను చుట్టుముట్టి ఆయన తలపై వేటకొడవలితో నరికారు. అయినా.. ఆ గాయంతోనే నిఖిల్ ఇంట్లోకి వెళ్లిపోయారు. అలా తన ప్రాణాలు కాపాడుకున్నారు. అనంతరం దుండగులు అదే కారులో పారిపోయారు. తీవ్రంగా గాయపడిన నిఖిల్‌ను తొలుత ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. కాగా, ఈ దాడిపై టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో ఏవీ సుబ్బారెడ్డి, డ్రైవరు, మరో ముగ్గురి పేర్లు ఆయన ప్రస్తావించారు. గతేడాది నంద్యాలలో జరిగిన యువగళం పాదయాత్ర సందర్భంగా మాజీ మంత్రి అఖిలప్రియపై ఏవీ సుబ్బారెడ్డి దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో సుబ్బారెడ్డిపై నిఖిల్ చేయి చేసుకున్నారు. ఈ సంఘటనను మనసులో పెట్టుకున్న సుబ్బారెడ్డి, తన అనుచరులతో నిఖిల్‌పై హత్యాయత్నం చేయించారని భావిస్తున్నారు.



చికిత్స పొందుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రిలో ఉద్రిక్తత

- జేసీ అనుచరుడిపై ఖాకీల క్రౌర్యం
- పిలిపించి చితగ్గొట్టిన పోలీసులు
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు
- బాష్పవాయువు ప్రభావంతో జేసీ ప్రభాకర్‌కు అస్వస్థత



పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన దాసరి కిరణ్

తాడిపత్రి టౌన్/అనంతపురం, మే 15(ఆంధ్రజ్యోతి)/ హైదరాబాద్ సిటీ : పోలింగ్ రోజు, ఆ తర్వాతి ఘటనలతో ఇప్పటికీ తాడిపత్రిలో ఉద్రిక్తత చల్లారలేదు. మంగళవారం అర్ధరాత్రి దాటాకా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, టీడీపీ మద్దతుదారు దాసరి కిరణ్‌ను పోలీసులు చావబాదారు. దివ్యాంగుడని చూడకుండా లాఠీలతో కుళ్లపొడిచారు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న కిరణ్‌ను తొలుత తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి, అనంతరం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ చెప్పి మరీ పోలీసులతో తనను కొట్టించారని బాధితుడు కిరణ్ ఆరోపించారు. "మంగళవారం అర్ధరాత్రి స్పెషల్ పార్టీ పోలీసులు నా వద్దకొచ్చారు. డీఎస్పీ చైతన్య పిలుస్తున్నారు.. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్నారు.. రావాలని అన్నారు. అక్కడకు వెళ్లిన తరువాత డీఎస్పీ చైతన్య..నన్ను చూపించి.. 'వీణ్ణి కొట్టండి' అని ఏపీఎస్పీ పోలీసులను ఆదేశించాడు. వారు లాఠీలతో ఇష్టారాజ్యంగా కొట్టారు" అని బాధితుడు వాపోయాడు. ఇదిలాఉండగా, మంగళవారం పోలీసులు ప్రయోగించిన బాష్పవాయువు ప్రభావంతో బుధవారం జేసీ ప్రభాకర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను హైదరాబాద్‌కు తరలించి అక్కడి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆయన ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని తెలిపారు.

పోలీసులు చోద్యం చూస్తున్నారా..!

- ఓటమి మంటతో వైసీపీ బరితెగింపు దాడులు
- 2 రోజులు... 25 నియోజకవర్గాలు... 119 సంఘటనలు
- పోలీస్ వ్యవస్థ ప్రక్షాళన తక్షణ అవసరం: టీడీపీ
- బాధితుల పరామర్శకు కమిటీ ఏర్పాటు చేసిన చంద్రబాబు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ రౌడీ మూకలు ఇష్టానుసారం పేట్రేగిపోయి దాడులు చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారా? అంటూ తెలుగుదేశం పార్టీ మండిపడింది. ఎన్నికల్లో ఓడిపోతున్నామన్న మంటతో వైసీపీ నేతలు బరితెగించి దాడులు చేస్తున్నారని, సీఎం జగన్‌కు బంట్రోతుల్లా తయారైన కొందరు పోలీసు అధికారులు ఆయన ఇంట్లో కూర్చుని వైసీపీ నేతలను రెచ్చగొడుతున్నారని ఆ పార్టీ ఆరోపించింది. బుధవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా మహేశ్వరరావు, నర్సరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీ ఓటర్లు ఓటింగ్‌కు రాకుండా అడ్డుకోవడానికి పోలింగ్ రోజే వైసీపీ నేతలు అనేకచోట్ల అరాచకం సృష్టించారు. పోలింగ్‌కు వెళ్తున్న మహిళల తల పగలగొట్టారు. పోలింగ్ తర్వాత మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వందల మంది రౌడీలను వెంటేసుకొని రాడ్లు, కర్రలతో స్వైర విహారం చేస్తుంటే పోలీస్ శాఖ ఏం చేస్తోంది? కాళ్లు విరగ్గొట్టి ఎందుకు లోపల పడేయలేదు? చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని ఏకంగా హత్య చేయడానికి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన కుమారుడు ప్రయత్నం చేశారు. తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తానొక ప్రైవేటు సైన్యాన్ని పెట్టుకొని బీభత్సం చేస్తుంటే డీఎస్పీ చైతన్య ఆయనకు ఎస్కార్ట్ మాదిరి తిరుగుతున్నాడు. ఈ రెండు రోజుల్లో రాష్ట్రంలో 25 నియోజకవర్గాల్లో 119 సంఘటనలు జరిగాయి. వీటిపై పార్టీపరంగా ఒక కమిటీని అధినేత చంద్రబాబు నియమించారు. మేం అందరం దాడులు జరుగుతున్న అన్ని నియోజకవర్గాలు పర్యటించి బాధితులను కలసి పరామర్శించి ధైర్యం చెప్పబోతున్నాం' అని వర్ల రామయ్య చెప్పారు.

ముందే హెచ్చరించాం: లావు

గడచిన రెండు రోజులుగా రాష్ట్రంలో పరిణామాలు చూస్తే పోలీస్ వ్యవస్థ ప్రక్షాళన తక్షణ అవసరమని ఎంపీ లావు కృష్ణదేవ రాయలు పేర్కొన్నారు. 'గత ఐదేళ్లుగా డీజీపీ తన పని తాను చేయడం లేదు. గురజాల నియోజకవర్గం మాదినపాడులో ఈరోజు ఒక హత్య జరిగింది. అదనపు బలగాలు ఎటు పోయాయో తెలియదు. మాచర్లలో పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో కారంపూడిలో వైసీపీ ఎమ్మెల్యే ప్రైవేటు సైన్యం కవాతుతో ప్రపంచం చూసింది. వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ రెచ్చగొట్టే చర్యలు మానాలని నా విజ్ఞప్తి' అని లావు అన్నారు. 'మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే సోదరులు ప్రైవేటు సైన్యాన్ని సమీకరిస్తున్నారని టీడీపీ నేతలు పోలీసులకు ముందుగా సమాచారం ఇచ్చినా కదలలేదు. ఆ తర్వాత కారంపూడిలో విధ్వంసం చోటు చేసుకొంది' అని నక్కా ఆనందబాబు ఆరోపించారు. పల్నాడు మర్చిపోయిన ఫ్యాక్షనిస్టు వాతావరణాన్ని వైసీపీ నేతలు మళ్లీ కల్పించాలని చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి ఆరోపించారు. 'వైసీపీ మూకల బరితెగింపు, రక్త దాహానికి అమాయకులు బలవుతున్నారు. రాష్ట్రంలో చెలరేగిన హింసపై ఎన్నికల కమిషన్ దర్యాప్తు చేయాలి' అని దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఎస్పీ అట్టాడ బాబూజీపై చర్యలు తీసుకోండి

- స్ట్రాంగ్‌రూం వద్ద కోడ్ ఉల్లంఘన.. ఈసీకి చంద్రబాబు ఫిర్యాదు

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): నాగార్జున యూనివర్సిటీలో స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వహించిన సీఎం సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీ అట్టాడ బాబూజీపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సిద్ధం పోస్టర్లు, అధికార వైసీపీ పాటలతో పార్టీ నిర్వహించారన్నారు. ఈ పార్టీలో 450 మందికి పైగా పోలీసు అధికారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 14న స్ట్రాంగ్ రూం సమీపంలోని డాక్టర్ ఎస్ జాన్ డేవిడ్ ఆడిటోరియం కం సెమినార్ హాల్లో పార్టీ నిర్వహించారన్నారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని చంద్రబాబు కోరారు.

కూటమికి 130 సీట్లు ఖాయం: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), మే 15: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 130 సీట్లను కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న చెప్పారు. విజయవాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయిక సూపర్ డూపర్ హిట్టయిందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో 81 శాతం పోలింగ్ జరిగిందన్నారు. రికార్డుస్థాయిలో చంద్రబాబు నాల్గోసారి సీఎం కావడం ఖాయమని, అమరావతి వేదికగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. జగన్ వంటి దొంగను తరిమికొట్టేందుకు నిజాయితీపరులందరూ ఒక్కటయ్యారని తెలిపారు. అధికారులను భయపెట్టేందుకే జగన్ విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారని బొత్స సత్యనారాయణ ప్రకటించారన్నారు. జూన్ 4(ఓట్ల లెక్కింపు రోజు)న ఆశ్చర్యకర పరిణామాలు చూస్తారని చెప్పారు.

38 వేల కోట్లను ఏం చేశారు?: నీలాయపాలెం

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): 'ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్ర సొంత ఆదాయం, పథకాల కోసం ఉంచిన రూ.14 వేల కోట్లతో కలిపి రూ.38 వేల కోట్లు ఉండాలి. వాటిని ప్రభుత్వం ఏం చేసింది?' అని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'రాష్ట్ర ప్రభుత్వం వద్ద రిజర్వ్, బ్యాంక్ అప్పులు, కేంద్ర పన్నుల వాటాగా వచ్చిన నిధులు, ఏపీఎండీసీ బాండ్లను ఖజానాకు మళ్లించిన దానితోపాటు నగదు బదిలీ కోసం ఉంచిన రూ.14 వేల కోట్లతో కలిపి మొత్తం రూ.38 వేల కోట్లు ఉండాలి. ఇంత డబ్బు ఉన్నా... ఎన్నికలైన తర్వాత లబ్ధిదారులకు నిధులు ఎందుకు విడుదల చేయలేదు?' అని నీలాయపాలెం ప్రశ్నించారు.

అసహనంతోనే వైసీపీ దాడులు: నాగబాబు

అమరావతి, పిఠాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజల తీర్పు ఎలా ఉండబోతున్నదో తెలిసిపోయింది. ఓటమి కళ్ల ముందు కనిపిస్తుండటంతో అసహానికి గురై వైసీపీ నేతలు దాడులకు, హింసకు పాల్పడుతున్నారు' అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పేర్కొన్నారు. ఓటర్లపై వైసీపీ వాళ్లు కక్ష కట్టినట్లు కనిపిస్తున్నదని, పోలింగ్ తర్వాత ప్రజలను వేధిస్తూ దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల, గురజాల, నరసారావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. చంద్రగిరి అభ్యర్థి పులవర్తి నానీపై హత్యాయత్నానికి పాల్పడటం వైసీపీ హింసకు పరాకాష్ట అన్నారు. పోలింగ్ అనంతరం హింసపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద భద్రత పెంచాలన్నారు. జూన్ 4న వచ్చే ప్రజాతీర్పుతో వైసీపీ మరోమారు హింసకు పాల్పడే అవకాశం ఉన్నందున పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

భార్యాబిడ్డలను హింసిస్తూ...
ఏజెంట్‌కు వీడియోకాల్

- బూత్ వదిలి వెళ్లాలని బెదిరింపు
- పిన్నెల్లి గ్రామంలో పోలింగ్‌రోజు రెచ్చిపోయిన వైసీపీ గూండాలు
- ఆలస్యంగా వెలుగులోకి..

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో జరిగిన వైసీపీ అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం కళ్లకుంట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సొంత గ్రామం. ఆ గ్రామంలో గత నాలుగు ఎన్నికల్లో టీడీపీ తరపున పోలింగ్ ఏజెంట్ లేడు. ఈ ఎన్నికల్లో కూడా ఏకపక్షంగా ఎన్నికలు జరిపించాలని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుకున్నారు టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి... వైసీపీ నేత ఆలోచనకు గండికొడుతూ అక్కడ ఏజెంట్‌గా దళితవర్గానికి చెందిన నోముల మాణిక్యాన్ని కూర్చోబెట్టారు. పోలింగ్ మొదలైన తర్వాత వైసీపీ నాయకులు మాణిక్యాన్ని బయటికి వెళ్లాలని సూచించారు. తాను బయటకు వెళ్లనని మాణిక్యం అక్కడే కూర్చున్నారు. దీంతో వైసీపీ నేతలు రెచ్చిపోయారు. గ్రామంలోకి వెళ్లి మాణిక్యం ఇంటిని చుట్టుముట్టారు. ఆయన భార్యాపిల్లలను తీవ్రంగా కొడుతూ వీడియో కాల్ చేశారు. భార్యాపిల్లలను హింసిస్తూ పోలింగ్ బూత్ నుంచి బయటకు రాకపోతే చంపేస్తామని ఆ వీడియో కాల్‌లో మాణిక్యాన్ని బెదిరించారు. అయినా మాణిక్యం పోలింగ్ బూత్ నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం తర్వాత ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లి మాణిక్యాన్ని కొట్టి బయటకు పంపించారని సమాచారం. ఆ తర్వాత మాణిక్యం ఇల్లు ఖాళీ చేసి భార్యాబిడ్డలను తీసుకుని ఊరి నుంచి వెళ్లిపోయారు. మాచర్ల నియోజకవర్గంలోని కేపీగూడెం పోలింగ్ బూత్‌లో కూడా ఇదేవిధంగా పైశాచికత్వాన్ని వైసీపీ గూండాలు ప్రదర్శించారు. ఏజెంట్లుగా కూర్చున్న హనుమంతునాయక్, రేక్యానాయక్, చిన్న మంత్రునాయక్‌లను పోలింగ్ బూత్ నుంచి బయటకు వెళ్లాలని బెదిరించారు. వారు వినకపోవడంతో వారిళ్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ తర్వాత పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఆ ముగ్గురినీ చితగ్గొట్టారు.

పిన్నెల్లిపై భక్తి చాటుకున్న ఖాకీలు..

- వేటుకు రంగం సిద్ధం

మాచర్ల నియోజకవర్గంలో ఎన్నికల రోజున, ఆ తర్వాత రోజు వైసీపీ గూండాలు సాగించిన అరాచకత్వానికి స్థానిక పోలీసుల్లో కొందరు తమ వంతు సహకారం అందించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆ పోలీసుల వివరాలు ఇప్పటికే పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరాయి. స్పెషల్ పోలీసుల కదలికలను, డిపార్ట్‌మెంట్ తీసుకుంటున్న చర్యలను వీరు ఎప్పటికప్పుడు పిన్నెల్లి మనుషులకు చేరవేశారని సమాచారం. విధ్వంస కాండ సాగించిన వైసీపీ మూకలు తేలిగ్గా తప్పించుకుని పోవడానికి ఈ సమాచారం ఉపకరించిందని ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. దీనిపై ఏడుగురు స్థానిక పోలీసులను వారి కాల్ డేటా ఆధారంగా గుర్తించారు. దీనిపై లోతైన విచారణకు రాష్ట్ర డీజీపీ ఆదేశించినట్టు సమాచారం.

పోలీస్ వలయంలోనే పల్నాడు..

మాచర్ల నియోజకవర్గంలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాచర్ల పట్టణంలో మకాం వేసి శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు. మైకుల ద్వారా 144 సెక్షన్ అమలులో ఉందని ప్రచారం నిర్వహిస్తున్నారు. వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. దీంతో పట్టణం బోసిపోయింది. అనుమానం ఉన్న గృహాల్లో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో గాజు సీసాలు, ఖాళీ బీర్ బాటిళ్లు, రాడ్లు, కర్రలు గుర్తించి సిబ్బంది వాటిని మినీ ట్రాలీలో వేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణం, మండల పరిధిలోని సమస్యాత్మకమైక గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నేతలను బైండోవర్ చేశారు. వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించివేశారు. మాచర్ల పట్టణంలో 800 మంది ఆర్‌పీఎఫ్, సీఎస్ఎఫ్, ఎస్‌పీఎఫ్, ఏపీఎస్పీ, సివిల్ పోలీసులు మోహరించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల హౌస్ అరెస్ట్ బుధవారం కూడా కొనసాగింది.



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులపై దాడి చేస్తున్న యువకులు

గుంటూరు జీజీహెచ్‌లోనే
దాడికి తెగబడ్డారు!

- భయంతో పరుగులుతీసిన జీజీహెచ్ సిబ్బంది
- గంజాయి మత్తులో దాడి చేసిన యువకులు!

గుంటూరు మెడికల్, మే 15: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి అత్యవసర వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న వారిపై మంగళవారం రాత్రి గంజాయి మత్తులో ఉన్న యువకులు దాడి చేసి కలకలం సృష్టించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులపై.. ప్రత్యర్థులు వైద్య సిబ్బంది సమక్షంలోనే మరోసారి దాడికి దిగారు. వివరాల్లోకి వెళితే..గుంటూరు కేవీపీ కాలనీకి చెందిన మున్నా కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం అదే ప్రాంతానికి చెందిన ప్రభు అనే వ్యక్తిని బావా బాగున్నావా? అంటూ మున్నా పలుకరించాడు. ఎవడ్రా.. నీకు బావ? అంటూ ప్రభు గొడవకు దిగాడు. స్థానికులు సర్ది చెప్పి పంపేశారు. అతర్వాత మున్నా తన తమ్ముడైన హనీఫ్‌తో కలసి కృష్ణబాబుకాలనీలో కారు పార్కింగ్ చేసి, మద్యం తాగారు. ఆసమయంలో ప్రభు, కోటి, ప్రవీణ్, లచ్చి తదితరులు కర్రలు, ఇనుప రాడ్లతో అక్కడకు వచ్చి సోదరులిద్దరిపై విచక్షణరహితంగా దాడి చేశారు. కొందరు యువకులు అడ్డుకునేందుకు రాగా, వారిపై కూడా దాడి చేశారు. గాయపడిన మున్నా తదితరులను మంగళవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. ప్రభు, అతడి స్నేహితులు రాత్రి ఆసుపత్రికి వచ్చి బాధితులపై మరోసారి దాడి చేశారు. కొంతసేపు ఆసుపత్రిలో అలజడి సృష్టించారు. నగరంపాలెం ఎస్ఐ రవీందర్‌నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో ఏం జరుగుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

గతానుభవాలు ఉన్నా.. ఎందుకు నిర్లక్ష్యం వహించారని నిలదీసింది. పోలింగ్ రోజు పల్నాడు ప్రాంతంలో అధికార పార్టీ దౌర్జన్యాలు, మాచర్లలో ప్రతిపక్షాల ఏజెంట్లపై దాడులు, ఇళ్లలోకి చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించడం.. నరసరావుపేటలో టీడీపీ అభ్యర్థిపై దాడులకు దిగడం.. కత్తులు, కర్రలతో రోడ్లపై స్వైరవిహారం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూముల వద్దే మారణాయుధాలతో దాడి చేయడాన్ని గట్టిగా నిలదీసింది. హింస జరుగుతుందని ముందే హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా అక్కగకు వెళ్లారని, పరిస్థితులు చూసి అప్రమత్తం చేసినా ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నించింది. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలను సీఈసీ సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో సీఎస్, డీజీపీ గురువారం ఢిల్లీ వెళ్తున్నారు. ప్రధానంగా మూడు అంశాలపై వివరణ ఇవ్వనున్నారు. ఒకటి.. పోలింగ్ తర్వాత హింసను నియంత్రించడంలో వైఫల్యానికి కారణాలు. రెండోది.. హింసను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోవడానికి బాధ్యులెవరు..? మూడోది.. నియంత్రణ చర్యలు తీసుకుని ఉంటే అవేంటో ఈసీకి సమర్పిస్తారు. దీనిపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం సచివాలయంలో సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, నిఘా చీఫ్ కుమార్ విశ్వజీత్ సమావేశమయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే సమస్యాత్మక ప్రాంతాలపై నిఘాపెట్టి ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా.. అలా జరగలేదని.. తాను బాధ్యతలు తీసుకున్న రెండ్రోజుల్లోనే కాకినాడ ప్రాంతంలోని బలగాలను ఇటు తెప్పించానని డీజీపీ వెల్లడించినట్లు తెలిసింది. గతంలో అల్లర్లు సృష్టించిన అభ్యర్థుల వెంట షాడో బృందాలు ఏర్పాటు చేయలేదని, వీటన్నిటిపై దృష్టిపెట్టేందుకు తగినంత సమయం తనకు లభించలేదని అన్నట్లు సమాచారం. ఎన్నికల కోసం రాష్ట్ర పోలీసు శాఖ కేంద్రాన్ని సరిపడా బలగాలను కోరలేదని.. ఉన్న బలగాలతోనే సరిపెడతామనే అభిప్రాయం వ్యక్తం చేయడం కూడా హింసను అరికట్టలేకపోవడానికి ప్రధాన కారణంగా డీజీపీ పేర్కొన్నట్లు తెలిసింది. నిఘా విభాగం ఎప్పటికప్పుడు నివేదికలు ఇచ్చిందని, చర్యలు తీసుకోవలసింది పోలీసు బాస్ మాత్రమేనని కుమార్ విశ్వజీత్ స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రధానంగా నాలుగు ఘటనలపై నివేదిక సిద్ధం చేసుకుని ఈసీ ముందుకు వెళ్లాలని సీఎస్, డీజీపీ నిర్ణయించారు. కాగా.. అధికార పక్షానికి ఓట్లు కురిపించే పథకాలకు నిధులు విడుదల చేయించడానికి చూపిన శ్రద్ధ శాంతి భద్రతల సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి చూపలేదని ఈసీ దృఢంగా భావిస్తోందని.. ఇదంతా ఆయన వైఫల్యమేనని గుర్రుగా ఉన్నట్లు ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా, మాచర్ల దాడుల్లో వైసీపీ గూండాలకు పోలీసులు సహకరించారన్న ఆరోపణలపై డీజీపీని ఈసీ సంజాయిషీ కోరింది. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని తిరుపతిలోని మహిళా యూనివర్సిటీ ఆవరణలో ఏకంగా చంపడానికి ప్రయత్నించడాన్ని తీవ్రం గా పరిగణించింది. తాడిపత్రిలో జిల్లా ఎస్పీ కారుపైనే దాడికి దిగడం ఈసీ సీరియస్ అవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

బాధ్యులను గుర్తించి
వెంటనే జైల్లో పెట్టండి!

- తాడిపత్రి, మాచర్ల, చంద్రగిరి, పేట ఘటనలపై ఈసీ సీరియస్
- కొందరు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించినట్టు గుర్తించాం
- వారిపైనా త్వరలో చర్యలు: సీఈవో ముఖేశ్ కుమార్ మీనా



అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల అనంతర హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) తీవ్రంగా స్పందించిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా చెప్పారు. హింసాత్మక ఘటనల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. పోలింగ్ రోజు కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు జరిగినప్పటికీ, ఎన్నికల, పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవడం వల్ల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయన్నారు. పోలింగ్ అనంతరం 4 చోట్ల హింసాత్మక ఘటనలు జరిగాయని, ఈ ఘటనల్లో ఎవరెవరిని గుర్తించామో వారందరినీ అరెస్ట్ చేసి జైల్లో పడేయాలని ఈసీ ఆదేశించిందని చెప్పారు. ఈ ప్రక్రియ మంగళవారం నుంచే కొనసాగుతోందని, ఇప్పటికే చంద్రగిరిలో 30 మందిని, నరసరావుపేటలో ఐదుగురిని గుర్తించి అరెస్టు చేశారని తెలిపారు. ఎన్నికల విధుల్లో కొందరు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించినట్లు గుర్తించామని, వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వారిని గుర్తించే పనిలో డీజీపీ సహా ఉన్నతాధికారులంతా ఉన్నారని తెలిపారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారి ఫొటోలు, వీడియోలతో సహా ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. తాడిపత్రి, మాచర్ల, చంద్రగిరి, నరసరావుపేట ఘటనల్లో అందరినీ గుర్తించామని, కారకులైన అభ్యర్థులను గృహనిర్బంధంలో ఉంచినట్లు తెలిపారు. పల్నాడులో హింసాత్మక ఘటనలు జరుగుతాయని ముందుగానే అదనపు కేంద్ర బలగాలను మోహరించామన్నారు. ఎన్నికల రోజు 9 ప్రాంతాల్లో ఈవీఎంలను ధ్వంసం చేశారని, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విదేశాల నుంచి ఓటర్లు పెద్ద ఎత్తున తరలిరావడం, చివరి రెండు గంటల ముందు భారీ క్యూలైన్లలో ఓటర్లు ఉండడం వల్ల అర్ధరాత్రి వరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగిందని మీనా తెలిపారు.

ఓటింగ్ కోసం రైలును పరుగెత్తించాం..

ఎన్నికల రోజు నాందేడ్-విశాఖపట్నం రైలు ఆలస్యంగా నడవడం వల్ల అందులో ప్రయాణించే ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని మీనా చెప్పారు. దీంతో తమ సూచనల మేరకు అదనపు సీఈవో కోటేశ్వరరావు ఎంతో చాకచక్యాన్ని ప్రదర్శించి విజయవాడ, రాజమండ్రి విశాఖపట్నం డీఆర్ఎంలతో మాట్లాడి ఆ ట్రైన్ గ్రీన్ చానల్‌లో వేగంగా గమ్యాన్ని చేరుకునేలా చేశారని అభినందించారు. అలాగే, మహారాష్ట్రలో ఎన్నికల విధులకు వెళ్లిన వారికి ప్రత్యేక సీఎల్ మంజూరు చేయడంతోపాటు వారు నేరుగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు.

జగన్ ఇంట్లో రాజశ్యామల యాగం



అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నివాసం తాడేపల్లి ప్యాలెస్‌లో రాజశ్యామల యాగం నిర్వహించారు. బుధవారం చివరిరోజు పూర్ణాహుతిలో సీఎం స్వయంగా పాల్గొన్నారు. దాదాపు 41రోజులు సాగిన ఈ యాగం గురించి బయటకు పొక్కకుండా మొత్తం క్రతువును పూర్తిచేశారు. ఈ కార్యక్రమం మొత్తం సీఎం నివాసంలో ప్రత్యేకంగా నిర్మించిన ఆలయంలో నిర్వహించారు. గత ఎన్నికలకు ముందు విశాఖలోని శారదా పీఠంలో రాజశ్యామల యాగాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే.

కేసులతో 'కట్టిపడేసి'!

- అల్లర్ల వెనుక వైసీపీ అసలు వ్యూహం
- అనుచరులు చేజారకుండా చర్యలు
- కేసులు నమోదైతే తమ చుట్టూ తిరగాల్సిందే...టీడీపీలోకి వెళ్లలేరు..
- అందుకే.. ప్రత్యర్థులపై వరుస దాడులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'అనుచరులు' తమ చుట్టూనే తిరుగుతూ ఉండాలి! తమపైనే ఆధారపడాలి. అధికారం కోల్పోయినా... అవతలి పార్టీలోకి వెళ్లే వీల్లేకుండా చేయాలి!... ఇదీ వైసీపీ వంకర వ్యూహం! దీనికి బలవుతున్నది సొంత పార్టీ కార్యకర్తలు, నేతల అనుచరులే! పోలింగ్ తర్వాత కొనసాగుతున్న భారీ హింసపై లోతుగా ఆరా తీసినప్పుడు ఈ సంగతి బయట పడింది. టీడీపీ నాయకులు ఎవరైనా వైసీపీలో చేరాలనుకుంటే... ముందుగా వాళ్లకు ఒక షరతు పెట్టేవాళ్లు. 'మీరు చంద్రబాబును, లోకేశ్‌ను గట్టిగా తిట్టండి. ఆ తర్వాతే పార్టీ మారండి. తిట్టకుండా రావడం మాత్రం కుదరదు' అని తేల్చి చెప్పే వాళ్లు. దీనివల్ల ఆ నేతలు తిరిగి టీడీపీలోకి చేరే అవకాశం ఉండదు. వారు చేరాలనుకున్నా... చేర్చుకోరు. ఇదీ వైసీపీ వ్యూహం. ఇప్పుడు పల్నాడుతో పాటు రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో కేడర్‌పైనా ఇలాంటి వ్యూహమే అమలు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగా కేడర్‌ను రెచ్చగొట్టి ప్రత్యర్థులపై దాడులకు ఉసిగొల్పి బలిపశువుల్ని చేస్తున్నారు. వారిపై కేసులు నమోదైతే సాయం కోసం ఐదేళ్లూ తమ చుట్టూ తిరుగుతుంటారు. ప్రత్యర్థులతో ఘర్షణ పెట్టుకోవడం వల్ల ఆ శిబిరం దగ్గరకు రానివ్వరు. దీనివల్ల తమ కిందే ఉంటారనే వ్యూహం దాగి ఉన్నట్టు తెలుస్తోంది. పోలింగ్ ముగిసిన తర్వాత సాధారణంగా చల్లబడాల్సిన రాజకీయ వాతావరణం ఆకస్మికంగా వేడెక్కడానికి, రాష్ట్రంలో పలు చోట్ల హింసాత్మక దాడులు చోటు చేసుకోవడానికి ఈ వ్యూహమే కారణమని రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

వందల సంఖ్యలో పోగేసి...

సాధారణంగా పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజు పార్టీల మధ్య దాడులు, గొడవలు అక్కడక్కడా ఉండేవే. కానీఈసారి ఇందుకు భిన్నంగా పోలింగ్ తర్వాత కొన్ని ప్రాంతాల్లో హింస పెరిగింది. వందలసంఖ్యలో అనుచర వర్గాన్ని పోగుచేసి సుత్తులు, ఇనుపరాడ్లు, కర్రలతో స్వైర విహారం చేస్తూ ప్రత్యర్థులపై తెగబడి దాడులు చేయడం అధికార వర్గాలకు విస్మయం కలిగిస్తోంది. ఇందులో అధికార వైసీపీ నేతలే ప్రముఖంగా కనిపిస్తున్నారు. మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు స్వయంగా నాయకత్వం వహించి మారణాయుధాలు చేతబట్టిన అనుచరులతో కలిసి దాడులు నిర్వహించారు. తాడిపత్రిలో వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తానే నాయకత్వం వహించి టీడీపీ నేతల ఇళ్లపై దాడులు జరిపారు. చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరవర్గం టీడీపీ అభ్యర్థిని గాయపర్చింది. ఈ ఘటనలు అనుకోకుండా జరిగినవి కావని, వీటి వెనుక ప్రత్యేక వ్యూహం ఉందని కొందరు పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఓటమి భయంతో సొంత పార్టీ కేడర్ చేజారిపోకుండా ఉండటానికి వారిని బలిపశువుల్ని చేస్తున్నారు.

వ్యూహంతోనే దాడులు

'ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలైతే ఆ పార్టీ నేతల వెనుక తిరిగే వారిలో చాలా మంది జారిపోయే వాతావరణం నెలకొంది. దీనిని నాయకత్వం పసిగట్టింది. ఫలితాలు రాక ముందే తమ అనుచర గణాన్ని ఏదో ఒక దాడి ఘటనలో ఇరికించి ప్రత్యర్థి పార్టీ వారికి కోపం తెప్పిస్తే ఇక వారిని చేర్చుకోరు. వైసీపీ నేతలు సరిగ్గా ఇదే కోరుకుంటున్నారు' అని ఓ పోలీస్ అధికారి విశ్లేషించారు.

విందు రాజకీయం

పోలింగ్ తర్వాత వైసీపీ అభ్యర్థులు కొందరు రకరకాల వ్యూహాలకు పదును పెడుతున్నారు. పోలింగ్ అధికార పార్టీకి వ్యతిరేకంగా జరిగిందన్న ప్రచారం విస్తృతంగా జరగడంతో వైసీపీ కేడర్‌లో నీరసం అలుముకొంది. ఈ పరిస్థితుల్లో కేడర్‌లో నమ్మకం కలిగించడానికి కొందరు వైసీపీ అభ్యర్థులు విందు పార్టీలు ఇస్తున్నారు. ఎన్నికల్లో బాగా పనిచేసి విజయం అందిస్తున్నందుకు అభినందనల పేరుతో ఈ విందులు ఏర్పాటవుతున్నాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసిన మంత్రి రజని ఇటువంటి విందు సమావేశం ఏర్పాటు చేసి కేడర్‌లో నమ్మకం కలిగించే ప్రయత్నంలో ఉన్నారు.

సర్కారు సొమ్ముతో పేదల బిడ్డ డాబు

- జగన్ వ్యక్తిగత విదేశీ పర్యటనకు సెక్యూరిటీ ఖర్చు 1.40 కోట్లు
- రేపు ప్రత్యేక విమానంలో లండన్, ఫ్రాన్స్ టూర్‌కు సీఎం కుటుంబం
- ముందుగా నేడు ముగ్గురు అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' వార్తతో ఐపీఎస్ అవుట్
- ముఖ్యమంత్రి విమానం ఖర్చెంతో?

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ తనకు తాను పదే పదే పేదల బిడ్డ అని చెబుతుంటారు. ఈ పేదల బిడ్డ తన భార్య, కుమార్తెలతో కలసి విదేశీ ప్రైవేటు పర్యటనకు ఎంచక్కా ప్రత్యేక విమానంలో వెళుతున్నారు. ఆయన భద్రత కోసం వెళ్తున్న ముగ్గురు అధికారుల కోసం ప్రభుత్వ సొమ్మును ఏకంగా రూ.1.40 కోట్లు ఖర్చు చేస్తున్నారు. విమాన టికెట్లు, వసతి, విదేశాల్లో తిరిగేందుకు వాహనాలు, ఇతర అవసరాలకు ఈ మొత్తం ఖర్చు పెడుతున్నారు. ఇక పేదల బిడ్డ వెళ్తున్న ప్రత్యేక విమానం అద్దె, ఇతర ఖర్చులు ఎంత? అన్న వివరాలు తెలియరాలేదు. లండన్, ఫ్రాన్స్‌లో వేసవి సెలవులు గడిపేందుకు శుక్రవారం జగన్ తన కుటుంబ సభ్యులతో కలసి వెళ్తారు. వారి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ఓ రోజు ముందే అంటే.. గురువారం ముగ్గురు డీఎస్పీ ర్యాంకు అధికారులు వెళ్తున్నారు. సాధారణంగా ఇంగ్లండ్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో ముఖ్యమంత్రి అనే పదవికి కనీస గుర్తింపు ఉండదు. అక్కడ జగన్‌ను పట్టించుకునే వారు ఉండరు. అయినా జగన్ భద్రత కోసం వెళ్తున్న అధికారులకు భారీగా ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేస్తున్నారు. సీఎం ప్రైవేటు పర్యటనకు భద్రత కోసం స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) చీఫ్, ఐపీఎస్ అధికారి బాబూజీ అట్టాడను పంపాలని మొదట నిర్ణయించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత పర్యటనకు ఐపీఎస్ అధికారి వెళ్లాలా? అంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. విదేశీ పర్యటనకు ఆయన్ను పంపడం లేదు. ఎస్ఎస్‌జీ అదనపు డైరెక్టర్ చిదానంద రెడ్డి, చీఫ్ సెక్యూరిటీ అధికారులు ఎస్ఎం బాషా, బి.మురళి వెళుతున్నారు. ముఖ్యమంత్రి కుటుంబం బయలుదేరక ముందే విదేశాలకు చేరుకుని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు. భద్రతాధికారుల విమాన టికెట్లు, వసతి, విదేశాల్లో తిరిగేందుకు వాహనాలు, వీసా చార్జీలు కలిపి హైదరాబాద్‌కు చెందిన హన్స హాలిడేస్ అనే ఏజెన్సీకి ప్రభుత్వం ముందుగానే 1.33 కోట్లకు పైగా చెల్లించింది. ఎంపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 6.05 లక్షలు విడుదల చేసింది. సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు జీవో విడుదల చేసింది. సాధారణంగా విదేశాలకు ముఖ్యమంత్రులు వెళ్లినపుడు వారి వెంట చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) ఉంటారు. జగన్ ప్రైవేటు పర్యటనకు ఆయన వెళ్లే ప్రత్యేక విమానంలో పీఎస్, అదనపు సహాయకుడితో పాటు సీఎస్‌వో కూడా వెళుతున్నారు. అయినా ముందుగా ముగ్గురు అదనపు సెక్యూరిటీ అధికారులను పంపి, వారి ఖర్చులకు ప్రజాధనం భారీగా ఖర్చు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలో ముఖ్యమంత్రులు విదేశాలకు వ్యక్తిగత పర్యటనకు వెళ్లినపుడు ఇలా ప్రభుత్వ సొమ్ము దుబారా చేసిన దాఖలాలు లేవు.

అస్మదీయులకు చెల్లింపులు జరగవు

- అన్నీ పద్ధతిగా నడిపిస్తున్నాం: గవర్నర్
- పోలింగ్ తర్వాత హింసపై ఈసీ సీరియస్
- కఠిన చర్యలకు నేనూ ఆదేశించాను
- టీడీపీ కూటమి నేతలకు నజీర్ భరోసా


గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి వివిధ అంశాలపై వినతిపత్రం అందజేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం తమకు కావలసిన కాంట్రాక్టర్లకు అడ్డగోలు చెల్లింపులు చేస్తోందన్న భయం అక్కర్లేదని, అలా జరగదని గవర్నర్ అబ్దుల్ నజీర్ భరోసా ఇచ్చారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ, లంకా దినకర్, చిల్లపల్లి శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం విజయవాడ రాజ్‌భవన్‌లో ఆయన్ను కలిసి వివిధ అంశాలపై వినతిపత్రం సమర్పించారు. సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు చెల్లింపులు చేయడం కోసం ఉంచిన రూ.17 వేల కోట్లను వారికి ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం అస్మదీయ కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి ప్రయత్నిస్తోందని వారు ఫిర్యాదు చేశారు. ముందు బిల్లు పెట్టిన వారికి ముందుగా చెల్లించాలన్నది ఆర్థిక శాఖలో అనుసరించే పద్ధతి అని.. కానీ దానిని తుంగలో తొక్కి తమ వారి బిల్లులు పైకి తీసి వారికి మాత్రమే చెల్లింపులు చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని.. కొందరు అధికారులు ప్రభుత్వ పెద్దలతో లాలూచీ పడి దీనికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని తమ ఫిర్యాదులో పేర్కొనడంతో పాటు మౌఖికంగానూ గవర్నర్ వద్ద ప్రస్తావించారు. 'బిల్లుల చెల్లింపులపై మీరు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. పద్ధతి ప్రకారమే అంతా జరిగేలా మేం చూస్తున్నాం. ఈ మేరకు ఆదేశాలు కూడా ఇచ్చాం. మేం స్ట్రీమ్‌లైన్ చేస్తున్నాం. అన్నీ మేం చూసుకుంటున్నాం. మీరు భయపడాల్సిన అవసరం లేదు' అని అన్నారు. పోలింగ్ తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలను కూటమి నేతలు వివరించినప్పుడు కూడా గవర్నర్ వారితో విపులంగా మాట్లాడారు. 'ఇక ముందు ఇలాంటివి జరగవు. కఠిన చర్యలు తీసుకోవాలని నేను ఆదేశించాను. అధికారులు ఎవరైనా ఉపేక్షిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. డీజీపీని, సీఎస్‌ను ఢిల్లీ పిలిపిస్తున్న విషయం మీకు తెలుసు. ఈ సంఘటనలను ఎన్నికల కమిషన్ కూడా సీరియస్‌గా తీసుకుంది. ఫలితం ఎలా ఉంటుందో మీరే చూస్తారు' అని ఆయన వారితో అన్నారు. హింసాకాండ జరిగిన ప్రాంతాల సందర్శనకు టీడీపీ ఒక కమిటీ వేసుకుందని.. గురువారం మాచర్ల వెళ్దామని అనుకుంటున్నామని టీడీపీ నేతలు చెప్ప గా.. వద్దని గవర్నర్ సూచించారు. రెండు నెలలు ఆగితే మీపై (టీడీపీ కూటమి ప్రభుత్వంపై) ఫిర్యాదు చేయడానికి వైసీపీ నేతలు కూడా తన వద్దకు వినతిపత్రాలతో వస్తారని గవర్నర్ అనగా.. తమ నేత చంద్రబాబు ఇలాంటి హింసాత్మక చర్యలను ఎన్నడూ ప్రోత్సహించరని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. ఆ విషయం తనక్కూడా తెలుసని.. తాను సరదాగా అంటున్నానని ఆయన అన్నట్లు తెలిసింది.

ఓటమి భయంతోనే ప్లాన్ బీ..

గవర్నర్‌తో భేటీ తర్వాత వర్ల రామయ్య విలేకరులతో మాట్లాడారు. 'జగన్‌కు ఓటమి ఖాయమని అర్థమైపోయింది. దీంతో ప్లాన్ బీ ద్వారా అరాచకాలకు తెరలేపారు. కర్రలు, కత్తులు, రాడ్లతో దాడులకు తెగబడ్డారు. ప్రజలు మాత్రం భయపడకుండా ఓట్లు వేశారు. దెబ్బలు తగిలినా వెనక్కి వెళ్లకుండా ముందుకు సాగారు. గవర్నర్‌కు రాష్ట్రంలో అరాచకాలపై వివరించాం. పోలీసులు కూడా వైసీపీతో మిలాఖత్ అయిన పరిస్థితిని తెలియజేశాం' అని తెలిపారు.

దుమ్మురేపిన ఓటర్!

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్లు తాజా ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈవీఎంల ద్వారా ఓటేసిన వారిలో పురుషులు 1,64,30,359 మంది ఉండగా, మహిళలు 1,69,08,684 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 1,517 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 25 పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా చూస్తే 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం పోలైన ఓట్ల కన్నా 227 మంది ఓటర్లు పార్లమెంటుకు అధికంగా ఓటు హక్కు వినియోగించున్నారు. 2019 ఎన్నికల్లో 3.07 కోట్ల ఓటు వేయగా.. ఈసారి 26 లక్షల మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో మొత్తం ఓటేసిన వారి సంఖ్య 3,33,40,560కు చేరింది.

4.97 లక్షల మంది ఉద్యోగులు

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, సర్వీసు ఓటర్లు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1.2 శాతం పోలింగ్ నమోదైంది. పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకుంటే 81.86గా పోలింగ్ నమోదైంది. వీరిలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు 4.44 లక్షల మంది, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 13,700 మంది, దివ్యాంగులు 12,700, అత్యవసర సర్వీసు ఓటర్లు 27,100 మంది ఉన్నారు. 2019 ఎన్నికల్లో 2.62 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోగా ఈసారి 4.97 లక్షల మంది ఓటేశారు. 3,500 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల దాటాక కూడా పోలింగ్ కొనసాగింది. గత ఎన్నికలతో పోలిస్తే 2.09% పోలింగ్ పెరిగింది. 2019తో పోలిస్తే ఈసారి 1 శాతం ఈవీఎం ఓటింగ్‌లోనే పెరిగింది.

పోలింగ్ నమోదులో..

- ఒంగోలు పార్లమెంటు పరిధిలో అత్యధికంగా 87.06 శాతం పోలింగ్‌తో మొదటి స్థానంలో నిలిచింది. 85.77 శాతం పోలింగ్‌తో చిత్తూరు రెండో స్థానంలో, 85.65 శాతం పోలింగ్‌తో నరసరావుపేట మూడోస్థానంలో నిలిచాయి. అత్యల్పంగా విశాఖపట్నం పార్లమెంట్ స్థానంలో 71.11 శాతం ఓటింగ్ నమోదైంది. తర్వాత స్థానంలో అరకు(73.68%), మూడో స్థానంలో శ్రీకాకుళం(74.43%) ఉన్నాయి.
- దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో 90.91 శాతం పోలింగ్ నమోదైంది. 89.89 శాతం ఓటింగ్‌తో జగ్గయ్యపేట రెండవ స్థానం, 89.88 శాతం పోలింగ్‌తో కుప్పం మూడోస్థానంలో నిలిచాయి. అత్యల్పంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో 63.32 శాతం పోలింగ్ నమోదైంది. రెండో స్థానంలో విశాఖపట్నం సౌత్(63.42%), మూడవ స్థానంలో కర్నూలు(63.75%) నిలిచాయి.

పట్టణాల్లో క్యూకట్టిన ఓటరు

పట్టణ నియోజకవర్గాల్లో పోలింగ్ బూతులకు ఓటరు క్యూకట్టాడు. దీంతో అనూహ్యంగా ఓటింగ్ శాతం పెరిగింది. అయితే.. ఒక్క తిరుపతిలో మాత్రం పోలింగ్ శాతం తగ్గింది. గత ఎన్నికల్లో ఇక్కడ 65.9 శాతం పోలింగ్ నమోదుకాగా, ఈసారి 63.32 శాతమే నమోదైంది. ఆ నియోజకవర్గంలో పోలింగ్ శాతం ఈసారి తగ్గడానికి కారణం బోగస్ ఓట్లను నియంత్రించడమేనని సీఈవో మీనా తెలిపారు.

నియోజకవర్గాల్లో పోటెత్తిన ఓట్లు

- 16 పార్లమెంటు స్థానాల్లో 80-90% పోలింగ్.
- 9 పార్లమెంటు స్థానాల్లో 80% కన్నా తక్కువ.
- 117 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 80-90 శాతం పైగా పోలింగ్ నమోదైంది.
- 41 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 70-80 శాతం పోలింగ్ నమోదైంది.
- 17 నియోజకవర్గాల్లో 63-70% నమోదైంది.
- 142 అసెంబ్లీ స్థానాల్లో పురుష ఓటర్ల కంటే అధికంగా మహిళా ఓటర్లు పోటెత్తారు.
- 26 నియోజకవర్గాల్లో 75-80 శాతం పోలింగ్ నమోదైంది.
- 15 నియోజకవర్గాల్లో 70-75 శాతం పోలింగ్ నమోదైంది.
- మొత్తంగా 158 నియోజకవర్గాలో 70% పైన ఓటింగ్ జరిగింది.

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం..

నియోజకవర్గం	2014	2019	2024
శ్రీకాకుళం	74.60	74.08	74.43
విజయనగరం	80.19	80.57	81.05
అరకు	71.82	73.67	73.68
విశాఖపట్నం	67.53	67.26	71.11
అనకాపల్లి	81.01	81.00	82.03
కాకినాడ	77.68	78.38	80.30
అమలాపురం	82.63	83.67	83.85
రాజమండ్రి	81.38	80.95	80.93
నర్సాపురం	82.19	81.02	82.59
ఏలూరు	84.27	82.94	83.68
మచిలీపట్నం	83.48	83.70	84.05
విజయవాడ	76.64	77.14	79.37
గుంటూరు	79.31	78.55	78.81
నర్సరావుపేట	84.68	85.53	85.65
బాపట్ల	85.16	85.49	85.48
ఒంగోలు	82.23	85.23	87.06
నెల్లూరు	74.02	76.14	79.05
తిరుపతి	77.14	78.99	79.10
రాజంపేట	78.05	78.38	79.09
చిత్తూరు	82.59	83.68	85.77
నంద్యాల	76.71	80.15	80.61
కర్నూలు	72.08	75.13	76.80
అనంతపురం	78.87	80.24	80.51
హిందూపురం	81.53	83.89	84.70
కడప	77.47	77.81	79.57
మొత్తం	**77.96**	**79.88**	**80.66**

* పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి మొత్తం పోలైన ఓట్లు 81.86 శాతం

స్ట్రాంగ్ రూమ్ పక్కనే సీఎం సెక్యూరిటీ విందు

- నాగార్జున విశ్వవిద్యాలయంలో ఘటన
- మంగళగిరి ఈవీఎంలు ఇక్కడే


నాగార్జున యూనివర్సిటీలోని డైక్‌మన్ హాల్లో జరిగిన సీఎం సెక్యూరిటీ సిబ్బంది విందు సమావేశంలో జగన్ సిద్ధం పోస్టర్

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌కు కూతవేటు దూరంలో ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది విందు చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ సిద్ధం పోస్టర్లు, ఆ పార్టీ డీజే పాటలతో హోరెత్తించారు. నాగార్జున వర్సిటీలో ఈ ఘటన జరిగింది. గుంటూరు లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించే ఈవీఎం యంత్రాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఓ స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు సమీపంలో ఉన్న డైక్‌మన్ మీటింగ్ హాల్‌ను మంగళవారం రాత్రి సీఎం సెక్యూరిటీ సిబ్బంది విందు, వినోదాలు నిర్వహించుకునేందుకు కేటాయించారు. దీంతో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు కలవరపాటుకు గురవుతున్నారు. లోకేశ్ పోటీ చేసిన మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు ఇదే స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్నాయి. లోకేశ్‌ను ఓడించేందుకు తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు ఎన్నికల సమయంలో ఎన్నో కుయుక్తులు పన్నినప్పటికీ ఓటర్లు నమ్మలేదని గ్రహించి ఏదో కుట్రకు వ్యూహరచన చేస్తున్నారనే భయం టీడీపీ నేతల్లో నెలకొంది. ఈ పార్టీ నిర్వహించిన సీఎం సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీ అత్తాడ బాపూజీపై కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఈవోను కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 16 మే 2024
diksuchi@andhrajyothy.com

(నిన్నటి పేజీ తరువాయి)

అందుకే దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఐదో స్థానంలో ఉన్నాయి. ఫుడ్ టెక్నాలజీ పరిశ్రమలో ఆర్గానిక్ కెమిస్టులు, బయోకెమిస్టులు, అనలిటికల్ కెమిస్టులు, హోమ్ ఎకనమిస్టులు, ఇంజనీర్లు(కెమికల్, మెకానికల్, ఇండస్ట్రియల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్, సివిల్, ప్యాకింగ్), రీసెర్చ్ సైంటిస్టులు, మేనేజర్లు, అకౌంటెంట్లు మొదలైన వారికి అవకాశాలు ఉంటాయి. ఎంపిసి, బైపిసితో ఇంటర్ పూర్తిచేసి ఈ రంగంలోకి వెళ్లవచ్చు.

కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Acharya N.G. Ranga Agricultural University, Bapatla, Andhra Pradesh,
- Prof. Jayasankar Agricultural University, Rajendra Nagar, Hyderabad-500030,
- Central Food Technology Research Institute, Mysore-570020, Karnataka.
- Central Institute of Fisheries Education, Fisheries University Road, Seven Bungalows, Andheri(W), Mumbai-400061, Maharashtra, Website: www.cife.edu.in
- College of Agricultural Technology, Marathwada Krishi Vidyapeeth,Parbani-431402, Maharashtra.
- CSK Krishi Vishwa Vidyalaya, Palamuru-176060, Himachala Pradesh, Website: www.hillagric.org
- Govind Ballabh Pant University of Agriculture and Technology, Pantnagar-263145, Distt. Udham Singh Nagar, Uttarakhand, Website: www.gbpuat.ac.in
- Guru Nanak Dev University, Department of Food Science & Technology, Amritsar-143005, Punjab, Website: www.gndu.ac.in
- Harcourt Butler Technological Institute, Nawab Ganj, Kanpur-208002, Uttar Pradesh, Website: www.hbti.ac.in
- IIT(Indian Institute of Technology), Kharagpur-721302, West Bengal.
- Jadhavpur University, Department of Food and Technology and Biochemical Engineering, 188 Raja S.C Malik Road, Kolkata-200032, West Bengal, Website: www.jadavpur.edu
- Mahatma Gandhi University, Priyadarshini Hills PO, Kottayam-686560, Kerala, Website: www.mguniversity.edu
- Manipur University, Canchipur, Imphal, Manipur, Website: www.manipuruniv.ac.in
- M.S.University, Vadodara-390002, Gujarat Website: www.msuboroda.ac.in
- National Dairy Research Institute, NDRI Deemed - University Karnal-132001, Haryana, Website: www.karnal.nic.in
- National Sugar Institute, P.O: NSI Kalyanpur, Kanpur-208017, UttarPradesh.
- SNDT Women's University, 1, Nathibai Thakersey Marg, Marine Lines, Mumbai - 400022, Maharashtra, Website: www.sndt.ac.in
- University of Delhi, Delhi-110007, Website: www.du.ac.in
- University College of Technology (Osmania University), Hyderabad-500007, Telangana.
- University Department of Chemical-Technology (U.D.C.T), Nathalal Parikh Marg, Matunga, Mumbai - 400019, Maharashtra Website: www.udct.org

హోమ్ సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ

ఇంటర్ బైపీసీతో పూర్తిచేసినవారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. న్యూట్రిషనిస్ట్, డైటీషియన్స్, ఫుడ్ టెక్నాలజిస్టులుగా ఉపాధి లభిస్తుంది. సమతుల ఆహారంపై ఈ మధ్య కాలంలో అందరికీ అసక్తి ఏర్పడటంతో ప్రైవేటు రంగంలోనూ ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు పెరుగుతున్నాయి. ముడి ఆహార పదార్థాలను మనుషులు, జంతువులు ఆసక్తిగా, అవసరమైనప్పుడు తినేట్టు చేయడమే ఫుడ్ టెక్నాలజీ కోర్సు. వివిధ పద్ధతులు ఆచరించి, మరికొన్ని కలిపి ఆహార పదార్థాలు రుచికితోడు నిల్వ ఉండేలా చేస్తుంటారు. ప్రస్తుతం దేశంలో మూడు కోట్లమంది నెలలో ఎక్కువ రోజులు ప్యాకేజీ ఫుడ్‌పై ఆధారపడి ఉన్నారు. మరో రెండు కోట్లమంది త్వరలోనే ఈ జాబితాలో చేరే పరిస్థితిలో ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి.





సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత
What Next

ఫోరెన్సిక్ సైన్స్

ఫోరెన్సిక్ అనేది లాటిన్ పదం. ఫోరెన్సిక్ సైన్స్ అనేది నేరాలను శాస్త్రీయంగా నిర్ధారించే శాస్త్రం. ఫిజికల్, మెడికల్, బయోలాజికల్, మెడికల్ తదితర సబ్జెక్టుల నుంచి పుట్టిన శాస్త్రం ఇది. మొదటిసారిగా భారత ప్రభుత్వం 1972లో న్యూఢిల్లీలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్‌సైన్స్(www.nicfs.nic.in)ను ఏర్పాటు చేసింది. ఇది కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థ ఇప్పటి వరకు వేలాది మందికి ఫోరెన్సిక్ సైన్స్‌లో శిక్షణ ఇచ్చింది. వీరిలో ప్రపంచంలోని 200 దేశాలవారు ఉన్నారు. ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు కోల్‌కతా, హైదరాబాద్, చండీగఢ్‌లో ఫోరెన్సిక్ లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. క్రిమినాలజీలో ఎంఏ, ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎమ్మెస్సీ కోర్సును ఎల్ఎన్‌జెపి - ఎన్ఐసిఎఫ్ఎస్ అందిస్తోంది. ఒక్కో దానిలో 20 సీట్లు ఉన్నాయి. ఇక్కడ పీజీ డిప్లొమా ఇన్ డాక్యుమెంటేషన్, ఫోరెన్సిక్ బాలిస్టిక్, ఫోరెన్సిక్ బయాలజీలతోపాటు కొన్ని షార్ట్‌టర్మ్ కోర్సులు కూడా ఉన్నాయి. ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించి దేశంలోని పలు యూనివర్సిటీలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇన్ క్రిమినల్ జస్టిస్ కోర్సు ఉంది. ఏ డిగ్రీ చేసినవారైనా ఈ కోర్సులో చేరొచ్చు. అదేవిధంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (www.gfsu.edu.in) కూడా ఉంది.

కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Anna University (Chennai 600025) - Post - BE Diploma in Forensic Engineering
- Bundelkhand University (Jhansi 284128)-PG Diploma in Forensic Science
- PG Diploma in Criminology; University of Delhi (Delhi 110007)- Certificate in Forensic Science(3 months)
- Dr. B.R. Ambedkar University(Agra 282004) - MSc(Forensic Science)
- Dr.Hari Singh Gour Vishwavidyalay (Sagar 470003)- MSc. (Criminology), MA (Criminal and Forensic Science).
- Karnataka University (Dharwad-580003)-MA (Criminology and Forensic Science)
- Lucknow University (Lucknow 226007)-PG Diploma in Forensic Anthropology
- University of Madras (Chennai 600005)-MA (Criminology), and MSc. (Forensic Science)
- Osmania University (Hyderabad 500007)-MSc. (Forensic Science Laboratory)
- Panjab University(Chandigarh 160014)-PG Diploma in Forensic Science and Criminal Science.
  1- Punjabi University (Patiala 147002) - MSc(Forensic Science)
- Amity University (Sector 44, Noida-UP) BSc. and MSc. (Forensic Science).



మర్చెంట్ నేవీ

ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు ఎక్కువ మొత్తం నౌకా రవాణా ద్వారానే జరుగుతున్నాయి. అందుకు కారణం మిగిలిన రవాణాలతో పోలిస్తే ఇది చాలా చౌక. అందుకే ప్రపంచ వ్యాప్తంగా షిప్పింగ్ ఇండస్ట్రీకి మంచి ఆదరణ ఉంది. మర్చెంట్ నేవీలోకి వెళ్లినవారికి అనుకూలతలు, ప్రతికూలతలు రెండూ ఉన్నాయి. కొత్త కొత్త ప్రదేశాలకు వెళ్లడం వీరికి అనుకూలత. అయితే నెలల తరబడి సముద్ర ప్రయాణంలోనే జీవితం గడిచిపోతుంది. కుటుంబ జీవితం కూడా దూరమవుతుంది. నేవిగేటింగ్ ఆఫీసర్, రేడియో ఆఫీసర్, మెరైన్ ఇంజనీర్స్ తదితరాల్లో కెరీర్ వెతుక్కోవచ్చు. ఇప్పటి వరకు ఇందులో మహిళలకు అవకాశాలు లేవు. అయితే షిప్ డాక్టర్లు, రేడియో ఆఫీసర్లుగా ఇప్పుడిప్పుడు వారు ఇందులోకి ఎంటర్ అవుతున్నారు. కోల్‌కతాలోని మెరైన్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ముంబైలోని చాణక్యలో చేరాలంటే మాత్రం జెఇఇలో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

ఇవికాకుండా... మర్చెంట్ నేవీలో శిక్షణ ఇచ్చే సంస్థలు

- Indian Maritime University (T.S. Chanakya), Karave Village, Sector 34, Nerul, Navi Mumbai, Maharashtra 400706, Ph: 022 2770 3876.
- Praveenya Institute of Marine Engineering & Maritime Studies (PRIME), D.No.-1-74-15, Plot No.61/3,Sector 3, MVP Colony, Visakhapatnam, Andhra Pradesh 530017,
- AMET UNIVERSITY, Plot No.135, East Coast Road, Kanathur, Chennai, Tamil Nadu 603112, Ph: 044 2747 2904.
- Commander Ali's Academy of Merchant Navy, Commander Ali's Estates, Survey No.469, Donthi, Shivampet Mandal, Medak District, Telangana 502334.
- Dr.B.R.Ambedkar Institute of Technology, Polytechnic Road, Pahargaon, Junglighat, Port Blair, Andaman and Nicobar Islands 744103, Ph: 03192 259 693.
- Indian Maritime College, Masilamani Street, T.Nagar, Chennai-600 0178. Ph: 044 2433 6953
- NUSI MARITIME ACADEMY, NUSIWADO, Sucaldem,Chinchinim, Salcette-Goa-403715, Ph: 0832 277 3859

ఫిజికల్, కెమికల్ అండ్ ఎర్త్ సైంటిస్టులు

ఇంజనీరింగ్ ద్వారా కెమికల్ ఇంజనీరింగ్ చేయవచ్చు. బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసిన వారికి కూడా కెమికల్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ డిప్లొమాలు ఉన్నాయి. జేఎన్‌టీయూ, ఆంధ్రా, ఓయూలలో కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఫిజిక్స్, మేథ్స్‌లో కూడా ఇలాంటి కోర్సులు ఉన్నాయి. డిగ్రీ/పీజీల్లో జాగ్రఫీ సబ్జెక్టులు చదివిన వారు జియాలజిస్టులుగా వెళ్లవచ్చు. ఓషనోగ్రఫీకి సంబంధించిన కోర్సులు ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నాయి. కెమికల్ ఇండస్ట్రీ, ఫిజిక్స్ అండ్ అలైడ్ ఫీల్డ్‌లో ఉపాధి ఉంటుంది. మేథమెటీషియన్స్ అండ్ స్టాటిస్టీషియన్స్, జియాలజిస్టులుగా, జాగ్రఫీ అండ్ జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ స్పెషలిస్టులుగా, మెట్రోలాజిస్టులుగా, ఓషనోగ్రాఫర్లుగా అవకాశాలుంటాయి.

ఆర్కిటెక్చర్ & కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ



మేథ్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు ఇందులో ఇంజనీరింగ్ చేయవచ్చు. టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా ఆధారంగా కూడా సర్టిఫికెట్ పొందవచ్చు. ఆర్కిటెక్చర్, నేవల్ ఆర్కిటెక్చర్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో ఉద్యోగాలుంటాయి.

పారా మెడికల్

సాధారణంగా రోగులు డాక్టర్ల దగ్గరికి వెళ్లిన తరవాత పలు రకాలు టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటినీ డాక్టర్లు నిర్వహించరు. ఈ విషయంలో పారా మెడికల్ సిబ్బంది సహాయపడతారు. పారా మెడికల్ కోర్సుల్లో ఆప్టోమెట్రీ, ల్యాబ్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ మొదలైనవన్నీ ఉంటాయి. ఈ కోర్సుల్లోని చాలా విభాగాల్లో ఉద్యోగ అవకాశాలతోపాటు, స్వయం ఉపాధికి కూడా అవకాశం ఉంటుంది.



క్యాబిన్ క్రూ



క్యాబిన్ క్రూ అంటే విమానంలో పనిచేసే సిబ్బంది. ప్రయాణికులు విమానంలో ఎక్కడానికి ముందు ప్రారంభమై, వారిని సురక్షితంగా చేర్చేంత వరకు కొనసాగుతుంది. సాధారణంగా వారానికి 30 వరకు పనిగంటలు ఉంటాయి. అయితే ఇతర ఉద్యోగుల్లా రోజుకు ఇన్ని గంటలు ఉండే అవకాశం ఉండదు. ఒకే రోజు 20 గంటలు కూడా పనిచేయాల్సి రావచ్చు. అయినా ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనీయకుండా చూసుకోవాలి. క్యాబిన్ క్రూలో చేరడానికి సాధారణంగా డిగ్రీని అర్హతగా పరిగణిస్తారు. వయసు 19-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. కొన్ని ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇంటర్ పాసైనవారికీ ఉద్యోగాలు ఇస్తాయి. అలాంటివారి వయసు 18-21 సంవత్సరాల మధ్యలో ఉండాలి. హోటెల్ మేనేజ్‌మెంట్/ టూరిజం డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎయిర్ హోస్టెస్‌లకు ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది. ఫస్ట్‌ఎయిడ్ తదితరాలను నేర్పిస్తారు. ఇక్కడ పని చేయాలనుకునే వారికి హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా వచ్చి ఉండాలి. పెద్ద పెద్ద సంస్థలు ఎయిర్ హోస్టెస్‌లకు మంచి మొత్తంలో జీతాలుగా ఇస్తాయి.

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)



దేశం- టువాలు

- పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియా, హవాయి దీవుల మధ్య ఉండే తొమ్మిది చిన్న దీవుల సముదాయమే టువాలు.
- 17, 18 శతాబ్దంలో డచ్, ఫ్రాన్సు, రష్యా, అమెరికా నావికులు ఎక్కువగా వెళ్లేవారు.
- 1892లో యూకే అధీనంలో ఉండేది. 1916లో ఇక్కడ ఉండే గిల్‌బర్ట్.. లాంటి చిన్న దీవుల్లో కాలనీలు ఏర్పరిచారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికన్లు, జపనీస్.. ఈ ప్రాంతం మాదే అనుకున్నారు. 1978లో ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.
- ఈ దేశంలో పన్నెండు వేల మంది మాత్రమే జనాభా ఉన్నారు. టువాలున్, ఇంగ్లీషు భాషలు మాట్లాడతారు.
- చేపల వ్యాపారం వల్లనే ఈ దేశానికి అధిక డబ్బు వస్తుంది.
- ఇక్కడ ఎక్కువగా ఫుట్‌బాల్ ఆడతారు. క్రికెట్, వాలీబాల్ ఆడేవాళ్లున్నారు ఇక్కడ.



- ఇది అభివృద్ధి చెందుతున్న దేశంగా ఐరాస ప్రకటించింది. బాధాకరమైన విషయమేంటంటే గ్లోబల్ వార్మింగ్ వల్ల ఈ దేశం పూర్తిగా కొన్ని సంవత్సరాల్లోనే తుడిచిపెట్టుకుపోతుంది. ఇప్పటికే అధిక శాతం మునిగిపోయింది.
- దీంతో ఈ దేశంలోని సంప్రదాయాలు, సంస్కృతులు కనుమరుగు కాకూడదనే లక్ష్యంతో దేశం మొత్తాన్ని డిజిటలైజ్ చేసింది. అంటే ఈ దేశానికి సంబంధించిన ప్రతి విషయాన్ని డాక్యుమెంటరీలు చేసింది. ఇలా దేశం మొత్తం డిజిటలైజ్ చేసిన తొలి దేశంగా ఇది రికార్డులకెక్కింది.
- ఇక్కడివాళ్లు సూర్యరశ్మిని తట్టుకోలేక పొడవైన దుస్తులు ధరిస్తారు.







సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



		9						3
5	6		2		4		7	
1		7	8	3			2	
9						8		
	3			5			9	
		2						7
	8			2	5	7		6
	9		7		3		8	4
2						9		

డైలీ సుడోకు - 308

సుడోకు - 307 సమాధానం

1	2	6	8	3	4	9	7	5
5	9	3	7	6	1	2	8	4
7	8	4	2	9	5	3	1	6
2	6	9	1	5	7	4	3	8
4	1	7	3	8	6	5	2	9
3	5	8	4	2	9	7	6	1
6	4	1	9	7	3	8	5	2
8	3	5	6	4	2	1	9	7
9	7	2	5	1	8	6	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.